ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
10-10-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 251 పేజీలు: 10+4 వెల: 6.50



తెలంగాణలో నేటినుంచి బతుకమ్మ సంబురాలు 9 రోజులు ప్రతి ఇంటిలో పూల పండుగ
7లో

ఉప ఎన్నికల్లో ఎవరి సీట్లు వారికే
ఆయా రాష్ట్రాల్లో పట్టు నిలుపుకొన్న అధికార పార్టీలు
బెంగాల్, అసోంలో సత్తా చాటిన బిజెపి
5లో



## 'శాంతి' నవనీతం

### భారత సంతతి మహిళకు అత్యున్నత నోబెల్ పురస్కారం

- దక్షిణాఫ్రికాలో హైకోర్టు న్యాయమూర్తిగా చేసిన నవనీతం పిళ్లై
- మానవహక్కుల కోసం దశాబ్దాలుగా పోరాటం
- 2008-14 మధ్య యుఎన్ హెచ్‌ఆర్‌సి హైకమిషనర్‌గా విధులు
- తమిళ మూలాలున్న నవనీతం పిళ్లై కుటుంబం తాతల కాలంలోనే సౌతాఫ్రికాకు వలస

**స్టాక్‌హోమ్, అక్టోబరు 9:** నవనీతం 'నావ్లి' పిళ్ళైకి 2026 నోబెల్ శాంతిబహుమతి వరించింది. భారతీయ తమిళ మూలాలున్న దక్షిణాఫ్రికా పౌరురాలైన పిళ్ళై, దక్షిణాఫ్రికా హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసిన మొదటి శ్వేతజాతేతర మహిళ. 85యేళ్ల వయసున్న ఆమె, ఐక్యరాజ్యసమితి (యుఎన్) మానవ హక్కుల విభాగం అధిపతిగా, రువాండా మారణకాండ ట్రిబ్యునల్ (న్యాయస్థానం)కు నాయకత్వం వహించిన ప్రముఖ న్యాయనిపుణురాలు. ఆమె ప్రస్తుతం అంతర్జాతీయ న్యాయ స్థానంలో న్యాయ >>2

భారత్ పైలట్ మచ్చర్‌కు



## ఇజ్రాయెల్ అత్యున్నత పురస్కారం

### సహాపైలట్ దాడిఘటనలో 174 మంది ప్రాణాలు కాపాడిన మచ్చర్

**టెల్‌అవీవ్, అక్టోబరు 9:** భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ విమానంలో సహ పైలట్ దాడి చేసినా వెనక్కి తగ్గలేదు.. తీవ్రంగా గాయపడినా ధైర్యంగా పోరాడి 174 మంది ప్రాణాలను కాపాడారు. ఆయన సాహసానికి ఇజ్రాయెల్ ప్రభుత్వం అరుదైన గౌరవం ప్రకటించింది. దేశ అత్యున్నత పౌర సాహస పురస్కారాన్ని అందించనున్నట్లు అధ్యక్షుడు >>2

# ఢిల్లీ అష్టదిగ్బంధనం



సిజెపి ఆందోళనలను నిరోధించేందుకు ఢిల్లీలో పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు దృశ్యం

### నేడు ఆందోళనలకు సిజెపి సిద్ధం

- అనుమతి లేదన్న పోలీసులు
- జంతర్‌మంతర్, ఇతర కీలక ప్రాంతాల్లో 35 వేల మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు
- 4 కి.మీ పరిధిలో ఇంటర్నెట్ నిలిపివేత
- మెట్రో స్టేషన్లు మూసివేత
- ఆరుచోట్ల డిటెన్షన్ సెంటర్లు ఏర్పాటు

**న్యూఢిల్లీ, అక్టోబరు 9:** దేశరాజధానినగరం పరిసరాలు ఇపుడు భారీ భద్రతా వలయంలో ఉన్నాయి. కాక్రోచ్ జనతాపార్టీ ఆధ్వర్యంలో సిఇసి జ్ఞానేశ్ కుమార్ గద్దెదిగాల్సిందేనంటూ చేస్తున్న ఆందోళన దృష్ట్యా నగరంలో బందోబస్తును పటిష్టంచేసారు. సిఇసి రాజీనామాచేయాలని, సర్ వ్యవస్థను రద్దు చేసి పాత విధానమే కొనసాగించాలంటూ ఇటు ఇండియా కూటమి పార్టీలతోపాటు సిజెపి కూడా తీవ్రస్థాయిలో ఉద్యమించిన సంగతి తెలిసిందే. అవసరమైన చట్టాలను ముందే సిద్ధంచేసుకున్న ఢిల్లీపోలీసులు సిజెపి ధర్నాకు అనుమతిని నిరాకరించారు. అలాగే ఎలాంటి ర్యాలీలు కూడా తీయడానికి వీలులేకుండా ఆంక్షలు అమలుచేస్తున్నారు. ఢిల్లీ మెట్రోసేవలు బంద్ అయ్యాయి. జంతర్‌మంతర్ చుట్టూ నాలుగుకిలోమీటర్ల పరిధిలో ఇంటర్నెట్ సర్వీసులు మొత్తం నిలిపివేసారు. సుమారు 35 వేల మంది బలగాలతో భద్రతా వ్యవస్థను ఏర్పాటుచేయడంపాటు ఎక్కడికక్కడ అరెస్టులుచేసేందుకుగాను నగరపరిధిలో మొత్తం ఆరు డిటెన్షన్ సెంటర్లు కూడా ఏర్పాటుచేసారు. అయినప్పటికీ కూడా సిజెపి చీఫ్ అభిజీత్ దీప్కే, సౌరభ్‌దాస్ వంటి నేతలు ఢిల్లీలో >>2



### నిరసనలు మీ హక్కు శాంతి పరిరక్షణ మా బాధ్యత

ఆందోళనకారుల విషయంలో సుప్రీం వ్యాఖ్య

**న్యూఢిల్లీ, అక్టోబరు 9:** నిరసన కార్యక్రమం నేపథ్యంలో భద్రతా చర్యల పేరుతో ఢిల్లీలో ప్రజా రవాణా వ్యవస్థను పూర్తిగా నిలిపివేయరాదని సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. మెట్రో స్టేషన్ల ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలను మూసివేయడం, రైళ్లను రద్దు చేయడం వంటి చర్యలతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకూడదని >>2



శుక్రవారం ఢిల్లీలో రాష్ట్రపతి ముర్ముతో భేటీ అయిన ఖర్గే, రాహుల్, మమత, తదితరులు

## జ్ఞానేశ్ రాజీనామా చేయాల్సిందే

### ఎన్నికల అక్రమాలపై రాష్ట్రపతి ముర్ముకు ఫిర్యాదు చేసిన 'ఇండి' నేతలు

బ్యాలట్‌తోనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్

రాష్ట్రపతిని కలిసిన బృందంలో ఖర్గే, రాహుల్, మమత ప్రభృతులు

**న్యూఢిల్లీ, అక్టోబరు 9:** దేశ ఎన్నికల వ్యవస్థలో అక్రమాలు జరుగుతున్నాయంటూ ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి ఫిర్యాదు చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో పలువురు ఎంపీలు, వివిధపార్టీల నాయకులు పార్లమెంట్ నుంచి రాష్ట్రపతి భవన్ దిశగా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వారిలో కొందరు రాష్ట్రపతిని కలిసి తమ డిమాండ్లతో కూడిన మూడు అంశాల వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, వివాదాస్పద ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ సర్ ప్రక్రియను రద్దు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ముసాయిదా ఓటర్ల జాబితాల నుంచి తొలగించినట్లు పేర్కొంటున్న 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని కోరాయి. రాష్ట్రపతితో సమావేశం అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న తమ ఆరోపణలను రాష్ట్రపతి తోసిపుచ్చలేదని, అయితే ఆధారాలు సమర్పించాలని కోరారని తెలిపారు. ఎన్నికలను ఎలా తారుమారు చేశా >>2

ఎల్ నినో, కరవు సమస్యలపై 12న మంత్రులతో సిఎం ప్రత్యేక భేటీ 2



శుక్రవారం క్యూర్ పనులపై సమీక్ష జరుపుతున్న సిఎం రేవంత్ రెడ్డి

# మెరుగైన ప్రజా రవాణా

- ఆధునిక సాంకేతికతకు పెద్ద పీట వేయాలి
- రీ సైకిల్డ్ వాటర్ వినియోగంపై పూర్తిస్థాయి అధ్యయనం
- 'క్యూర్' పనుల సమీక్షలో సిఎం రేవంత్

**హైదరాబాద్,అక్టోబరు9,ప్రభాతవార్త:** భవిష్యత్ అవసరాలకు తగినట్లు క్యూర్ పరిధిలో ప్రజా రవాణా సదుపాయాలు మెరుగుపర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. క్యూర్ పరిధిలో ప్రజా రవాణా మెరుగు, వివిధ రహదారుల అనుసంధానత, రీసైకిల్డ్ వాటర్ వినియోగంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం రాత్రి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ నగరంలో విపరీతమైన రద్దీ ఉన్న ప్రాంతాల్లో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (పిఆర్‌టి) సిస్టమ్ ఏర్పాటుకు అవసరమైన అంశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై సిఎం రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్కువ మంది ప్రజలు రవాణా సాగించే ప్రదేశాలతో పాటు వివిధ కర్మాగారాల్లో పని చేసే కార్మికులు, ఉద్యోగులు రాకపోకలు సాగించే ప్రదేశాల నుంచి మెట్రో, ఎంఎంటీఎస్, బస్ స్టేషన్లతో అనుసంధానించేలా పీఆర్టీ ఉండేలా డిజైన్ చేయాలని సిఎం సూచించారు. ప్రపంచంలోని అత్యుత్తమ పీఆర్టీలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని సిఎం ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందులో ముఖ్యమైన కాలనీల ఎంపిక, అత్యాధునిక సాంకేతికత, నిర్వహణకు పెద్ద పీట వేయాలన్నారు. క్యూర్ పరిధిలో >>2

# పరిష్కార దిశగా 22ఎ

- జిఒ 59 దరఖాస్తుదారులకు శుభవార్త చెప్పిన మంత్రి పొంగులేటి
- 500 చ.గ.లోపు పెండింగ్ దరఖాస్తులకు నెలలో పరిష్కారం
- అధికారులకు మార్గదర్శకాలు జారీ
- అర్హులైన ప్రతి ఒక్కరికి పూర్తి న్యాయం: మంత్రి



**హైదరాబాద్,అక్టోబరు9,ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత నెల 16వ తేదీన 22ఎ సమస్యలను పరిష్కారిస్తామని రాష్ట్ర శాసనసభలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ఈరోజు మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటుతో కలుపుకుంటే ఆరు ఉత్తర్వులను ఇవ్వడం జరిగిందని తాజాగా జిఒఎంఎస్ నెం. 59 కింద 500 చదరపు గజాలు, అంతకంటే తక్కువ విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ కోసం వచ్చిన దరఖాస్తులను నెలరోజుల్లోగా పరిష్కరించాలని కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మేరకు గతంలో జారీ చేసిన జిఒ నెంబర్లు 14, 22, 29, 41 అనుగుణంగా మెమో నెం. 48030ను జారీ చేశామని తెలిపారు.
దరఖాస్తుల పరిశీలనలో ఏమైనా అక్రమాలు లేదా నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు వెల్లడించారు. జిఒ 59 పరిధిలోని ఆస్తుల విషయంలో అసలు భూమి రికార్డులు, లబ్ధిదారుల అర్హత, క్రమబద్ధీకరించాల్సిన విస్తీర్ణం తదితర అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి చిన్న పొరపాటుకు కూడా తావు లేకుండా నిర్ణయం తీసుకోవాలని >>2

యేడాదిన్నరలో సమగ్ర భూ సర్వే పూర్తి: మంత్రి పొంగులేటి 7

## పౌరసరఫరాల్లో భారీ అవినీతి తిమింగలం

### ఎసిబి వలలో మహబూబాబాద్ సివిల్ సప్లైస్ మేనేజర్ నరసింహారావు, సోదాల్లో 9.5 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు

**ఖమ్మం క్రైమ్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** పౌర సరఫరాలశాఖలో ఓ అవినీతి తిమింగలం ఆస్తులచిట్టాను ఎసిబి అధికారులు బట్టబయలు చేశారు శుక్రవారం ఖమ్మం, సూర్యాపేట తదితర ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలుచేసి సివిల్‌సప్లై మేనేజర్ నరసింహారావుపై అధికారులు కేసు నమోదుచేశారు. తన సర్వీసు కాలంలో అవినీతి పద్ధతులు మరియు అక్రమ మార్గాల ద్వారా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో, ప్రస్తుతం మహబూబాబాద్‌లో జిల్లా మేనేజర్‌గా పనిచేస్తూ, గతంలో ఖమ్మం కలెక్టరేట్‌లో పనిచేసిన పౌర సరఫరాల శాఖ అసిస్టెంట్ మేనేజర్ (టెక్నికల్) వి. నరసింహారావుపై తెలంగాణ అవినీతి నిరోధక బ్యూరో (ఎసిబి) ఆదాయానికి మించిన ఆస్తుల (డిఎ) కేసును నమోదు చేసారు. అతని బంధువులు మరియు సహచరులకు సంబంధించిన 7ప్రదేశాలలో శుక్రవారం ప్రాథమిక సోదాలు నిర్వహించారు. సోదాల సమయంలో, రూ.9.5 కోట్ల స్థిర, చర అక్రమాస్తులను గుర్తించడం జరిగిందని ఎసిబి అధికారులు స్పష్టం చేశారు.

పెరుగుతున్న విద్యుత్ కోతలు

- 2 నుంచి 5 గంటలే నాణ్యమైన సరఫరా
- ఎండిపోతున్న పంటలు
- పురుగు మందుల డబ్బాలతో రైతుల ఆందోళనలు
- అధికారుల నిర్బంధాలు, ఘెరావ్‌లు
- సబ్‌స్టేషన్ల ముట్టడి.. ఉక్కిరిబిక్కిరి

## కరెం 'టెర్రర్'



**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త :** తెలంగాణలో అప్రకటిత విద్యుత్ కోతలను నిరసిస్తూ రైతులు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. సాగుకు నిరంతర విద్యుత్ అందకపోవడంతో చేతికొచ్చిన వరి తదితర పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికి అందివస్తున్న తరుణంలో సాగు నీరు లేక పంటలు ఎండిపోయి పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతాంగం కన్నీటి పర్యాంతమవుతోంది. రోజుకు కేవలం 2 నుంచి 5 గంటల మాత్రమే నాణ్యమైన కరెంట్ వస్తోందని వాపోతున్నారు. తరచూ విద్యుత్ కోతలు, వోల్టేజ్ సమస్యల వల్ల బోరు మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి తీవ్ర నష్టాలు వస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. నిరంతరాయంగా నాణ్యమైన, నిరంతరాయంగా కరెంటు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రోడెక్కుతున్నారు. రోడ్డుపై బైఠాయింపులు, రాస్తారోకోలు, సబ్ స్టేషన్ల ముట్టడి తదితర రూపాల్లో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, >>2



బిఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం వర్థంతి సందర్భంగా శుక్రవారం లక్నోలో నివాళులర్పిస్తున్న మాయావతి

# అత్యున్నత పురస్కారం

>> ఐజాక్ హెర్జోగ్ వెల్లడించారు. మచ్చర్ కోలుకున్న తర్వాత స్వయంగా పురస్కారాన్ని అందజేస్తానని తెలిపారు. ఈ ఘటనలో ధైర్యంగా వ్యవహరించిన ఆరుగురు ఇజ్రాయెల్ పౌరులకు సైతం హెర్జోగ్ పౌర సాహస పురస్కారాలను అందించారు. తాలి మేనెస్, జ్వికా మేనెస్, యానివ్ హయూన్, డాక్టర్ షోటా ముసాయేవ్, అసఫ్ రజువాన్, ఓర్ పార్డిలోవ్‌లను జెరూసలేంలోని అధ్యక్ష భవనంలో జరిగిన కార్యక్రమంలో సత్కరించారు. విమానంలో జరిగిన భయానక ఘటనను మచ్చర్ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో పంచుకున్నారు. ఇజ్రాయెల్ తదుపరి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోడీతో కలిసి వేడుక జ్యోతిని వెలిగించాల్సిందిగా మచ్చర్‌ను నెతన్యాహు ఆహ్వానించారు. గతవారం దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళుతున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. విమాన సహ పైలట్ హామామ్ అల్ హామామీ కాక్‌పిట్‌లోని గొడ్డలితో మచ్చర్‌పై దాడిచేశాడు. అనంతరం విమాన నియంత్రణను తన చేతుల్లోకి తీసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనను ఉగ్రదాడిగా యుఎఇ అధికారులు అభివర్ణించారు. తనపై దాడి జరిగినా మచ్చర్ ప్రతిఘటించారు. గాయాలతోనే కాక్‌పిట్ తలుపుతెరిచారు. దీంతో లోపలికి వచ్చిన ప్రయాణికులు దాడి చేసిన సహ పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి సాహసంతో విమానం ప్రమాదానికి గురికాకుండా నిలువరించగలిగారు.

## కరవు సమస్యపై12న మంత్రులతో సిఎం ప్రత్యేక భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు9:** తెలంగాణలో వర్షాభావ పరిస్థి తులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అలర్ట్ అయింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతోపాటు.. సాగు పనులకు తీవ్ర ఆటంకాలు ఎదురవు తుండటంతో రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టింది. ఈ పరిస్థితులను సమగ్రంగా సమీక్షించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఈనెల 12వ తేదీన మంత్రులతో ప్రత్యేక సమావే శాన్ని ఏర్పాటు చేయనున్నారు. వ్యవసాయరంగంతో పాటు సాగునీరు, తాగునీటి సరఫరా, విద్యుత్ అవసరాలు వంటి కీలక అంశాలపై ఈ భేటీలో చర్చించనున్నారు. రాష్ట్రంలో వర్షపాతం తగ్గడం వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. పంటల సాగు,నీటి లభ్యత, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. వర్షాలు తక్కువగా నమోదైన ప్రాంతాల్లో పరిస్థితిని అంచనా వేసి.. అక్కడి అన్నదాతలకు తక్షణ ఉపశమనం కల్పించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనేఅంశంపై సిఎం రేవంత్ రెడ్డి ఈ సమావేశంలో సమీక్షించనున్నారు. అవసరమైన సహాయక చర్యలను గుర్తించి.. వాటిని అమలు చేసేందుకు స్పష్టమైన ప్రణాళిక రూపొందించడంపై సమావేశంలో దృష్టి సారించే అవకాశం ఉంది.వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించనున్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా,పెరిగిన విద్యుత్ డిమాండ్, తక్షణఅవసరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు.రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులున్నాయి. కరువు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరింది. వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన కార్యాచరణ, సూచనలపై ఇందులో చర్చించే అవకాశముంది. వర్షాభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాలనుగుర్తించి, రైతులకు అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. వర్షాభావ పరిస్థితులపై ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన ప్రణాళికలను కూడా ఈ సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి పరిశీలించనున్నారు. త్వరలో నిర్వహించనున్న అఖిలపక్ష సమావేశంతో పాటు రైతు సంఘాలు, వ్యవసాయ రంగ నిపుణులు, ఇతర సంబంధిత వర్గాల నుంచి సేకరించే సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. వివిధ వర్గాల అభిప్రాయాలను పరిశీలించి.. క్షేత్రస్థాయిలో రైతులకు ఉపయోగపడే చర్యలను ఖరారు చేయడమే లక్ష్యంగా ఈ భేటీ జరగనుంది. వర్షాభావం మరింత తీవ్రమైతే ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి.. వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి రంగాల్లో ఇబ్బందులు తలెత్తకుండా కార్యాచరణ రూపొందించడంపై ప్రభుత్వం దృష్టి సారించనుంది.

## 13న తీవ్ర అల్పపీడనం!

### రాష్ట్రంలో భారీ వర్షాలకు ఛాన్స్

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త :** తెలంగాణ వాతావరణంలో త్వరలోనే కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ నెల 13న తీవ్ర అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ అల్పపీడనం క్రమంగా బలపడి తీవ్ర వాయుగుండంగా, ఆపై తుఫానుగామారే అవకాశాలు కనిపిస్తున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో ఈ నెల 15వ తేదీనుంచి పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు ప్రారంభమయ్యే సూచనలుఉన్నాయి. ప్రస్తుతం మండిపోతున్న ఎండలు సాధారణం కంటే 5 డిగ్రీలు అధికం:గా నమోదవుతున్నాయి. మరోవైపు తుఫాను రాకముందు రాష్ట్రంలో ఎండల తీవ్రత విపరీతంగా పెరిగింది. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో భానుడు ప్రతాపం చూపడంతో సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యాయి. వర్షాకాలంలో వేసవిని తలపించేలా పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం, తీవ్రమైన ఉక్కపోత తోడవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బంగాళాఖాతంలో చోటుచేసుకుంటున్న ఈ అల్పపీడన పరిణామాల వల్ల ఈ నెల 15 నాటికి తీర ప్రాంతాల్లో ఈదురు గాలుల వేగం పెరగనుంది. వాతావరణ శాఖ సూచనల ప్రకారం సముద్రం తీవ్ర అల్లకల్లోలంగా మారనున్నందున మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని హెచ్చరించారు. రైతులు సైతం ముందస్తుగా తమ పంటలను రక్షించుకునే చర్యలు చేపట్టాలని, రానున్న రోజుల్లో జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ అమలులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# 'శాంతి' నవనీత

>> మూర్తిగా వ్యవహరిస్తున్నారు. శాంతి మరియు అంతర్జాతీయ చట్టాన్ని పెంపొందించడంలో ఆమె చేసిన కృషికి గాను పిళ్ళైకి ఈ గుర్తింపు లభించిందని నార్వేజియన్ నోబెల్ కమిటీ ఛైర్మన్ జోర్గెన్ వాట్నే ఫ్రైడ్నెస్ తెలిపారు. పిళ్ళై "అంతర్జాతీయ చట్టం పరిధిని, ప్రభావాన్ని గణనీయంగా విస్తరించారు, మరింత సమగ్రమైన ప్రపంచ న్యాయ వ్యవస్థ దిశగా మార్గం సుగమం చేశార్ను అని ఆయన పేర్కొన్నారు. దక్షిణాఫ్రికాలో తీవ్ర వివక్షను ఎదుర్కొంటూ న్యాయవాదిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆమె సుదీర్ఘ కెరీర్‌ను నార్వేజియన్ నోబెల్ కమిటీ ఛైర్మన్ ప్రశంసించారు. "మరింత శాంతియుత ప్రపంచాన్ని నిర్మించాలని కోరుకునే వారందరికీ పిళ్ళై కృషి ఒక ఆశాకిరణం, స్ఫూర్తిదాయకం" అని ఆయన అన్నారు. పిళ్ళై విజయాన్ని ప్రకటిస్తూ, "యుద్ధాలు, సంఘర్షణలు పెరుగుతున్న తరుణంలో, అలాగే అంతర్జాతీయ చట్టానికి సంబంధించిన న్యాయమూర్తులు, సంస్థలు రాజకీయ దాడులకు గురవుతున్న సమయంలో, బలప్రయోగం లేదా హింస లేకుండా సంఘర్షణలను పరిష్కరించుకునే సామర్థ్యం అంతర్జాతీయ న్యాయ పాలనపైనే ఆధారపడి ఉంటుందని నోబెల్ కమిటీ గుర్తుచేయాలనుకుంటోంది. యుద్ధ నేరస్థులను జవాబుదారీగా ఉంచే, దుర్వినియోగానికి గురైన బాధితులకు న్యాయం జరిగే అంతర్జాతీయ న్యాయ వ్యవస్థ, శాంతియుత ప్రపంచానికి ఒక ముందస్తు షరత్ను అని అని నోబెల్ కమిటీ పేర్కొంది. "శాంతి, అంతర్జాతీయ చట్టాన్ని ప్రోత్సహించడానికి ఆమె చేసిన కృషిక్ని గాను ఆమెను ఈ బహుమతికి ఎంపిక చేశారు. అంతర్జాతీయ న్యాయ వ్యవస్థ అభివృద్ధిలో పిళ్ళై ముందంజలో ఉన్నారని, విజేతను ఎంపిక చేసే నార్వేజియన్ నోబెల్ కమిటీ పేర్కొంది.

**నవీ పిళ్ళై ఎవరంటే...:**

పిళ్ళై 1941లో దక్షిణాఫ్రికాలోని నాటల్ ప్రావిన్స్‌లోని దర్బన్‌లోని ఒక పేద ప్రాంతంలో నారాయణస్వామి నాయుడు, శాంతమా నాయుడు దంపతులకు జన్మించారు. ఆమె తాతముత్తాతలు 1890లలో దక్షిణాఫ్రికాలోని చక్కెర తోటలలో పనిచేయడానికి ఒప్పంద సేవకులుగా భారతదేశం నుండి వచ్చారు. ఒక బస్ డ్రైవర్ కుమార్తె అయిన పిళ్ళై, వర్ణవివక్ష కాలంలో పెరిగి, తన మానవ హక్కుల ఉద్యమాన్ని ప్రారంభించారు. వర్ణవివక్ష వ్యతిరేక కార్యకర్తల తరపున వాదించడం ద్వారా తన న్యాయవాద వృత్తిని ప్రారంభించిన పిళ్ళై, 1967లో తన సొంత న్యాయ సంస్థను స్థాపించారు. ఉగ్రవాద నిరోధక చట్టం కింద జరిగిన ఒక విచారణలో హింస, చట్టవిరుద్ధమైన విచారణ పద్ధతుల వాడకాన్ని బహిర్గతం చేసిన ప్రతివాద బృందంలో భాగంగా ఆమె గుర్తింపు పొందారు. 1973లో, రాబెన్ ద్వీపంలోని నెల్సన్ మండేలాతో సహా రాజకీయ ఖైదీలకు న్యాయవాదులను సంప్రదించే అవకాశం, మరికొన్ని ప్రాథమిక హక్కులు లభించేలా ఒక కేసును గెలిపించి ఆమె మరో ముఖ్యమైన విజయాన్ని సాధించారు. వర్ణవివక్ష పాలన ముగిసిన తర్వాత 1995లో హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన పిళ్లై, 1999లో రువాండా కోసం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ క్రిమినల్ ట్రిబ్యునల్ (ఐసిటిఆర్)కు న్యాయమూర్తిగా, అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. హుటు నాయకుడు జీన్‌పాల్ అకాయేసు విచారణ సందర్భంగా, అత్యాచారం, లైంగిక హింసను యుద్ధ నేరాలుగా పరిగణించవచ్చని నిర్ధారించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. ద్వేషపూరిత ప్రసంగాలు, ముఖ్యంగా సామూహిక ప్రసార మాధ్యమాల్లో చేసేవి యుద్ధ నేరాలుగా విచారించబడతాయని తీర్పునిచ్చిన మరో ముఖ్యమైన కేసులో కూడా ఆమె పాలుపంచుకున్నారు. ఆ తర్వాత 2003లో అంతర్జాతీయ క్రిమినల్ కోర్ట్ (ఐసిసి) న్యాయమూర్తిగా నియమితులైన పిళ్లై, 2012లో ముగియాల్సిన తన పదవీకాలం పూర్తికాకముందే 2008లో ఆ పదవికి రాజీనామా చేశారు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హై కమిషనర్ (ఒహెచ్‌సిహెచ్ఆర్)గా బాధ్యతలు చేపట్టేందుకు ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. అక్కడ ఆమె నాలుగేళ్ల పదవీకాలం (2008-12) మరో రెండేళ్లు పొడిగించబడింది. మయన్మార్‌పై నరమేధ ఆరోపణలు చేస్తూ పశ్చిమ ఆఫ్రికా దేశమైన గాంబియా దాఖలు చేసిన కేసులో, 2019లో ఆమె అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె)లో తాత్కాలిక న్యాయమూర్తిగా వ్యవహరించారు. ఈ కేసులోని వాస్తవాంశాలపై విచారణలు ఈ యేడాది జనవరిలో జరిగి ముగిశాయి. మే 2021లో ఇజ్రాయెల్- పాలస్తీనా ఘర్షణల నేపథ్యంలో ఏర్పాటు చేసిన 'ఆక్రమిత పాలస్తీనా భూభాగాలపై ఐక్యరాజ్యసమితి స్వతంత్ర అంతర్జాతీయ విచారణ కమిషన్‌కు 2021లో పిళ్లై అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. నవంబరు 2025 వరకు ఆ పదవిలో కొనసాగారు. అక్టోబర్ 2023 దాడుల తర్వాత హమాస్, ఇజ్రాయెల్ రెండూ యుద్ధ నేరాలకు పాల్పడ్డాయని ఈ కమిషన్ జూన్ 2024లో నిర్ధారించింది. అలాగే, గాజాలో చేపట్టిన సైనిక చర్యల్లో ఇజ్రాయెల్ నరమేధానికి పాల్పడిందని సెప్టెంబరు 2025లో ఆరోపించింది. అంతకుముందు, తన స్వదేశీయుడు, న్యాయ నిపుణుడు అయిన జాన్ దుగార్డ్‌తో కలిసి పిళ్లై 'ఓలోఫ్ పామ్ ప్రైజ్'ను కూడా అందుకున్నారు.

# ఢిల్లీ అష్టదిగ్బంధనం

>> నిరసన నిర్వహిస్తామని ఆగేదిలేదని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. వచ్చే పోయే వాహనాలన్నింటినీ నగర సరిహద్దుల్లోనే నిలిపివేయాలని నిర్ణయించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తన అధికారిక ప్రైవేటు కార్యక్రమాలన్నింటినీ రద్దుచేసుకుని పదవతేదీ ఆందోళన పైనే దృష్టిపెట్టారు. ఢిల్లీపోలీస్ మొత్తం హోంశాఖ పరిధిలోనే ఉండటంతో అమిత్‌షా ప్రత్యేకంగా దృష్టిపెట్టి ఎప్పటికప్పుడు సూచనలు జారీచేస్తున్నారు. జంతర్‌మంతర్‌వద్ద భారీఎత్తున నిర్వహించనున్న నిరసన ప్రదర్శనల కారణంగా శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ఢిల్లీలోని న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు 10న ఉదయం 4 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య చేరుకోవాల్సిన పలు మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేయాలని భారతీయ రైల్వే నిర్ణయించింది. ఈ రెండు స్టేషన్ల పరిసర ప్రాంతాల్లో తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంటూ రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.భద్రతా చర్యల్లో భాగంగా, ఢిల్లీలోని 57 మెట్రో స్టేషన్లను రెండు రోజుల పాటు మూసివేయాలని పోలీసులు మెట్రో అధికారులను కోరారు. జంతర్ మంతర్ పరిసరాల్లో సీసీటీవీలు, ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలతో నిఘాను కట్టుదిట్టం చేశారు. సిఇసి జ్ఞానేశ్ కుమార్ నివాసం, ఇసి కార్యాలయం వద్ద ఇప్పటికే ఉన్న జడ్‌ప్లస్ భద్రతతో పాటు భారీగా భద్రతను పెంచారు. ఢిల్లీకి వస్తున్న తమ కార్యకర్తలను నాగ్‌పూర్, భోపాల్ వంటి నగరాల్లోనే పోలీసులు అడ్డుకుంటున్నారని సిజెపి నేతలు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా పోస్టులపై కూడా ప్రత్యేక నిఘా పెట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఢిల్లీని మొత్తం పోలీసులతో దుర్భేద్యవలయంగా మార్చేసారు. ప్రత్యేక పోలీస్ బలగాలతోపాటు ఢిల్లీపోలీసులు సర్విలెన్స్ కెమేరాలతో నిరంతరం పర్యవేక్షణచేస్తున్నారు. ఢిల్లీలోని 57 మెట్రో స్టేషన్లను రెండు రోజుల పాటు మూసివేయాలని పోలీసులు మెట్రో అధికారులను కోరారు. జంతర్ మంతర్ పరిసరాల్లో సీసీటీవీలు, ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలతో నిఘాను కట్టుదిట్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నివాసం, ఇసి కార్యాలయం వద్ద ఇప్పటికే ఉన్న జడ్‌ప్లస్ భద్రతతో పాటు భారీగా భద్రతను పెంచారు. ఢిల్లీకి వస్తున్న తమ కార్యకర్తలను నాగ్‌పూర్, భోపాల్ వంటి నగరాల్లోనే పోలీసులు అడ్డుకుంటున్నారని సిజెపి నేతలు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా పోస్టులపై కూడా ప్రత్యేక నిఘా పెట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఢిల్లీని మొత్తం పోలీసులతో దుర్భేద్యవలయంగా మార్చేసారు. ప్రత్యేక పోలీస్ బలగాలతోపాటు ఢిల్లీపోలీసులు సర్విలెన్స్ కెమేరాలతో నిరంతరం పర్యవేక్షణచేస్తున్నారు.

## శాంతి పరిరక్షణ మా బాధ్యత

>> ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి ముందు అధికారులు తీసుకుంటున్న చర్యలపై కోర్టు స్పందించింది. మేము ఈ నగరంలోని సామాన్య పౌరుల తరఫున మాట్లాడుతున్నామని సిజెఐ పేర్కొన్నారు. అలాగే నిరసన మీ హక్కు అయినప్పటికీ శాంతిభద్రతల పరిరక్షణ కూడా మా బాధ్యత అని సిజెపికి చురకలువేసారు. గురుగ్రామ్, గ్రేటర్ నోయిడా, ఢిల్లీలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతిరోజూ ఉద్యోగాలు, విద్య కోసం ప్రయాణించే వేలాది మందిని అధికారులు దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ కారు ఉండదు. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత రవాణా సౌకర్యం అందుబాటులో ఉండదు. ప్రజలు ప్రజా రవాణాపైనే ఆధారపడతారు. ఈ విధంగా చేయడం సరికాదు. మెట్రో స్టేషన్లను మూసివేయడంపై మాకు తీవ్ర ఆందోళన ఉంది. జీవనోపాధి కోసం దూర ప్రాంతాలనుంచి వచ్చే ప్రయాణికుల గురించి మేము ఆలోచిస్తున్నాం. సామాన్యపౌరులు ఇబ్బందులు పడకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. శాంతిభద్రతలను కాపాడేందుకు, ప్రజల రాకపోకలను నియంత్రించేందుకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవచ్చని కోర్టు పేర్కొంది. ఆ చర్యల కారణంగా ప్రజా రవాణా సౌకర్యాలు పూర్తిగా అందుబాటులో లేకుండా చేయరాదనితెలిపింది. అల్లర్లకుపాల్పడే గుంపులను నియంత్రించండి. కానీ సామాన్య పౌరులకు ఇబ్బంది కలిగించే చర్యలు తీసుకోవద్దని సిజెఐ ప్రభుత్వానికి సూచించారు. ప్రజారవాణా పూర్తిగా నిలిచిపోకుండా చూడాలి సిపిఐ (ఎం) నేత ఎం.ఏ. బేబీ దాఖలు చేసిన పిటిషన్‌పై సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ, రైళ్ల రద్దు అంశాన్ని కూడా పరిశీలించాలని కోర్టును కోరారు. దీనిపై స్పందించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, పరిస్థితులను బట్టి రైలు సేవలను నియంత్రిస్తామని ధర్మాసనానికి హామీ ఇచ్చారు.

## మెరుగైన ప్రజా రవాణా

>> వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానత పెరిగేలా, రహదారుల్లో సజావుగా రాకపోకలు సాగించేలా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కెబీఆర్ పార్క్ చుట్టూ వన్ వేతో రాకపోకలు మరింత సజావుగా సాగేలా తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కెబిఆర్ పార్క్ చుట్టూ వన్ వేకు వివిధ కాలనీలు, రహదారుల నుంచి వచ్చే రహదారులు కలిసే చోటుతో పాటు ఫ్రీ లెఫ్ట్, యూటర్న్‌ల విషయంలో తీసుకుంటున్న చర్యలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. యూటిలిటీస్ తరలింపును వేగవంతం చేసి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీ చెక్ పోస్టు వైపు ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ముంబయి వంటి నగరాల్లో యేడాదిలోపే పనులు పూర్తవుతున్నాయని, అక్కడి వినియోగిస్తున్న సాంకేతికత, పనుల తీరుపై అధ్యయనం చేయాలని సిఎం సూచించారు. ప్రారంభించిన పనులు యేడాదిలోపు పూర్తయ్యేలా చూడాలని సిఎం ఆదేశించారు. హైదరాబాద్-ముంబయి బుల్లెట్ ట్రైన్ మార్గానికి సమాంతరంగా రేడియల్ రోడ్డు నిర్మాణంపై అధ్యయనం చేయాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రీసైకిల్డ్ వాటర్ వినియోగానికి సంబంధించిన పనులు వేగవంతం చేయాలని సిఎం ఆదేశించారు. హైరైజ్ బిల్డింగుల నిర్మాణం, ల్యాండ్ స్కేప్స్, పార్కుల్లో రీసైకిల్డ్ వాటర్ వాడేలా చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశించారు.క్యూర్ చట్టం అమలుకు సంబంధించి హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లు, హైడ్రా, వాటర్ బోర్డు, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## వారం - వర్జ్యం

10-08-2026, శనివారం,
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, హస్తకార్తె,
తి. అమావాస్య రా .9.23,
న. హస్త రా.9.45,
వ.లేదు,
దు.తె .5.58-ఉ.7.33,
రాహు :ఉ.9.00- ఉ.10.30,
శుభ. స. లేదు.

## వార్తాఫలం

**మేషం** :మానసిక వత్తిడి నుండి బయటపడతారు. దేవాలయ సందర్శనం చేసుకుంటారు.వాహన యోగ సూచన.

**వృషభం** : మీ ప్రతిభా పాటవాలు వెలుగు చూస్తాయి. శుభకార్య చర్చలు సాగిస్తారు. పోటీ పరీక్షలలో విజయాన్ని సాధిస్తారు.

**మిథునం** :వస్తు భద్రత పట్ల అప్రమత్తత అవసరం. వృత్తి, ఉద్యోగాల పరంగా అభివృద్ధిని సాధిస్తారు.

**కర్కాటకం** :ఆంతరంగిక భయాన్ని కలిగి ఉంటారు. ఎక్కువగా ఊహాలోకాలలో విహరిస్తారు. మాట తీరులో మార్పులు.

**సింహం** : కష్టించి పని చేస్తారు. మీ అంచనాలు నిజమవుతాయి. ఋణం ఇవ్వడం లేక ఋణం తీసుకోవడం జరుగుతుంది.

**కన్య** : మనీ రొటేషన్ స్కీంల పట్ల ఆకర్షితులవుతారు. గృహం లేక వాహన కొనుగోలు సానుకూల పడుతుంది.

**తుల** : ఆర్థికంగా స్వల్పమైన ఒడిదుడుకులు ఏర్పడతాయి. ఆరోగ్యం నలతగా ఉంటుంది.గ్రంథపఠనం చేస్తారు.

**వృశ్చికం** : స్థిరాస్తి వ్యవహారాలకు ప్రాముఖ్యతనిస్తారు. కుటుంబ విషయాల పట్ల దృష్టిని సారిస్తారు.జనసమీకరణలు చేస్తారు.

**ధనుస్సు** :మీలోని సృజనాత్మక వెలుగు చూస్తుంది. సంగీత, సాహిత్యాల పట్ల అభివృద్ధిని కనబరుస్తారు.

**మకరం** : చేజారిపోయాయి అనుకున్న అవకాశాలు తిరిగి చేరువవుతాయి. ఖర్చులు అధికంగా ఉంటాయి.

**కుంభం** : విలక్షణమైన శైలిని కనబరుస్తారు. చర్చలను, సంప్రదింపులను సాగిస్తారు. పరోపకార బుద్ధిని కలిగి ఉంటారు.

**మీనం** :బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తారు. టీం వర్క్ టీం స్పిరిట్తో పూర్తి చేస్తారు. ఆలోచనలు మెరుగ్గాసాగుతాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శుక్రవారం రాష్ట్రపతి భవన్ వెలుపల ప్రదర్శన జరిపిన కాంగ్రెస్ నేతలు ప్రియాంక గాంధీ, కెసి వేణుగోపాల్, రేణుకా చౌదరి ప్రభృతులు

# జ్ఞానేశ్ రాజీనామా చేయాల్సిందే

>> రనే విషయానికి తమ వద్ద అన్ని ఆధారాలున్నాయని, దేశమంతా ఈ పరిణామాలను చూసిందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్షాల ఆందోళనలు ప్రభుత్వ పునాదులను కదిలించాయని పార్లమెంట్‌లో ఇండియా కూటమి ఎంపీలు, నేతల సమావేశంలో రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గే మాట్లాడుతూ తమ ప్రతినిధిబృందం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి మెమొరాండం అందచేసారని ఓట్ల చోరీ జరిగిందని, ఈవిఎంలను పక్కనపెట్టి బ్యాలట్ పత్రాలతోనే ఎన్నికలు నిర్వహించేవిధానం రావాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్రపతికి తమ ప్రతినిదిబృందం మొత్తం విరాలు ఇచ్చిందని ఖర్గే చెప్పారు. అన్నింటా కూడా సిఇసి జ్ఞానేశ్‌కుమార్ పాత్ర స్పష్టంగా ఉందని ఖర్గే ఆరోపించారు.

**రహదారిపై బైఠాయింపు, నినాదాలు**

పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో సుమారు 150 మంది ఎంపీలు, ఇతర ప్రతిపక్ష నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 16 పార్టీలకు చెందిన 16 మంది నాయకులు రాష్ట్రపతికి సమర్పించే వినతిపత్రంపై సంతకాలు చేశారు. ఎన్నికల సంఘం పనితీరుపై తమ ఆందోళనలను అందులో వివరించారు.రాష్ట్రపతిని కలిసేందుకు 10 మంది నేతల బృందం వెళ్లగా, మిగిలిన నాయకులు కర్తవ్య పథ్‌లో బైఠాయించి నిరసన తెలిపారు.జ్ఞానేశ్ ఇక నీ పని అయిపోయింది బ్రో అనే అర్థం వచ్చే నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. ఓట్ల చోరీజరిగిందని, ఎన్నికల సంఘానికి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి మధ్య లింకులున్నాయని ఆరోపిస్తూ నినాదాలు చేశారు.రాష్ట్రపతిని కలిసే నాయకుల్లో ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా కూడా ఉన్నారు. దేశ ప్రజలందరి డిమాండ్ ఒక్కటేనని, నిజాయతీకి విరుద్ధంగా పనిచేస్తున్న వ్యవస్థను పూర్తిగా తొలగించాలని ఆయన వ్యాఖ్యానించారు. జ్ఞానేశ్ కుమార్ ఆ వ్యవస్థకు రక్షణ కవచంలా నిలుస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు చెందినవారైనా, కాకపోయినా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్న దేశభక్తులందరికీ అభివాదం చేస్తున్నానని అన్నారు.

# కరెంం 'టెర్రర్'

>> మెదక్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో సబ్ స్టేషన్లను ముట్టడించారు. సిద్దిపేట, కరీంనగర్, వికారాబాద్, సంగారెడ్డి, భువనగిరి తదితర జిల్లాల్లోని పలు సబ్‌స్టేషన్లను రైతులు దిగ్బంధించారు. ప్రధాన రహదారులపై బైఠాయించి రాస్తారోకోలు చేపట్టడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. వ్యవసాయ రంగానికి నాణ్యమైన 24 గంటల కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆందోళన స్థలాలకు చేరుకున్న విద్యుత్ శాఖ అధికారులు, పోలీసులతో రైతులు వాగ్వాదానికి దిగుతున్నారు. సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని తేల్చిచెప్పారు. మెదక్ జిల్లా చండూర్ సబ్‌స్టేషన్‌ను రైతులు ముట్టడించారు. నారాయణపేట జిల్లా మందిపల్లి సబ్‌స్టేషన్లను రైతులు ముట్టడించారు. వ్యవసాయానికి కరెంట్ సక్రమంగా ఇవ్వడం లేదని సిబ్బంది నిలదీశారు. సూర్యాపేట జిల్లా కోదాడ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. సిద్దిపేట జిల్లా గుర్రాల సోఫా, వీరానగర్ చౌరస్తాల వద్ద రామారం, గొల్లపల్లి, సయ్యద్‌నగర్, వడ్డేపల్లి, దొడ్లపల్లి, వీరారెడ్డిపల్లి ప్రాంతాలకు చెందిన వందలాది మంది రైతులు రోడ్డును దిగ్బంధించి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడంతో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యుత్తు అధికారులు వచ్చి కరెంట్ సరఫరాపై స్పష్టమైన హామీ ఇవ్వాలని రైతులు పురుగుల మందుల డబ్బాలు చేత పట్టుకుని ధర్నా చేపట్టారు. కరెంటు కోతలను నిరసిస్తూ భువనగిరి జిల్లా చిమిర్యాల, గుడిమల్కాపురంకు చెందిన రైతులు సబ్‌స్టేషన్ వద్ద బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. కామారెడ్డి జిల్లా బిచ్కుంద, భిక్కనూరు మండలాల్లో రైతులు ఆందోళనకు దిగారు. 12 గంటలైనా కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బిచ్కుంద సబ్‌స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కాగా భిక్కనూరు మండలం ఇసన్నపల్లి సబ్‌స్టేషన్ ఎదుట రైతులు ధర్నా చేపట్టారు. సంగారెడ్డి జిల్లాలో సిరిపుర సబ్‌స్టేషన్ వద్ద రైతులు, వడ్డేపల్లి సబ్‌స్టేషన్ వద్ద చింతల్‌చెరు రైతులు ఆందోళన చేశారు. లోవోల్టేజీ సమస్యతో మోటర్లు కాలిపోతున్నాయని ఆగ్రహిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం రైతులు రోడ్డెక్కారు. కాలిపోయిన వ్యవసాయ బోరు మోటర్లతో గ్రామంలోని సిరిసిల్లనిమ్మపల్లి ప్రధాన రహదారిపై బైఠాయించారు. జగిత్యాల జిల్లా పోతారంలోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో చేయడంతో రాకపోకలు నిలిచి ఇబ్బంది పడ్డారు. విద్యుత్ కోతలను నిరసిస్తూ సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం మాసాన్పల్లి గ్రామస్తులు బిల్ కలెక్షన్ కోసం గ్రామానికి వచ్చిన విద్యుత్ సిబ్బందిని గ్రామ పంచాయతీ ఆఫీస్‌లో నిర్బంధించారు. సంగారెడ్డి జిల్లా న్యాల్ కల్ మండలం హద్నూర్ సబ్ స్టేషన్ వద్ద అధికారులు నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ డిఇ, ఎఇలను ఘెరావ్ చేశారు.

# పరిష్కార దిశగా 22ఎ

>> సూచించారు.శుక్రవారం నాడు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా వ్యవహరించాలని సూచించారు. గత ప్రభుత్వంలో 59 జిఒను అనుసరించి కొన్ని అక్రమాలు జరిగాయని తమ దృష్టికి రావడంతో జీవో అమలును నిలిపివేయడం జరిగిందని అలాంటి తప్పులు పునరావృతం కాకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే పరిష్కరించబడిన కన్వేయన్స్ డీడ్స్‌ల జారీ అయిన కేసులను కూడా సమగ్రంగా పరిశీలించాలన్నారు. శాసనసభలో జరిగిన స్వల్పకాలిక చర్చ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీని కార్యరూపంలోకి తీసుకువస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రజల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. గతంలో జిఒ 59 కింద క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ అనేక కారణాలతో వాటిని సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచారని దీంతో చిన్నచిన్న ఇళ్ల స్థలాలు, ఆస్తులకు సంబంధించిన సమస్యలతో సామాన్య ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. న్యాయస్థానాల పరిధిలో ఉన్న దరఖాస్తులు, వివాదాస్పద అంశాల విషయంలో సంబంధిత కోర్టులు ఇచ్చే ఆదేశాలకు లోబడి మాత్రమే తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు.

గత నెల 16వ తేదీన శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 22ఎ సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలకు అనుగుణంగా సహచర మంత్రులతో చర్చించి 22ఎతో ముడిపడి ఉన్న 10 నుంచి 12 సమస్యలను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. శాసనసభలో ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన 24 గంటల్లోనే 22ఎ సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశాం. ఆ తర్వాత జిఒ 118 మరియు జిఒ 76లకు అనుగుణంగా స్పష్టమైన మెమోలను జారీ చేశాం. 22 ఎ జాబితాలో ఉన్నప్పటికీ జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎ, డిటిసిపి, మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతులు ఇవ్వడం, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ దరఖాస్తుల పరిష్కారం, నాలా ప్రక్రియ పూర్తికాని పట్టాభూముల సమస్యకు పరిష్కారం, తాజాగా 59జీవో అమలు దరఖాస్తుల పరిష్కారానికి స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ సెక్రటరీ డిఎస్ లోకేష్ కుమార్, స్టాంప్స్ రిజిస్ట్రేషన్స్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## టిజి సేఫ్ కేసుల విచారణకు ప్రత్యేక పోలీసు స్టేషన్

### రాష్ట్ర వ్యాప్తంగా టోల్ ఫ్రీ నంబర్లకు విస్తృత ప్రచారం

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కల్తీ ఆహార వస్తువులతో పాటు నకిలీ మందుల విక్రయాలపై ఉక్కుపాదం మోపేందుకు సర్కారు కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజిసేఫ్) నమోదు చేస్తున్న కేసుల విచారణకు ప్రత్యేకంగా పోలీసు స్టేషన్ ఏర్పాటు కానుంది. శాంతి భద్రతల పోలీసు స్టేషన్ తరహాలోనే ఈ పోలీసు స్టేషన్ కూడా పనిచేస్తుంది. ప్రస్తుతం పోలీసు విభాగంతో పాటు అబ్కారీ విభాగాలకు ప్రత్యేకంగా పోలీసు స్టేషన్లు వున్నాయి. ఈ స్టేషన్లకు కేసుల నమోదుతో పాటు విచారణ, నిందితుల అరెస్టు, జైలుకు తరలించడం వంటి హక్కులున్నాయి. దీంతో పాటు పోలీసు శాఖలోనే అంతర్భాగమైన సిఐడి, సైబర్ క్రైం పోలీసు వి భాగాలు కూడా సొంతంగా పోలీసు స్టేషన్లు కలిగివున్నాయి. బడా సైబర్ నేరాల విచారణకు ఏర్పాటైన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) కూడా సొంతంగా స్టేషన్ కలిగి వుంది. దీనికి సంబంధించి ఈ విభాగం నుంచి అందిన ప్రతిపాదనను సర్కారు ఆమోదించే వీలుంది. ఇందులో పనిచేసే సిబ్బందిని పోలీసు విభాగం నుండి డిప్యూటేషన్‌పై తీసుకోనున్నారు. ఎసిపి ఆధ్వర్యంలో ఈ స్టేషన్ పనిచేసే వీలుంది. మరోవైపు టిజి సేఫ్ టోల్ ఫ్రీ నంబర్ 1800...112..100తో పాటు ఫుడ్ సేఫ్టీ నంబర్ 9100105795, డ్రగ్స్ వింగ్ నంబర్ 1800...599...6969కు మరింత ప్రచారం కల్పించాలని టి.జి సేఫ్ నిర్ణయించింది,

# వచ్చే నెల హైదరాబాద్‌లో 85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సదస్సు

## ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ హాజరు

## హైటెక్స్ వేదికగా నాలుగు రోజులపాటు సమావేశాలు

## ఆర్ అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదారబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌ను కేవలం ఒక సదస్సుగా కాకుండా, తెలంగాణ రహదారుల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, రోడ్డు భద్రత, పెట్టుబడుల ఆకర్షణకు ఉపయోగపడే వేదికగా తీర్చిదిద్దాలని రోడ్లు, భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. శుక్రవారం సెక్రటేరియట్‌లో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నవంబరు 19 నుంచి 22వ తేదీ వరకు హైదరాబాద్‌లో హైటెక్స్‌లో నిర్వ హించనున్న 85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్ జాతీయ సదస్సు ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐఆర్‌సి సెక్రటరీ జనరల్ రాహుల్ గుప్తా, ఐఆర్‌సి డైరెక్టర్ సురేందర్ గర్గ్, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్,మోర్త్ రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్,ఐ అండ్ పిఆర్ కమిషనర్ ముకుంద్ రెడ్డి, ఆర్ అండ్ బి శాఖ చీఫ్ ఇంజనీర్లు ధర్మారెడ్డి,వసంత్ నాయక్,బి.వి రావు,నర్సింగరావు పలువురు ఆర్ అండ్ బిఇంజనీర్లు,ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతినిధులకు తెలంగాణ ఆతిథ్య సంప్రదాయాన్ని చాటిచెప్పేలా ఏర్పాట్లు చేయాలని, ప్రతి విభాగం బాధ్యతతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ సదస్సు ద్వారా హైదరాబాద్‌కు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుందని, తెలంగాణ మౌళిక సదుపాయాల అభివృద్ధికి కొత్త అవకాశాలు అందిపుచ్చుకునే అవకాశం ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డిసెంబర్ లో నిర్వహించ బోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ లో పెట్టుబడులను ఆకర్శించేలా ఈ ఐఆర్‌సి సమావేశం ప్రాతిపదిక అయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను కోరారు.

ఈ సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి మంత్రులు, కార్యదర్శులు, ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు, ఇంజనీర్లు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి రహదారుల నిపుణులు, విద్యావేత్తలు, సాంకేతిక నిపుణులు కలిపి సుమారు 3,000 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని మంత్రి తెలిపారు. హైటెక్స్‌లో సుమారు 400 ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా రహదారుల నిర్మాణం, ఆధునిక సాంకేతికత, భద్రత, మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఈ సదస్సులో చర్చలు జరగనున్నాయని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, నిపుణులు ఒకే వేదికపై సమావేశం కావడం వల్ల తెలంగాణకు జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభించడంతో పాటు పెట్టుబడులకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.సదస్సుకు హాజరయ్యే ప్రతినిధుల కోసం ప్రతి అతిథికి, విమానాశ్రయంలో స్వాగతం పలకడం నుంచి తిరుగు ప్రయాణంలో విమానం ఎక్కించే వరకు అవసరమైన సహాయ సహకారాలు అందించేలా, విభాగాల వారిగా నోడల్ అధికారులను నియమించుకొని పర్యవేక్షణ చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్లు, వారికి కేటాయించిన ఇంచార్జి బాధ్యతలు సక్రమంగా నిర్వహించి ప్రోగ్రాం సక్సెస్ చేయాలని తెలిపారు. నవంబర్ 19వ తేదీ ఉదయం 11 గంటలకు ఐఆర్‌సి ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. రహదారుల నిర్మాణం, భద్రత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలపై అంతర్గత చర్చలు, నిపుణులతో గ్రూప్ డిస్కషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఐఐటీ విద్యార్థులు, తెలంగాణలోని ఇంజనీరింగ్ కళాశాలల ప్రతినిధులు, రహదారుల రంగ నిపుణులను కూడా ఈ చర్చల్లో భాగస్వాములను చేస్తామని చెప్పారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన జోగుళాంబ ఆలయ కమిటీ ప్రతినిధులు

**హైదారబాద్,అక్టోబరు9,ప్రభాతవార్త:**ఈ నెల 16న జరిగే అలంపూర్ శ్రీ జోగుళాంబ అమ్మవారి కల్యాణోత్సవంలో పాల్గొనాల్సిందిగా కోరుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ఆలయ కమిటీ ప్రతినిధులు ఆహ్వానించారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హన్మంతరావు, గద్వాల సంస్థాన వారసుడు కృష్ణ రామభూపాల్ శ్రీ జోగుళాంబ అమ్మవారి దేవస్థానం ఈవో దీప్తి ముఖ్యమంత్రిని జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి ఆహ్వానం అందజేశారు.

## బైక్ అదుపు తప్పిన ప్రమాదంలో ఇద్దరు మృతి

**బెజ్జూర్, అక్టోబరు 9, ప్రభాతవార్త :** బెజ్జూర్ మండలంలోని రేచిని గ్రామంలో గురువారం సలగుపల్లి పల్లె ప్రకృతివనం వద్ద బైక్ అదుపుతప్పిన ఘటనలో దానిపై ప్రయాణిస్తున్న నికూరి రాజయ్య మృతి చెందగా బైకు నడుపుతున్న నికూరి అనంతరావు శుక్రవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందారు. అనంతరావు తండ్రి మల్లు మేర ప్రస్తుతం చికిత్స పొందు తున్నాడు. చనిపోయిన రాజయ్య అనంతరావుకు చిన్నాన్న. మృతుడు అనంతరావు అంబగట్ట పంచాయతీ ఉపసర్పంచ్. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రకృతి వనం మూలమలుపు వద్ద ప్రమాదాలు జరుగుతున్నా అక్కడ ఎలాంటి ప్రమాద సూచికలు గాని, రోడ్డు భద్రత సూచికలు గాని ఏర్పాటు చేయడం లేదని వాపోతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి సూచికలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



అనంతరావు(ఫైల్)

## ఎగుమతులకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

## ఖండాంతరాలు దాటిన తెలంగాణ ఖ్యాతి

# అమెరికాకు తెలంగాణ బియ్యం

**హైదారబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** తెలంగాణ ఖ్యాతి ఖండాంతరాలు దాటింది. ప్రధానంగా తెలంగాణ బియ్యం టేస్ట్ రాష్ట్రాలు దాటి ఇతర దేశాలకు పాకింది. దీంతో రాష్ట్రంలోని బియ్యం ఇతర దేశాలకు ఎగుమతికి సిద్ధమవుతున్నాయి. దేశీయ మార్కెట్లో ఫుల్ డిమాండ్ ఉన్న రాష్ట్రం లోని ముల్కనూర్ బియ్యం ఇకపై విదేశాలకు ఎగుమతి కానున్నాయి. అమెరికాలో ఉన్న ప్రవాస భారతీయుల డిమాండ్ మేరకు ముల్కనూర్ బియ్యాన్ని అమెరికాకు పంపేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. బియ్యం ఎగుమతులకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు బ్రాండ్ కు చెందిన జైశ్రీరామ్, తెలంగాణ సోనా రకం బియ్యానికి రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా అంతర్జాతీయంగానూ గుర్తింపు లభిస్తోంది. అమెరికా లోని తెలుగు వారి నుంచి ఈ బ్రాండ్ బియ్యం కోసం డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో ముల్కనూర్ సహకార సొసైటీ ఎగుమతి చేసేందుకు వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. 15 సంవత్సరాల నుంచి ముల్కనూర్ సొసైటీ తమ బియ్యాన్ని బ్రాండింగ్ చేసి అమ్మకాలు ప్రారంభించింది. క్రమేపీ సొసైటీకి చెందిన బీపీటీ, జైశ్రీరామ్, తెలంగాణ సోనా రకాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 51 కేంద్రాల ద్వారా ప్రతి ఏటా రూ.25 కోట్ల విలు వైన ముల్కనూర్ బియ్యాన్ని విక్రయిస్తోంది. ముల్కనూర్ బ్రాండ్ బియ్యం రుచి చూసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వారు అమెరికాలో ఉన్న తమ బంధువులకు సమాచారం అందించారు. దీంతో అమెరికాలో ఉన్న తెలుగువారు ఈ బ్రాండ్ పై మక్కువ చూపిం చారు. అమెరికాకు ఈ బియ్యాన్ని ఎగుమతి చేయాలంటూ గత సంవత్సర కాలంగా డిమాండ్లు వస్తున్న నేపథ్యంలో సొసైటీ అధ్యక్షుడు అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఈ మేరకు కసరత్తు ప్రారంభించారు. బియ్యం ఎగుమతులకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో అమెరికాలోని హార్వెస్ట్ లింక్ అనే సంస్థతో ఒప్పందం చేసుకొని ముల్కనూర్ బియ్యాన్ని విశాఖ పోర్టు ద్వారా అమెరికాకు పంపించేందుకు ప్రయత్నాలు మొద లెట్టారు. నాణ్యతపరంగా క్రిమిసంహారక మందు లు వాడని తెలంగాణ సోనా రకం, జై శ్రీరామ్ రకాలను ఎగుమతి చేయనున్నారు. స్థానికంగా జైశ్రీరామ్ రకం కిలో రూ.80, తెలంగాణ సోనా కిలో రూ.70 చొప్పున విక్రయిస్తుండగా, అమెరికాలో మన కరెన్సీ ప్రకారం కిలోకు రూ.200 వరకు ధర పలికే అవకాశం ఉంది. దీంతో ముల్క నూర్ సొసైటీ బియ్యం ఎగుమతికి మొగ్గు చూపింది. మొదటి విడతలో 25 టన్నుల బియ్యాన్ని అమెరికాకు పం పాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నౌకల ద్వారా ఎగుమతి చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. కంటైనర్ కు అనుమతి రాగానే 2 నెలల్లో ముల్కనూర్ బ్రాండ్ బియ్యం ఎగుమతి అవుతాయి. ఏటా రూ.100 కోట్ల టర్నోవర్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముల్కనూర్ సహకార సొసైటీ అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి తెలిపారు.

## జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలి

### కాంగ్రెస్ ఎంపి మల్లు రవి

**హైదారబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకొని బిజెపికి అనుకూలంగా వ్యవ హరిస్తున్నారనీ నిష్పక్షపాతంగా వ్యవహరించని ఆయన రాజీనామా చేయాలని కాంగ్రెస్ ఎంపి మల్లు రవి డిమాండ్ చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఇసికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ఇండి యా కూటమి ఎంపిలపై కేంద్రం పోలీసులతో అణిచివే వేస్తూ నిర్బంధం కొనసాగిస్తోందని విమర్శించారు. ఎఐసిసి అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రి యాంకగాంధీలపై పోలీసులతో భౌతికదాడికి పాల్పడ్డారని ఆరోపించారు. భవిష్యత్ కార్యచరణ రూపొందించడాదనికి మధ్యాహ్నం పార్లమెంట్‌లో ఇండియా కూటమి ఎంపిల సమావేశం జరుగనుందని తెలిపారు. ఆందోళనలు అణచి వేయడానికి ఛత్తీస్ గఢ్ నుంచి 7 వేల మంది బలగాలను ఢిల్లీకి తీసుకొచ్చారని మండిపడ్డారు. సిజెపి ప్రజాస్వామ్యబద్ధంగా ధర్నా చేస్తామని చెప్తే ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థను రద్దు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎవరూ నిరసన చేయకుండా అడ్డుకోవాలని బిజెపి ప్రభుత్వం చూస్తోందని ఎంపి రవి వ్యాఖ్యానించారు.

# మరో ఐదేళ్లు పిఎం కిసాన్ పథకం

## అంచనా వ్యయం రూ.3.15 లక్షల కోట్లు

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం దేశ రైతాంగానికి శుభవార్త అందించింది. ప్రతి ఏటా రైతులకు మూడు దఫాలుగా అందిస్తున్న రూ.6,000 సహాయానికి సంబంధించిన పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకాన్ని మరో ఐదేళ్లు కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ పథకాన్ని 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు కొనసాగించనున్నారు. ఇందుకోసం రానున్న ఐదేళ్లకు గాను మొత్తం రూ.3.15 లక్షల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసింది. కాగా పీఎంకిసాన్ పథకం ద్వారా, అర్హులైన రైతు కుటుంబాలకు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) విధానం ద్వారా సకాలంలో, పారదర్శకంగా కేంద్రం ఆదాయ మద్దతును అందిస్తోంది. ఇది రైతులు వ్యవసాయ పెట్టుబడులను పెంచుకోవడానికి, వారి జీవనోపాధిని బలోపేతం చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. పీఎంకిసాన్ పథకాన్ని ఫిబ్రవరి 2019లో ప్రారంభించారు. ఈ పథకం కింద, అర్హులైన భూమి ఉన్న రైతు కుటుంబాలకు సంవత్సరానికి రూ.6 వేల ఆర్థిక సహాయం మూడు సమాన వాయిదాలలో నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయబడుతుంది. ఈ పథకం కింద ఇప్పటి వరకూ 23 విడతల ద్వారా రూ.4.47 లక్షల కోట్లకు పైగా నిధులను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేసింది. 23వ విడత కింద, రూ.18,984 కోట్లకు పైగా విడుదల చేయడంతో 9.49 కోట్లకు పైగా రైతులు లబ్ధి పొందారు. ఇక కోవిడ్19 మహమ్మారి సమయంలో, రైతులకు ఆర్థిక సహాయం అందించడానికి రూ.1.71 లక్షల కోట్లకు పైగా పంపిణీ చేయబడింది. పీఎం కిసాన్ పథకం కింద మహిళా రైతులకు రూ.1.06 లక్షల కోట్లకుపైగా అందగా, ప్రతి నలుగురు లబ్ధిదారులలో దాదాపు ఒకరు మహిళా రైతు ఉన్నారు.

**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్**
**సమాచార ప్రకటన**

SARFAESI చట్టం 2002 క్రింద వేలం పద్ధతి ద్వారా AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్ వాణిజ్య బ్యాంక్)చే తనఖా పెట్టబడి అమ్మివేయబడుతున్న వాటి నుండి ఆస్తి నుండి (క్రింది పట్టికలో పేర్కొనబడినది) వారి చరాస్తులను తొలగించవలసినదిగా క్రింద పేర్కొనబడిన రుణగ్రహీతలు మరియు సహ-రుణ గ్రహీతలకు ఇందుమూలముగా సమాచారం తెలియచేయడమైనది. వాటిని 15 రోజులలో తొలగించక పోయినట్లయితే తరలింపులో వాటికి ఏ నష్టమైనా సంభవించే అవకాశం వుంది మరియు లేకపోతే ఆ చరాస్తులు వారి స్వంత ఖర్చుపై ఏ అద్దె భరించవలసిన స్థానానికైనా బదిలీ చేయబడతాయి. ఇతర విచారణలకు సంప్రదించండి: శెల్లా ప్రవీణ్ 8008801095 లేదా దగ్గరలోవున్న బ్రాంచ్ వద్ద.

రుణ ఖాతా నం./రుణగ్రహీత పేరు/సహ-రుణగ్రహీత/ తనఖాదారు/హామీదారు

(రుణ ఖాతా నం.) L22630000017880, వేములవాడ బ్రహ్మం (రుణగ్రహీత), వేములవాడ మేరీ (సహ-రుణగ్రహీత)

తాకట్టు పెట్టిన ఆస్తి వివరాలు: సర్వే నం. 2000, ప్లాట్ నం. 160/7, విస్తీర్ణం 117.55 చదరపు గజాలు; గ్రౌండ్ ఫ్లోర్ ప్లాన్ అనుమతి ప్రకారం నిర్మిత ప్రాంతం 716.36 చదరపు అడుగులు; ఇది పాత జి.పి. ప్రశాంతి నగర్, సిద్దిపేట, జిల్లా: సిద్దిపేట-502103 వద్ద ఉంది; ఈ స్థలం యొక్క సరిహద్దులు.

తేది : 09.10.2026
ప్రదేశం : హైదరాబాద్, TS

అధీకృత అధికారి
AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
సూపరింటెండింగ్ ఇంజనీరింగ్ కార్యాలయం-II
ఈస్ట్ వింగ్, 7వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్-500038.

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన**

NIT No. HMDA/DEV/SE-II/03/2026-27 తేది : 09.10.2026

ఈ క్రింది పనుల నిమిత్తం చెల్లుబాటైన నమోదిత కాంట్రాక్టరుల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్‌పై టెండర్‌లు కోరబడుతున్నవి. క్ర.సం.1. పనిపేరు: రాజీవ్ రహదారి (SH-01) పై శామీర్‌పేట వద్ద 1) ప్యారడైజ్ జంక్షన్ నుండి డెయిరీ ఫారమ్ రోడ్‌పై (NH-44) మరియు 2) ప్యారడైజ్ జంక్షన్ నుండి ORR జంక్షన్ నుండి ఎలివేటెడ్ కారిడార్ యొక్క నిర్మాణ కారణంగా ప్రభావితమయ్యే దేవాలయ ఆర్చ్ యొక్క పునర్నిర్మాణం. క్ర.సం.2) NH-44 పై ప్యారడైజ్ జంక్షన్ నుండి డెయిరీ ఫారమ్ రోడ్‌కు ఎలివేటెడ్ కారిడార్ యొక్క నిర్మాణ కారణంగా ప్రభావితమయ్యే తోకట్ట గ్రామం, సంజీవయ్య నగర్ వద్ద అంగన్‌వాడీ కేంద్ర భవనం మరియు సంక్షేమ భవనం యొక్క పునర్నిర్మాణం. టెండర్ ఆహ్వానించు అథారిటీ: సూపరింటెండింగ్ ఇంజనీర్-II, HMDA. ఆన్‌లైన్ బిడ్స్ దాఖలుకు చివరి తేది: 22.10.2026 మ.03.00గం. వరకు. తదుపరి వివరాలకు https//tender.telangana.gov.in వీక్షించండి.

సం/-. సూపరింటెండింగ్ ఇంజనీర్-II, HMDA.

DIPR.NO. 11680-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 09.10.2026

PEOPLE | PLANET | PROGRESS

**Driving Growth Through Responsible Mining & Innovation**

## Chairman's Statement for the 68th Annual General Meeting of NMDC LTD.

**Turnover**
**Rs.31,554 Cr.**

**PAT**
**Rs.7,421 Cr.**

**Production**
**53.16 MnT**

**Sales**
**50.24 MnT**




*Dear Shareholders,*

It gives me immense pleasure to present the Annual Report of NMDC Limited for the financial year 2025-26, a year marked by strong performance, significant milestones and continued progress towards our long-term vision.

The year 2026 has marked an important chapter in our national journey. Despite global economic and geopolitical uncertainties, India's progress remains steady and decisive. Our real GDP growth of 7.7% in FY26 reflects the strength of our economy and investment momentum. India is also asserting leadership in technology, innovation and global partnerships.

For NMDC, this has been a year replete with 'Eureka' moments where we discovered and rediscovered our true calling and embarked on a journey of profound transformation to harness our real potential. In FY26, we became the first mining company in India to produce more than 50 million tonnes of iron ore in a single year, achieving record production of 53.16 million tonnes and sales of 50.24 million tonnes, scripting history on stone. The numbers reflect an increase of 20.62% in production and 13.15% in sales year on year, which have been achieved organically, by optimizing and exceeding the capacities and capabilities of the existing production and sales equipments and infrastructure. NMDC has proved its resilience with such a quantum jump in production in a single year which is unprecedented and unparalleled in the industry. Through this commendable performance, NMDC has genuinely contributed to the strengthening of the foundation for India's infrastructure and industrial growth.

This operational excellence was naturally reflected in the financial performance of the Company which registered new echelons in turnover and other financial parameters. Revenue from operations increased by 33.31% to ₹31,554 crore, Profit After Tax rose by 10.88% to ₹7,421 crore and Net Worth increased by 14.39% to ₹33,836 crore. NMDC invested ₹3,384 crore in capital expenditure during the year while continuing to create value for shareholders through payment of interim dividend @ ₹2.50 per share and proposed final dividend @ ₹1.00 per share for FY 2025-26, subject to shareholders' approval.

India's rapid industrialization calls for secure, reliable and responsibly managed mineral resources. Our Vision 2030 of achieving 100 MTPA of iron ore production capacity is therefore not merely a business ambition, but an important contribution towards India's long-term mineral security and economic growth.

### Strengthening the Growth Platform

The next phase of NMDC's journey is focused on converting capacity and ambition into safe, efficient and dependable operations. Our 60 MT production target for FY 2026-27 represents an important step towards the 100 MTPA pathway.

Significant progress was achieved in strengthening our integrated mining and logistics infrastructure. The Kirandul– Jagdalpur rail-line doubling project achieved 98% overall progress, with 140 km completed and operational. Further, the Company has successfully commissioned its Slurry Pipeline Project on 26th September 2026, with the production of the first batch of fired pellets at its Pellet Plant in Nagarnar, Chhattisgarh. This milestone marks the successful integrated commissioning of the entire SPL system, comprising of Iron Ore Processing Plant (IOPP) at Bacheli, the 135 km Slurry Pipeline traversing three districts and 2.0 Million Tonne Pellet Plant at Nagarnar. These projects will enhance evacuation capacity and improve the overall efficiency of the Bailadila value chain.

NMDC also continued to diversify its domestic mineral portfolio. Tokisud North in Jharkhand commenced mining operations in January 2026, marking our entry into domestic coal mining. The ground-breaking of Bailadila Iron Ore Deposit-4, through NMDC-CMDC Limited, was undertaken in February 2026, with commencement of commercial operations. Significant progress in the development of Bailadila Iron Ore Deposit-13, which is also a part of NMDC-CMDC Limited, were undertaken during FY 2025-26, leading to its commercial operation in the months that followed.

It also makes me proud to inform that NMDC, in true recognition of the tireless and dedicated efforts of its human capital, made concerted efforts to provide quality life to its employees in the projects by commissioning new housing and anciliary facilities during the year and also undertaking the commencement of a few other such projects in its townships at Bailadila and Donimalai complexes.

Our earnestness and seriousness to emerge as a world class, global mineral behemoth took a significant leap with the opening of our offices in Dubai, UAE and Sydney, Australia. These offices are expected to support in NMDC's mineral diversification journey abroad.

### Technology, Sustainability and People

State of Art Technology and innovation are an integral part of NMDC's operations with an objective to improving operational visibility, decision-making, productivity and safety. Initiatives taken up include Digital Project Management Unit, Automated Sampling, Digitally Enabled Drilling and Blasting, Real-Time Material Visibility and Integrated Sustainability Data Systems.

Our commitment to responsible growth remains equally strong. NMDC is pursuing greater energy and resource efficiency, increased renewable energy utilisation, improved water and land stewardship and lower-carbon logistics. Our Net Zero Strategy and Roadmap provides a structured direction for reducing the environmental footprint of our operations.

Our people remain at the heart of this transformation. Safety continues to be a non-negotiable priority, complemented by focused investments in human capital through skill development, leadership enhancement and digital capabilities.

Through our CSR initiatives, NMDC also continues to contribute to healthcare, education, skill development and community infrastructure, particularly in the regions surrounding our operations.

### Corporate Governance

Corporate governance remains a cornerstone of NMDC's organisational ethos, underpinning every aspect of our operations and decision-making. We are committed to creating sustainable long-term value for all our stakeholders including shareholders, customers, suppliers, creditors, the Government of India, State Governments, regulatory authorities, and the communities we serve. Guided by the highest standards of integrity and accountability, we strive to ensure full compliance with applicable laws and regulations, both in letter and spirit. Through transparent governance practices, prudent risk management and responsible decision-making, we continue to strengthen stakeholder confidence and safeguard value creation.

### Looking Ahead

The year ahead will be the year of execution, consolidation and transformation. Stabilising our higher production base, reaching the 60 MT production milestone, completing critical infrastructure projects and advancing the next phases of capacity expansion will remain key priorities.

The journey towards 100 MTPA will require operational excellence, disciplined capital allocation, strong project execution, technology adoption and unwavering commitment to safety and sustainability. At the same time, NMDC will continue to explore opportunities for diversification into critical and strategic minerals, both domestically and internationally, in alignment with India's evolving mineral security needs.

I am confident that NMDC has the resources, capabilities and institutional strength to meet the opportunities and challenges ahead. We are building an enterprise that is larger in scale, stronger in capability, smarter through technology and more responsible in its operations.

I express my sincere gratitude to the Government of India, Ministry of Steel, Ministry of Mines, Ministry of Environment, Forest and Climate Change, other Government Departments and the State Governments for their continued guidance and support.

I also thank our employees and their unions, customers, suppliers, partners, host communities, regulators and shareholders for their continued trust and confidence.

Together, we will continue to build NMDC as a globally competitive mining enterprise and remain at the heart of India's journey towards a stronger, more self-reliant and mineral-secure future.

*Jai Hind*

Date : 28.09.2026
Place : Hyderabad

**Amitava Mukherjee**
Chairman and Managing Director



एनएमडीसी NMDC
Responsible Mining
Scientific | Sustainable | Spreading Smiles

/nmdclimited | Regd. Office: 10-3-311/A, 'Khanij Bhavan', Castle Hills, Masab Tank, Hyderabad-500028 | Website: www.nmdc.co.in | CIN: L13100TG1958GOI001674

Note : The above statement does not purport to be a record of the proceedings of the 68th AGM of NMDC held on 28-09-2026

వార్త

పాశ్చాత్య మేధావులు అన్నీ కాగలిగారు. మానవులు మాత్రం కాలేకపోయారు.

- దాశరథి రంగాచార్య

# ఔషధ 'ధర'హాసం!

ఒక్కో విషయం అత్యున్నత ధర్మాసనం జోక్యం లేకుండా దారిలో పడే పరిస్థితి లేదు. దేశంలో కేన్సర్ వ్యాధి విస్తృతమై రోగుల సంఖ్య పెరిగే కొద్దీ వారి కోసం ఎన్నో అత్యాధునిక వైద్యచికిత్సలు అందుబాటులోకి వస్తున్నాయి. వాటితో కేన్సర్ వ్యాధి గ్రస్తులకు సులువైన వైద్యం అంది ఉపశమనం లభిస్తోంది.వారి ఆయు: ప్రమాణం పెరుగుతోంది. ఎంతో సంతోషదాయక విషయం. కానీ అదే సమయంలో కేన్సర్ రోగులు వాడే ప్రామాణిక మందుల ధరలు మాత్రం కొండవీటి చాంతాడులా పెరిగి పోవడం ఆందోళన కలిగించే విషయం. అతి సామాన్య రోగులయితే మందులు కొనుక్కునే ఆర్థిక స్తోమత లేక మందులు వాడకంలో వెనుకబడ్డారు. రోగాన్ని ముదర పెట్టుకున్నారు. చావుకు అడుగుదూరంలో ఉలిక్కి పడిన సందర్భాలూ ఉన్నాయి. కేన్సర్ ఔషధ ధరలు కొండెక్కి కూర్చున్న విషయం సంగతి సుప్రీంకోర్టుకు చేరగాఅసలు ధరకు కొసరు మరీ అసాధారణంగా ఉండటానికి కార ణాలను ప్రశ్నించింది. గత నెలలో ఈ అంశంపై జస్టిస్ విక్రమనాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనంముందు అనేక ప్రశ్నలకు విచిత్రమైన సమాధానాలు బయటికొ చ్చాయి. కేన్సర్ ఔషధంఅసలు ధర రిటైలర్‌కు తక్కు వకి చేరుతుంది. అదే మందు కేన్సర్ రోగికి 27వేల రూపాయలకు అందుతోంది. ఈ విషయమై ధర్మాసనం ఆరా తీస్తే చిత్రవిచిత్రమైన సమాధానాలు తన ముందు కొచ్చాక కేన్సర్ రోగుల దోపిడీ దారుణమన్న సుప్రీంకోర్టు ఇలాంటి వ్యాపారాన్ని 'కేన్సర్ రోగిని నిలువు దోపిడీ' చేసినట్లేనని భావించింది. ఇంత భారీ దోపిడీ వెనుక 'గరిష్ట చిల్లర ధర' అనే వత్తాసు ఉండడంతో ధర్మాసనం తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఇలాంటి వాటిపై హేతు బద్ధతలేదని సుప్రీంకోర్టు మందలించింది కూడా. మందు లపై ఒకే విధమైన మార్జిన్ ధరను నిర్ణయించగలిగితే ఇలాంటి దోపిడీకి 'చెక్' పెట్టినట్లు అవుతుందని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. ఔషధ నియంత్రణ విధానం డొల్లతనం బయటపడడంతో కేంద్ర ప్రభుత్వం వీటి నియంత్రణపై దృష్టిసారించింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలతో ప్రభుత్వ తాజా నిర్ణయాలకు ఎలాంటి సంబంధం లేదని ప్రకటించుకుంటూనే ఔషధ నియంత్రణ విధా నంలో వెసులుబాటు తీసుకురావడంతో కేన్సర్ రోగుల మీద త్వరలో ఆర్థిక భారం తగ్గనుంది. షెడ్యూలు జాబితాలో ఉన్న కేవలం 18 శాతం ఔషధాలపై మాత్రమే ప్రభుత్వ నియంత్రణ ఉండేది. మిగితా 82 శాతం ఔషధాలను నాన్‌షెడ్యూలు జాబితాలో ఉంచినందున ప్రభుత్వం జోక్యం చేసుకోదని తాజాగా వివరణలు ఇస్తున్నారు. తాము వాటిపై తాజాగా నియంత్రణ చర్యలు తీసు కుంటున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇన్నాళ్లూ రోగులు ఔషధ ధరల తీవ్రతపై గగ్గోలు పెడుతున్నా కేంద్రప్రభుత్వం ఏనాడూ స్పందించలేదు. సుప్రీంకోర్టు తీర్పు అనంతరమే నాన్‌షెడ్యూలు మందుల ధరల నియంత్రణలోకి తీసుకున్నారు. ఇన్నాళ్లు క్లినిక్‌లు, డాక్టర్‌లుతమ అధీనంలోని షాపుల్లోనే ఇలాంటి ప్రాణాంతక మందులు అమ్మకాలపైనే ఆశపెట్టుకున్నారు. అందుచేతనే ఎవరూనోరిప్పలేదు. యేటా దాదాపు 15లక్షల మంది కేన్సర్ రోగులు పెరుగుతున్నా వారికి తక్కువధరకు అందుబాటులో ఉంచాల్సిన ప్రభుత్వం వాటికేసి కన్నెత్తయినా చూడలేదు. ఎప్పుడో 2019లోననుకుంటా 42 నాన్ షెడ్యూల్డ్ కేన్సర్ మందులపై జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ 30 శాతం మార్జిన్‌కు మాత్రమే అమలు చేసింది.దాంతో 526 బ్రాండ్ల మందులపై సగటున సగం రేట్లకు తగ్గాయి. తాజాగా మరికొన్ని ప్రాణాంతక ఔషధాల ధరలపై30శాతం పరిమితి వెసులుబాటు ఇవ్వడంతో మందుల ధరలు 70శాతం వరకు తగ్గొచ్చునని ఒక అంచనా! నిజానికిది దిద్దుబాటు చర్యే! రోగులు పెరుగుతున్నారు. వారి కోసం అత్యాధునిక మందులు తయారవుతున్నాయి. ఇలాంటప్పుడు గత ఏడేళ్లుగా కేన్సర్ అత్యవసర మందుల ధరలనుసమీక్షించకపోవడంతో సామాన్య ప్రజానీకం చాలా భారం మోసింది. ఇకపై కేన్సర్ ఔషధాల ఎంఆర్‌పి ధరలో వ్యాపారుల వాణిజ్యమార్జిన్ 30 శాతం మాత్రమే ఉంటుందని ప్రభుత్వం నిర్ణయించింది.ప్రస్తుతం అన్నీసజావుగా జరిగితే పాతస్టాకు, కొత్తస్టాకు అనే తేడాలు చూపకుండా రిటైల్ మందుల షాపుల వారిని సంప్రదిస్తే కేన్సర్ మందులు అత్యంత తక్కువకే లభిస్తాయి. బ్రాండెడ్, జనరిక్, దేశీయ, విదేశీయ, పేటెంటెడ్, నాన్ పేటెంటెడ్, నాన్ షెడ్యూల్,యాంటీ కేన్సర్ డ్రగ్ ధరలు భారీగా తగ్గుతాయి. ఈ నెలాఖరు నుంచి కేన్సర్ ఔషధాలపై 70శాతం ధరలుతగ్గుతాయి. 35రకాలపేటెంటెడ్ ఔషధాలే కాకుండా 110 యాంటీ కేన్సర్ ఔషధాల ధరలు తగ్గిపోనున్నాయి. రోగులను నిలువు దోపిడీ చేసే 'ఔషధ ధరలు నియంత్రణ' విధానంగా వాణిజ్య మార్జిన్ హేతుబద్ధతను కల్పించడమే ధ్యేయంగా పెట్టుకొంది. ఇలా అనుకున్న పద్ధతిలోనే ఔషధ ధరలు తగ్గితే దేశ వ్యాప్తంగా కేన్సర్ ధరలపై యేటా రూ. 2,500 కోట్ల మేర ఆదాయం ఆదా కాగలదు. ఆనాడు సుప్రీంకోర్టులో ప్రాణాంతక ఔషధాలపై 16శాతం మార్జిన్‌తో విక్రయించే విధంగా ఆదేశాలివ్వాలని కోరుతూ సుప్రీం ధర్మాసనం ముందు పిటిషన్ దాఖలవడం విచారణలో ఎన్నో అసంగత విషయాలు పలకరించాయి. దాంతో కేన్సర్ మందులన్నిటినీ తమ అధీనంలో ధరల నియంత్రణలోకి తెచ్చుకోవడం కేంద్ర ప్రభుత్వ తక్షణ చర్య స్వాగతించదగినది. జనరిక్ మందులకూ ఈ నిర్ణయం వర్తిస్తుంది. కేన్సర్ నిరోధానికి అత్యాధునిక చికిత్సలు, వినియోగ ప్రాణాంతక మందుల ధరల నియంత్రణ చర్యలు కేన్సర్ రోగులకు ఊరట కలిగించే పరిణామం.

యువతను మోసగించటం తేలిక. ఎందుకంటే వారు తొందరగా ఆశలు పెంచుకొని, భ్రమల్లో పడిపోతారు.



అరిస్టాటిల్

సాధారణంగా ప్రతి వారు 'నాకు' ముక్తి కావాలనుకుంటారు. ఇది సరికాదు. 'నాకు' అనే పదం నుండి ముక్తి కావాలి.



రమణ మహర్షి

# ప్రజావాక్కు

## ప్రభుత్వం ప్రజల సొమ్ముకి ధర్మకర్తే

మన రాష్ట్రప్రభుత్వం కోటిమంది మహిళలకు ఉచిత బస్ ప్రయాణం చేశారని గొప్పగా చెప్పినా, వ్యక్తిగత వాహన వినియోగం కూడా భారీగా పెరిగి ప్రభుత్వ రవాణా కేవలం15శాతానికి తగ్గి,ప్రభుత్వ ఆదాయంకూడా ఆ మేరకు తగ్గింది. ఉచితమనే ధీమా వల్ల తగినంత పనిలేకుండా కనీసం 30శాతం అధికంగా ప్రయాణిస్తున్నారు. ఇప్పుడు ఎలక్ట్రికల్ బస్సుల్లో కూడా ఉచితం అనుమతిస్తారట. ఇప్పటికే మహిళలతో డిపోల్లోనే బస్సులునిండి, మహిళలు సైతం ఆఫీసుకు సకాలంలో చేరలేకపోతున్నారు. గత ప్రభుత్వం బస్ చార్జీల్ని భారీగాపెంచితే, ఈ ప్రభుత్వంకూడా తగ్గించలేదు.కనుక మహిళలకి ఉచిత రవాణా బదులు సింగపూర్ చార్జీల వలె నామమాత్రంగానో, లేక ఇప్పటిచార్జీల్లో50శాతంమహిళలకు,30 శాతంపురుషులకి తగ్గిస్తే ప్రజారవాణా పెరిగి వ్యక్తిగత వాహన ప్రయాణం కూడా తగ్గి సమాజం మొత్తం హర్షిస్తుంది.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

## ఆర్థిక వ్యవస్థకు చిన్నవ్యాపారులే వెన్నెముక

దేశ ఆర్థిక వ్యవస్థకు చిన్న వ్యాపారులు, చిరు వర్తకులు వెన్నెముక వంటివారు. ఉపాధి కల్పనలో, స్థానిక ఆర్థిక కార్యకలాపాల అభివృద్ధిలో వారి పాత్ర ఎంతో కీలకం. అయితే వీరిలో చాలామంది పరిమిత వనరులతో వ్యాపారాలను నిర్వహిస్తుంటారు.ప్రత్యేకంగాఅకౌంటింగ్, పన్ను నిర్వహణ కోసం నిపుణుల సహాయం అందుబాటులో లేకపోవడం వల్ల అనుకోకుండా నిబంధనల ఉల్లంఘనలు జరిగే అవకాశం ఉంటుంది. జీఎస్‌టీ అమలులో నమోదయ్యే ప్రతితీవ్రమైనవ్యత్యాసాన్ని నేరంగా పరిగణించడం చిన్నవ్యాపారులపై అధిక భారం మోపే ప్రమాదం ఉంది. పొరపాటున జరిగిన తప్పిదానికి, ఉద్దేశపూర్వకంగాజరిగే పన్ను ఎగవేతకు మధ్య స్పష్టమైన తేడాను గుర్తించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## రాత్రిపూట కరెంటు కష్టాలు?

వరంగల్ జిల్లాలో మండల కేంద్రాలలో ఈ మధ్యకాలంలో ప్రతిరోజు సాయంత్రం 6 గంటల తర్వాత కరెంటు పోతుంది.విద్యార్థులకు పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. పసిపిల్లల నుండి పండు ముసలి వరకు కరెంటు కోతల తోచాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. కరెంటు సరఫరాలో ఉన్న ఇబ్బందులను డే టైంలో పూర్తి చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

## ఆలోచించండి

ఈమధ్య ఎక్కడ చూసినా అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా యువతులు, స్త్రీలపై జరుగుతున్న ఘటనలు చాలా బాధ కలిగిస్తున్నాయి.కామంతో కళ్లు మూసుకుపోయిన కొందరు వయసు కూడా చూడకుండా దారుణాలకు పాల్పడుతున్నారు. చివరకు ముసలివారిపై కూడాఅత్యాచారాలు జరుగుతుండటం మరింత కలచివేస్తోంది. ఇలాంటి దారుణాలకు పాల్పడేవారికి కనీస మానవత్వం కూడా లేకపోవడం బాధాకరం.ప్రభుత్వం, అధికారులు తమవంతు కృషి చేస్తున్నప్పటికీ,కొందరి ఆలోచనా విధానంలో మార్పు రావడం లేదు. ప్రతి పురుషుడు మహిళలను గౌరవిస్తూ, వారిని తన తల్లులు, సోదరీమణులుగా భావించే మంచి మనసు కలిగి ఉండాలి. ఆడపిల్లల పట్ల గౌరవం చిన్ననాటి నుంచే పెరగాలి. మహిళల పట్ల గౌరవం ప్రతి ఒక్కరి ప్రవర్తనలో కనిపించాలి. ఆడవారిని గౌరవించడం మన సంస్కారానికి నిదర్శనం. ఒక్కరిఆలోచనమారితే ఒక కుటుంబం కాపాడబడుతుంది. అత్యాచారాలకు తావులేని సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## పాఠ్యాంశాల్లో మార్పులు అవసరం

భారత ఉద్యోగ మార్కెట్‌లో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న కొద్దీ నైపుణ్యాల విలువ కూడా మారుతున్నాయి. కృత్రిమ మేధస్సు ఆధారిత ఉద్యోగాల్లో వేతన వృద్ధి వేగంగా ఉండగా, కొన్ని సంప్రదాయ సాంకేతిక ఉద్యోగాల్లో వేతనాల పెరుగుదల మందగించడం ఈ మార్పుకు సంకేతం. ఇది కేవలం వేతనాలఅంశం కాదు. విద్యార్థులు,ఉద్యోగులు భవిష్యత్ ఉద్యోగ మార్కెట్‌కు ఎంతవరకు సిద్ధంగా ఉన్నారనే ప్రశ్నను కూడా ముందుకు తెస్తోంది. కృత్రిమ మేధస్సుతో పాటు సైబర్ భద్రత, అర్థవాహక చిప్పులు, సమాచార సాంకేతికత వంటి రంగాల్లో నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది.

- సి.సాయిరుత్విక్, నల్గొండ

## క్రీడలతో పర్యాటకాభివృద్ధి

ఈఏడాది కేలో ఇండియా గేమ్స్ తెలంగాణలో నిర్వహించడం గొప్ప విషయం. తెలంగాణలో ఉన్న హనుమకొండ, ఖమ్మం, మహబూబ్ నగర్, కరీంనగర్ వంటి పట్టణాలలో పోటీలు జరగడం వల్ల గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉండడంతో పాటు పోటీలు పెద్ద ఎత్తున జరుగడానికి ఉపాయుక్తంగా ఉంటుంది తద్వారా పర్యాటక అభివృద్ధి కూడా సాధ్యం అవుతుంది.

-భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# అమలుకు నోచుకోని చట్టాలెందుకు?

**కొందరిని కొంతకాలం మోసం చేయొచ్చు. అందరిని కొంత కాలం మోసం చేయొచ్చు. అందరినీ ఎల్లకాలం మోసం చేయాలంటే అది భ్రమే అవుతుంది. అలా ప్రజలను మోసం చేసిన వారు,ఇబ్బందుల పాలు చేసినవారు,ఎందరో చక్రవర్తులు, రాజులు మరెందరో నేతలు చరిత్రహీనులుగా కాలగర్భంలో కలిసిపోయారు. ఎన్నో ప్రయాసలకు ఓర్చి, ప్రజావసరాలను గుర్తించి, ప్రజలకు ఇచ్చినమాట నిలబెట్టుకున్నవారు వారి ఆదరాభిమానాలు పొంది,వారి హృదయాల్లో చిరస్థాయికి స్థానం సంపాదించుకున్న నాయకులెందరో ఉన్నారు. ప్రస్తుతం మద్యం విషయంలో ఆదాయాన్ని యేడాదియేడాదికి పెంచుకుంటూ తీసుకుంటున్న చర్యలు ప్రజాస్వామ్యవాదుల్లో ఆవేదన వ్యక్తం చేస్తున్నది. మద్యం సరే సారాను నిషేధించారు. దాన్ని ఏ మేరకు అమలు చేస్తున్నారో పరిశీలిస్తే అర్థమవుతుంది. చివరకు ప్రభుత్వపరంగా నియంత్రించలేక, చీప్ లిక్కర్‌ను ప్రవేశపెట్టి దాని ద్వారా సారా తాగేవారిని ఇటు మరల్చేందుకు ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసమో పెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి.**

దామెర్ల సాయిబాబ

'రోజా మొక్కకు ముళ్లు, మొగ్గలుంటాయి, ముళ్లుగుచ్చుకున్నప్పుడు నొప్పి కలుగుతుంది, మొగ్గలు లభ్యమైనప్పుడు ముఖం వికసిస్తుంది ఈ వికార వికాసాలు ఆయా వ్యక్తుల మనోభావాలపై ఆధారపడి ఉంటాయి'. ప్రభుత్వం చేసే చట్టాలు కొందరికి బాధ కలిగించవచ్చు. మరికొందరికి ఎంతో ఊరట కలిగించవచ్చు. పాలకులు ఇలాంటి విషయాల్లో సమగ్రమైన అధ్యయనం చేసి తాము చేసే చట్టాల వల్ల ఎవరికి ఉపయోగం, మరెవరికి నష్టం, నష్టపోయిన వారిని ఎలా ఆదుకోవాలి?అమలులో సాధకబాధకాలు,సాధ్యాసాధ్యాలు అసలు ఆచట్టం అమలు చేసే సామర్థ్యం, అందుకు తగిన సిబ్బంది ఉందా? తదితర అంశాలను పరిశీలించి చట్టం చేయాలి. పాలకులు చేస్తున్న అనేక చట్టాలు కాగితాలకే మిగిలిపోతున్నాయి. మానవ జాతిని పట్టిపీడిస్తున్న ధూమపానం, మద్యపానాలను పారద్రోలే విషయంలో పాలకుల ఆరాటమేకానీ పోరాటం త్రికరణశుద్ధి లేదని చెప్పాలి.ధూమపానం, మద్యపానం రెండూ మానవజాతిని పట్టిపీడిస్తున్న భూతాలు. ఒకటి బ్రహ్మరాక్షసి అయితే, మరొకటి పిశాచి. ఇందులో మరోవాదనకు తావు లేదు. మద్యపానాన్ని పెంచి పోషిస్తూ, ఆదాయ వనరులుగా మలుచుకుంటున్నపాలకులు ధూమపానం విషయంలో ఏదోచట్టాలు చేసినట్లు చెప్పుకొంటూ నియంత్రిస్తున్నట్లు నటిస్తూ గారడీ చేస్తున్నారు. ప్రజారోగ్యానికి తూట్లు పొడుస్తున్న ధూమపానాన్ని పారద్రోలేందుకు కృషి చేయడం లేదనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే. చట్టాలు చేస్తున్నారు, ఉపన్యాసాలు ఇస్తున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. కానీ కనీసం ధూమపానాన్ని అయినా నియంత్రించేందుకు త్రికరణశుద్ధిగా ప్రయత్నాలు జరగడంలేదు. కొందరిని కొంతకాలం మోసంచేయొచ్చు. అందరిని కొంతకాలం మోసం చేయొచ్చు. అందరినీ ఎల్లకాలం దగాచేయాలంటే అది భ్రమే అవుతుంది. అలా ప్రజలను మోసం చేసినవారు, ఇబ్బందుల పాలు చేసిన వారు, ఎందరో చక్రవర్తులు, రాజులు, మరెందరో నేతలు చరిత్రహీనులుగా కాలగర్భంలో కలిసిపోయారు.ఎన్నోప్రయాసలకు ఓర్చి, ప్రజావసరాలను గుర్తించి, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నవారు వారి ఆదరాభిమానాలు పొంది, వారి హృదయాల్లో చిరస్థాయికి స్థానం సంపాదించుకున్న నాయకులెందరో ఉన్నారు. ప్రస్తుతం మద్యం విషయంలో ఆదాయాన్ని యేడాదియేడాదికి పెంచుకుంటూ తీసుకుంటున్న చర్యలు ప్రజాస్వామ్యవాదుల్లో ఆవేదన వ్యక్తంచేస్తున్నది. మద్యం సరే సారాను నిషేధించారు.దాన్ని ఏమేరకు అమలు చేస్తున్నారో పరిశీలిస్తే అర్థమవుతుంది.చివరకు ప్రభుత్వపరంగా నియంత్రించలేక, చీప్ లిక్కర్‌ను ప్రవేశపెట్టి దానిద్వారా సారా తాగేవారిని ఇటు మరల్చేందుకు ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసమో పెద్దలు మనసుపెట్టిఆలోచించాలి. ఇప్పుడు దేశవ్యాప్తంగా కానీ, మన తెలుగు రాష్ట్రాల్లో కానీ మద్యం అమ్మకాల్లో చీప్‌లిక్కరే అగ్రస్థానం. ఆదాయం చేకూర్చేది కూడా చీప్‌లిక్కరనేది అందరికి తెలిసిందే. తాగండి, తాపించిండి, ప్రభుత్వానికి ఆదాయాన్ని చేకూర్చమనే విధంగా వ్యవహరించడం అత్యంత దురదృష్టకరం,బాధాకరం. కొన్నిప్రాంతాల్లో గుడంబ, నాటుసారా ఒక కుటీరపరిశ్రమగా వర్ధిల్లుతున్నది. వాస్తవంగా చూస్తే మహాత్మాగాంధీ కలలకు అనుగుణంగా స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత 1947 అక్టోబరు ఒకటో తేదీనుంచి అప్పటి మద్రాసు ప్రభుత్వం మద్య నిషేధాన్ని విధించింది.అందులో భాగంగానే ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో మద్యనిషేధాన్ని విజయవంతంగా అమలు చేశారు. మద్యంవల్ల జరిగే కష్టనష్టాలను ప్రజలకు వివరించడంలో మరొకపక్క అక్రమంగా మద్యం తయారుచేసేవారిపై ఉక్కుపాదం మోపడంలోనూ ఆనాటిప్రభుత్వం ఎంతో సమర్థవంతంగా వ్యవహరించింది. మద్యంరక్కసి రాష్ట్రాన్ని వదిలిపెట్టక తప్పనిపరిస్థితులు ఏర్పడ్డాయి.అయితే 1960 ప్రాంతంలో రాజకీయజోక్యం పెరగడంతో కొందరు సారా తయారీదారులు, మరికొందరు రాజకీయ నాయకుల అండదండలతో నిషేధానికి తూట్లు పొడిచేందుకు శ్రీకారంచుట్టారు. మద్యనిషేధం వల్ల కోట్లాదిరూపాయల ఆదాయం కోల్పోతుందనే వాదన లేవనెత్తారు. ఫలితంగా 1969లో నిషేధానికి స్వస్తి పలికారు. ఆనాడు వందల కోట్లతో ఉన్న ఆదాయం ఇప్పుడు రెండు రాష్ట్రాల్లో కలిపి డెబ్బయ్,ఎనభై కోట్లకు చేరుకొన్నది. అది లక్షకోట్లకు చేరుకోవడం ఎంతో దూరం లేదు. మద్యనిషేధం అనేది రాజకీయ నినాదంగా మారిపోయింది. మద్యం ఆదాయంతో కొన్ని సంక్షేమ కార్యక్రమాలు చేస్తుండవచ్చు. కానీ మద్యంవల్ల ఎంత కష్టనష్టాలు జరుగుతున్నాయో ప్రజానేతలకు తెలియందికాదు. హత్యలు,అత్యాచారాలు, రోడ్డు ప్రమాదాలు ఒకటేమిటి మద్యం మత్తులో తండ్రే కన్నకూతురిపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇక ధూమపానం విషయంలో పాలకులు చట్టాలు చేస్తున్నారు. చర్యలు తీసుకుంటామని చెప్తున్నారు.ధూమపానం అనేది తెలుగు రాష్ట్రాలకో, లేక మన దేశానికో పరిమితం కాలేదు. ప్రపంచ వ్యాప్తంగా సమస్య పెరుగుతూనే ఉన్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యుహెచ్‌ఓ లెక్కల ప్రకారం భారత్‌లో పదిహేనేళ్లకు పైబడిన వారు ఇరవైనాలుగు న్నర కోట్ల మంది పొగాకును వినియోగిస్తున్నారు. ఇందులో పురుషులు పంతొమ్మిదిన్నర కోట్లమంది ఉండగా, మహిళలు దాదాపు ఐదుకోట్ల మంది ఉన్నారు. ఇంకొకవైపు దేశవ్యాప్తంగా బీడీలు, సిగరెట్లు తాగడం సరదాగా ఆరంభమై ఆతర్వాత అలవాటుగా మారిపోతున్నది. పదిహేనేళ్లలోపు పిల్లలుకూడా బీడీ, సిగరెట్లకు అలవాటుపడుతున్నారు. చుట్టా, బీడీ, సిగరెట్, గుట్కా, హుక్కా రూపురేఖ విలాసాల్లో వ్యత్యాసాలే కానీ వాటన్నింటికి మూలం పొగాకే. పొగాకు వాడకంతో దేశవ్యాప్తంగా దాదాపు పద్నాలుగు లక్షలమంది యేటా ప్రాణాలు కోల్పోతున్నట్లు అధికార అంచనా. మొత్తంమీద పొగాకు వినియోగం ప్రస్తుతం సామాజిక మహమ్మారిగా మారింది.పొగతాగే వారే కాదు వారిచుట్టూ ఉన్న వారి ఆరోగ్యానికి తూట్లు పడుతున్నాయి.చాలా మందిలో నోటి, గొంతు,ఊపిరితిత్తులు తదితర కేన్సర్లబారిన పడుతున్నారు. గుండెపోటు, అధిక రక్తపోటు,పక్షవాతం, మధుమేహం వంటి అనారోగ్యసమస్యలు కూడా ఎదుర్కొంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా యేడాదియేడాదికి పొగాకు వినియోగాన్ని తగ్గించాలన్నదే ప్రపంచ ఆరోగ్యసంస్థ లక్ష్యం. కానీ ఆ లక్ష్యం కనుచూపు మేరలో కన్పించే పరిస్థితులులేవు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి పొగాకు వినియోగాన్ని తగ్గించాలనిఒకటిన్నర దశాబ్దంక్రితమే చర్యలు ఆరంభించారు. అందుకు చట్టాలు కూడా చేశారు. బీడీ కట్టల మీద భయంకోల్పే పుర్రెబొమ్మ, శవం బొమ్మ ముద్రించాలని ఉత్తర్వులు కూడా జారీచేశారు. బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నిషేధించారు.చట్టమైతే చేశారు కానీ ఎవరు అమలు చేస్తారో తెలియకుండాపోయింది. అదంతా ఒక ఎత్తైతే లక్షలాదిమంది కార్మికులు ఈ పొగాకు ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారనే విషయాన్ని పాలక పెద్దలు విస్మరించారు. దీంతో వారిలో తీవ్రవ్యతిరేకత వ్యక్తమైంది. పొగాకు సాగు రైతులకు గిట్టుబాటు ధర ఇప్పిస్తామని చెప్పిమరొక పక్క ప్రోత్సహిస్తున్నారు. ఏ రోటి కాడ ఆ రోటి పాట అన్నట్లుగా ఉంది కొందరి నేతల వ్యవహార శైలి. ముందుగా జీవనోపాధి కోల్పోతున్న కార్మికులకు, రైతులకు, ప్రత్యామ్నాయం చూపించకుండా కాగితాలపై చట్టాలు చేసి చేతులు దులుపుకుంటేప్రయోజనం ఉండదనే విషయం పాలకులు తెలియనిదేమి కాదు. మరొక పక్క వేలాదిమంది రైతులు నేటికీ పొగాకు సాగు చేస్తున్నారు. రైతులతో పాటు మరెంతో మంది రైతు కూలీలుదీనిపై ఆధారపడి ఉన్నారు. ముఖ్యంగా లక్షలాది మందిగిరిజనులు బీడి ఆకులసేకరణతో శతాబ్దాల తరబడి జీవనం సాగిస్తున్నారు. ఆ కుటుంబాలు వీధిపాలు కాకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపైఉంది. అంతేకాదు పొగాకు ఉత్పత్తుల అమ్మకాలపై వివిధ పన్నుల రూపంలో యేటా వేలాది కోట్ల రూపాయలు వసూలు చేసుకుంటున్నారు. ఈ ఉత్పత్తులు అమ్ముకునేందుకు అధికారికంగా లైసెన్సులు ఇస్తున్నారు. దేవాలయాల ముందు పాఠశాలలు, కళాశాలలు, ఇలా ఒక్క చోటేమిటి మంచినీళ్లు దొరకని ప్రదేశాలున్నాయేమోకానీ సిగరెట్లు, బీడీలు దొరకని గ్రామాలు,ప్రదేశాలు లేవు. ఆదాయం కోసం ఇలా ఒకపక్క ప్రోత్సహిస్తూ మరొకపక్క నిషేధిస్తూ నియంత్రిస్తున్నామని చెప్పుకోవడం ఎంతవరకు సమంజసమో ఆత్మపరిశీలనచేసుకోవాలి. పాలకులకు చిత్తశుద్ధిఉంటే జీవనోపాధి కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయం చూపి పొగాకు ఉత్పత్తులను, అమ్మకాలను, వినియోగాన్ని నిషేధిస్తే అప్పుడే దీనికి పరిష్కారం లభిస్తుంది. అంతేకానీ అమలు చేయలేని, ఆచరణ సాధ్యం కానీ చట్టాలను చేస్తే పాలకులు నవ్వులపాలవుతారు. ●

## ఒక్క మాట

# వ్యక్తిగత డేటా భద్రతకు చర్యలేవి?

ఫిరోజ్ ఖాన్

పండుగల సీజన్‌లో మొబైల్, కంప్యూటర్ తెరిచిన వెంటనే కనిపించే ఆఫర్లు వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. ఆన్‌లైన్ కొనుగోళ్ల సందడి మరింతపెరిగింది. నచ్చిన వస్తువును ఎంచుకోవడం,ధరలను పోల్చడం, తగ్గింపు పొందడం, యూపీఐతో చెల్లించడం, ఇంటికే తెప్పించుకోవడం అంతా కొన్ని నిమిషాల్లో పూర్తవుతోంది. ఒకప్పుడు మార్కెట్‌కు వెళ్లి కొనాల్సిన వస్తువు ఇప్పుడు ఇంటి నుంచే అందుబాటులోకి వచ్చింది. ఇది వినియోగదారుడి సౌకర్యాన్ని మాత్రమే కాదు. వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ వాణిజ్యాన్ని కూడా ప్రతిబింబిస్తోంది. ఈసౌకర్యం వెనుక యాప్‌లు, సర్వర్లు, డేటా కేంద్రాలు, నెట్‌వర్క్‌లు, ప్రాసెసర్లు, చెల్లింపు వ్యవస్థలు కలిసి పనిచేస్తున్నాయి. మన చేతిలో కనిపించేది మొబైల్, మన ముందు కనిపించేది కంప్యూటర్. కానీ వాటి వెనుక పనిచేసేది విస్తృతమైన సాంకేతిక వ్యవస్థ. 2026ఆగస్టులో యూపీఐ ద్వారా 24,508.96 మిలియన్ లావాదేవీలు జరిగాయి. అంటే 24.5 బిలియన్లకు పైగా లావాదేవీలు.వాటి విలువ రూ.29,82,355.95 కోట్లకు చేరింది.డిజిటల్ చెల్లింపులు సామాన్యుడి రోజువారీ జీవితంలో ఎంతగా భాగమయ్యాయో ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఆన్‌లైన్ కొనుగోలులో డబ్బుతో పాటు పేరు, ఫోన్ నంబర్, చిరునామా, కొనుగోలు వివరాలు వంటి వ్యక్తిగత సమాచారం కూడా డిజిటల్ వ్యవస్థలోకి వెళ్తుంది. అందుకే సౌకర్యంతోపాటు డేటా భద్రతకు కూడా సమాన ప్రాధాన్యం అవసరం. సంస్థలు వ్యక్తిగత సమాచారాన్ని బాధ్యతగా నిర్వహించాలి. ప్రభుత్వం చట్టపరమైన రక్షణ, పర్యవేక్షణ, అమలు సామర్థ్యాలను బలోపేతం చేయాలి. వినియోగదారులు కూడా నకిలీ ఆఫర్లు, అనుమానాస్పద లింకులు, తెలియని చెల్లింపు అభ్యర్థుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం 2023తో పాటు 2025లో నిబంధనలు నోటిఫై కావడం డేటా రక్షణకు చట్టపరమైన వ్యవస్థను మరింత స్పష్టత వైపుతీసుకెళ్లింది. డబ్బు చెల్లింపు క్షణాల్లో పూర్తవుతుంది. కానీ వ్యక్తిగత డేటా భద్రతకు తీసుకునే జాగ్రత్త భవిష్యత్తు రక్షణను నిర్ణయిస్తుంది. పరిశ్రమలు ధరల పారదర్శకత, విక్రేత వివరాలు, రిటర్న్ నిబంధనలు, డేటా రక్షణలో స్పష్టత పాటించాలి. వినియోగదారుడుభారీ తగ్గింపు కనిపించగానే తొందరపడకుండా అసలు ధర, వారంటీ, విక్రేత వివరాలు పరిశీలించాలి. ప్రభుత్వం రూపొందించిన డేటా రక్షణ వ్యవస్థ సమర్థంగా అమలయ్యేలా సంస్థాగత సామర్థ్యాన్ని కూడా పెంచాలి. ఆఫర్ ఎంత ఆకర్షణీయంగా ఉన్నా భద్రతను పక్కన పెట్టకూడదు. సాంకేతిక అభివృద్ధి ఎంత వేగంగా ఉన్నా ప్రజల నమ్మకం అంతే బలంగా ఉండాలి. నేటి ఆఫర్ కొంత డబ్బు ఆదా చేయవచ్చు. నేటి సాంకేతిక పెట్టుబడి మాత్రం రేపటి తరాలకు కొత్త అవకాశాలను అందించగలదు.ఆన్‌లైన్ మార్కెట్‌ఎంత వేగంగా విస్తరిస్తుందో దానికి వెన్నుదన్నుగా నిలిచే దేశీయ సాంకేతిక సామర్థ్యం కూడా అంతే వేగంగా పెరగాలి.ప్రపంచం నుంచి సాంకేతికతను స్వీకరిద్దాం. ప్రపంచానికి సాంకేతికతను అందించే స్థాయికి ఎదుగుదాం. ●

# ప్రజలపై పంజా విసురుతున్న విషజ్వరాలు

మేకిరి దామోదర్

వాతావరణం మారుతోంది, దోమల స్వభావం మారుతోంది. ఫలితంగా మనుషుల ఆరోగ్యంపై ముప్పు ముదురుతోంది!. ఒకప్పుడు వర్షాకాలానికే పరిమితమైందనుకున్న డెంగీ ఇప్పుడు ఉష్ణోగ్రతలు, వర్షపాతం, తేమ, పట్టణీకరణ, పారిశుద్ధ్య లోపాలతో కలిసి ఏడాది పొడవునా పంజా విసిరే పరిస్థితి కనిపిస్తోంది. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ విషజ్వరాల భయం ప్రజలను వెంటాడుతోంది. తెలంగాణలో అక్టోబర్ ఆరంభం నాటికి మూడువేలకుపైగా డెంగీ కేసులు నమోదైనట్లు, ఇద్దరు మరణించినట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా కూడా 2026లో డెంగీ వ్యాప్తి కొనసాగుతోంది. ఆగస్టు నాటికి భారత్‌లో 46,670 కేసులు నమోదైనట్లు అంతర్జాతీయ పర్యవేక్షణ నివేదికలు పేర్కొంటున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం 2024లో ప్రపంచవ్యాప్తంగా 1.42 కోట్లకు పైగా డెంగీకేసులు నమోదై,11 వేలకుపైగా మరణాలు సంభవించాయి. వాతావరణ మార్పులు, వేగవంతమైన పట్టణీకరణ, దోమల వ్యాప్తికి అనుకూల వాతావరణం ఈ పెరుగుదలకు దోహదపడుతున్నాయని డబ్ల్యుహెచ్‌ఓ స్పష్టం చేస్తోంది. ఇటీవల జియోహెల్త్‌లో ప్రచురితమైన 2026 పరిశోధన డెంగీ–వాతావరణ సంబంధంపై కీలక విషయాలను వెలుగులోకి తెచ్చింది. కేరళలో 2006–2019 మధ్య 14 ఏళ్ల డెంగీ, వాతావరణ గణాంకాలను విశ్లేషించిన ఈ అధ్యయనంలో ఉష్ణోగ్రత, వర్షపాతం, సాపేక్ష ఆర్ద్రతతోపాటు పసిఫిక్ మహాసముద్రంలోని ఎల్‌నినో–లానినా పరిస్థితులు డెంగీ వ్యాప్తిని ప్రభావితం చేసే ముఖ్య కారకాలుగా గుర్తించారు. ముఖ్యంగా వర్షాకాలానికి ముందు 30.5–32.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత, 66–79 శాతం మధ్య సాపేక్ష ఆర్ద్రత,వర్షాకాలంలో మితమైన నుంచి అధికవర్షపాతం ఉన్నప్పుడు డెంగీవ్యాప్తికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నట్లు అధ్యయనం గుర్తించింది. అయితే భారీవర్షం పడిన ప్రతిసారీ డెంగీ పెరుగుతుందని కాదు. అతివర్షాలతో దోమల లార్వా కొట్టుకుపోయే అవకాశం ఉండటంతో కొన్ని సందర్భాల్లో వ్యాప్తి తగ్గవచ్చు. అందుకే వర్షపాతం పరిమాణం మాత్రమే కాకుండా దాని సమయం, తీవ్రత, నిల్వ నీరు వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. వ్యాధి కేసులు పెరిగిన తర్వా త స్పందించడం కంటే, ముందుగానే వాతావరణ సంకేతాల ను గమనించి ప్రజారోగ్య యంత్రాంగాన్ని అప్రమత్తం చేసే అవకాశం ఉందన్నమాట. అయితే ఎల్‌నినో ఒక్కటే డెంగీకి కారణం కాదు. దోమల సంతతి, వైరస్ వ్యాప్తి, వర్షపాతం, ఉష్ణోగ్రత, తేమ, నీటి నిల్వలు, పారిశుద్ధం, జనసాంద్రత వంటి అనేక అంశాలు కలిసి ప్రభావం చూపుతాయి. గతంలో భారతదేశంపై నిర్వహించిన అధ్యయనాలు కూడా ఉష్ణోగ్రత,వర్షపాతం, ఎల్‌నినోతో డెంగీ కేసులకు కాలవ్యత్యాస సంబంధాలు ఉన్నట్లు సూచించాయి. వాతావరణ మార్పులను పూర్తిగా నియంత్రించడం మన చేతుల్లో లేకపోయినా, దోమల పెరుగుదలకు కారణమయ్యే పరిస్థితులను మాత్రం నియంత్రించవచ్చు.



ఇంటిపరిసరాల్లో నిల్వఉన్న నీరు,పాతటైర్లు, కొబ్బరిచిప్పలు, పూలకుండీలు, నిర్మాణ ప్రదేశాల్లోని నీటి గుంతలు ఏడిస్ దోమలకు సంతానోత్పత్తి కేంద్రాలుగా మారవచ్చు. అందువల్ల దోమలను చంపడం,కంటే దోమలు పుట్టే ప్రదేశాలను నిర్మూలించడం మరింత స్థిరమైన పరిష్కారం. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలి. కాలువల్లో పూడిక తీయడం, చెత్తను తొలగించడం, నిల్వనీటిని తొలగించడం, అవసరమైన చోట లార్వా నియంత్రణ చర్యలు చేపట్టడం, దోమల సాంద్రతను పర్యవేక్షించడం స్థానిక సంస్థల నిరంతర బాధ్యత కావాలి. కేవలం వ్యాధి విజృంభించినప్పుడు ఫాగింగ్‌చేసి చేతులు దులుపుకోవడం కాకుండా, ముందస్తు దోమల నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేయాలి. డెంగీ అనుమానం ఉన్న ప్రాంతాల్లో జ్వరాల సర్వేలను విస్తరించి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్ధారణ పరీక్షలు వేగంగా అందుబాటులోకితేవాలి. బాధితులకు అవసరమైన వైద్యసేవలు అందించడంతోపాటు, రక్తనిల్వలు, ప్లేట్‌లెట్ సరఫరా,అత్యవసర వైద్యసదుపాయాలను సిద్ధంగా ఉంచాలి. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పేరుతో అధిక వసూళ్లు జరగకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షణ పెంచాలి. ప్రజలకు కూడా స్వయంగా మందులు వేసుకోవడం కాకుండా, జ్వరంకొనసాగితే వైద్యుల సలహా తీసుకోవాలనే అవగాహన కల్పించాలి. డెంగీ నియంత్రణలో మరో కీలక పరిణామం టీకా రంగంలో చోటుచేసుకుంది.జపాన్‌కు చెందిన టకెడా అభివృద్ధి చేసిన క్యూడెంగా టీకాకు 2026లో భారత్‌లో అనుమతి లభించింది. నాలుగు డెంగీ వైరస్ సెరోటైపులపై రక్షణ కల్పించే ఈ టీకా 4–60 ఏళ్ల వయసు వారికి రెండు డోసులుగా ఇవ్వడానికి అనుమతించబడింది. అయితే భారత మార్కెట్లో దీని అందుబాటు 2027 మధ్య కాలం నుంచి ఉండే అవకాశం ఉందని సమాచారం. టీకా అందుబాటులోకి వచ్చినా అదిడెంగీకి సంపూర్ణ కవచంకాదనే విషయాన్ని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలి. టీకాతో పాటు దోమల నియంత్రణ,వ్యక్తిగత జాగ్రత్తలు, పారిశుద్ధం, ముందస్తు నిర్ధారణ అన్నీసమాంతరంగా సాగాలి. ప్రభుత్వాలు డెంగీ నియంత్రణను కేవలం వైద్యశాఖ బాధ్యతగాచూడకూడదు. మున్సిపల్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, విద్య, నీటిపారుదల, పురపాలక శాఖలతో సమన్వయంతో వన్ హెల్త్ దృక్పథంలో పనిచేయాలి. వాతావరణ శాఖ నుంచి వచ్చే ఉష్ణోగ్రత,వర్షపాతం,తేమ సూచనలను ఆరోగ్య శాఖ డెంగీ నిఘాగణాంకాలతో అనుసంధానంచేసి ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను రూ పొందించాలి. కేరళ అధ్యయనం సూచించినట్లుగా వాతావరణ సంకేతాలను కొన్ని నెలల ముందే విశ్లేషించగలిగితే, డెంగీ ఉధృతి మొదలయ్యేలోపే నివారణ చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది.ప్రజారోగ్యాన్ని కాపాడటం అంటే ఆసుపత్రుల్లో పడకలు పెంచడంమాత్రమే కాదు. వ్యాధి పుట్టే పరిస్థితులను ముందుగానే అరికట్టడం. వాతావరణ మార్పు మనకు హెచ్చరిక గంట మోగిస్తుంటే, పారిశుద్ధ్య నిర్లక్ష్యం దానికితాళం తీస్తోంది. డెంగీని జయించాలంటే ప్రభుత్వం స్పందించే వరకు ప్రజలు వేచి ఉండకూడదు. ప్రజలు అప్రమత్తమయ్యే వరకు ప్రభుత్వం కూడా ఆగకూడదు. దోమ చిన్నదే కావచ్చు. కానీ దాని నిర్లక్ష్యానికి మూల్యం ప్రాణంకావచ్చు. ప్రాణం పోయిన తర్వాత వైద్యం కాదు.. ప్రాణం పోకుండా ముందస్తు నివారణే అసలైన ప్రజారోగ్యపాలన. వాతావరణ హెచ్చరికలను నిర్లక్ష్యం చేస్తే డెంగీ హెచ్చరికగా కాదు.. విపత్తుగా మారుతుంది. కేంద్ర, రాష్ట్ర,స్థానిక సంస్థల పరిపాలన విభాగాలు సమన్వయంతో ప్రజారోగ్య పరిరక్షణకు పూనుకోవాలి. ●

# పవన, సౌర విద్యుత్ 2,800 మెగావాట్ల కొనుగోలు

## సాంప్రదాయేతర ఇంధన వనరులపై దృష్టి

## రాష్ట్ర పంపిణీ సంస్థలకు సర్కార్ అనుమతి

**హైదరాబాద్, అక్టోబరు 9,ప్రభాతవార్త:** భవిష్యత్తులో తెలంగాణలో విద్యుత్ కొరతను నివారించడంతో పాటు, పీక్ డిమాండ్‌ను తట్టుకునేందుకు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రత్యమ్నాయ చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా పవన, సౌర, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ, 24 గంటల పాటు నిరంతరంగా లభించే సంప్రదాయేతర విద్యుత్‌ను దీర్ఘకాలిక ప్రాతిపదికన కొనుగోలు చేసేందుకు నిర్ణయించాయి. ఇప్పటికే విద్యుత్ ఎక్స్ఛేంజ్ నుండి కొనుగోలు చేస్తున్న పంపిణీ సంస్థలు, వాటితో పాటు, పవన, సౌర, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ తదితర సంప్రదాయేతర ఇంధన వనరుల ఆధారిత విద్యుత్ కొనుగోలు చేయడానికి సిద్ధమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం 18,776 మెగావాట్ల డిమాండ్ ఉండగా, విద్యుత్ ఎక్స్ఛేంజ్‌లో 4906 మెగావాట్ల మేర కొనుగోలు చేశాయి. ఇందుకు యూనిట్‌కు రూ.10 చొప్పున ఖర్చు చేశాయి. మరోవక్క సాంప్రదాయేతర ఇంధన వనరులద్వారా ఉత్పత్తియ్యే విద్యుత్‌ను సేకరించాలని రాష్ట్ర పంపిణీ సంస్థలు చర్యలు చేపట్టాయి. అవసరమైన అనుమతి కోరుతూ తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్‌లో ఇటీవల విద్యుత్ పంపిణీ సంస్థలు పిటిషన్లు దాఖలు చేశాయి. ఇందులో భాగంగా 25 యేళ్లకాలం పాటు 800 మెగావాట్ల పవన విద్యుత్, 3000 మెగావాట్ల సౌరవిద్యుత్‌ను సేకరించనున్నట్లు పిటిషన్లలో పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో ఈ మేరకు దీనికి సంబంధించిన అనుమతినిస్తూ రాష్ట్ర విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండంలో 800 మెగావాట్లు, శంకర్‌పల్లిలోని తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో భూముల్లో బిల్ట్ ఆపరేట్ ఓన్ విధానంలో 15 ఏళ్ల కాలానికి బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ ఏర్పాటుకు టెండర్లు పిలవనున్నారు. 800 మెగావాట్ల పవన విద్యుత్‌ను 25 ఏళ్ల కాలం పాటు కొనుగోలు చేయడానికి తెలంగాణ రెడ్‌కో టెండర్లు చేపట్టనుంది. 6000 మెగావాట్ల బీఈఎస్ఎస్ ద్వారా 25 ఏళ్లకాలం పాటు విద్యుత్ కొనుగోలు చేసేందుకు రెడ్‌కోకు అనుమతినిచ్చారు. సంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా రోజులో 24 గంటల పాటు సరఫరా చేసే సంస్థల నుంచి, 2000 మెగావాట్ల విద్యుత్‌ను 25 ఏళ్లపాటు కొనుగోలు చేయనున్నారు.

# బతుకమ్మ వేడుకలకు ముస్తాబైన రవీంద్రభారతి

**సంబురాలకు రూ.10 కోట్లు కేటాయించిన ప్రభుత్వం**

**భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డా. ఏనుగు నరసింహారెడ్డి**

**హైదరాబాద్ (రవీంద్రభారతి), అక్టోబరు 9, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శనివారం నుండి 9 రోజులపాటు బతుకమ్మ సంబురాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు, తదనుగుణంగా రవీంద్రభారతి రంగురంగుల విద్యుత్ దీపాలు, పూలతోరణాలు, సౌండ్ సిస్టమ్స్ ముస్తాబు చేసినట్లు భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డా. ఏనుగు నరసింహారెడ్డి తెలిపారు. ఈ మేరకు రవీంద్రభారతిలో విలేకరులు వెల్లడించారు. అనాది కాలం నుండి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్న బతుకమ్మ వేడుకలు రవీంద్రభారతి, హైదరాబాద్‌సహా రాష్ట్ర వ్యాప్తంగా వైభవోపేతంగా నిర్వహించేందుకు ప్రభుత్వ అన్నిచర్యలు తీసుకుందని, ఇందుకోసం ప్రభుత్వం రూ. 10కోట్లను కేటాయించినట్టు వెల్లడించారు. జిల్లాల కలెక్టర్లకు నిధులు కేటాయించి, ఆయా జిల్లాల్లో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. శనివారం రవీంద్రభారతిలో ఎంగిలిపూల బతుకమ్మతో వేడుకలు ప్రారంభమై మిగిలిన 8 రోజులపాటు రోజుకోతీరుగా వివిధ రకరకాలపూలు, పేర్లతో బతుకమ్మ తల్లిని భక్తిశ్రద్ధలతో పూజించి సంబురాలు జరుపుకోనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు, మహిళా సంఘాలు, కళాకారులు పెద్దయెత్తున భాగస్వాములై జానపద, సంప్రదాయ ఆటాపాటలు, శాస్త్రీయ జానపద నృత్యాలతో బతుకమ్మ వైభవం వెల్లివిరిసేలా అద్భుత ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ వేడుకల్లో అత్యంత ప్రాధాన్యత, ప్రత్యేకతను సంతరించుకున్న సద్దుల బతుకమ్మ సంబురాలను వేలాది మంది మహిళలు, వివిధ సైజుల బతుకమ్మలతో భారీర్యాలీ నిర్వహిస్తూ చివరిగా ట్యాంక్‌బండ్‌పై అంగరంగవైభవంగా నేత్రపర్వంగా వేడుకలు జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు వివరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా బతుకమ్మ పండుగను రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరి భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించి ప్రపంచానికి చాటిచెప్పడమే ప్రభుత్వ లక్ష్యమని నరసింహా రెడ్డి పేర్కొన్నారు.



బతుకమ్మ సంబురాల వివరాలను తెలియజేస్తున్న డా. ఏనుగు నరసింహారెడ్డి

# గల్ఫ్ కార్మికులకు క్షమాపణ చెప్పాకే దుబాయ్‌లో అడుగుపెట్టాలి

## వారి సంక్షేమంపై బిఆర్ఎస్ స్పష్టమైన వైఖరి ప్రకటించాలి

## పిసిసి ఎన్నారై సెల్ నాయకుల డిమాండ్

**హైదరాబాద్, అక్టోబరు 9,ప్రభాతవార్త:** గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా బిఆర్ఎస్ పార్టీ మోసం చేసిందని పిసిసి ఎన్నారై సెల్ నాయకులు విమర్శించారు. దుబాయిలో నిర్వహించనున్న బతుకమ్మ ఉత్సవాలకు వెళుతున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు ముందుగా గల్ఫ్ కార్మికులకు క్షమాపణ చెప్పిన తర్వాతే దుబాయిలో అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం గాంధీభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టిపిసిసి ఎన్నారై సెల్ ఛైర్మన్, తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్, అంబాసిడర్ డా. బి.ఎం. వినోద్ కుమార్, వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి మాట్లాడుతూ, బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో సుమారు రెండు వేల మంది గల్ఫ్ కార్మికులు మరణించారని, వారి కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చకుండా ఆ కుటుంబాలను మోసం చేసిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో బొగ్గుబాయి, బొంబాయి, దుబాయి నినాదంతో గల్ఫ్ కార్మికులు కీలకపాత్ర పోషించారని ఎన్నారై అడ్వయిజరీ కమిటీ సభ్యులు చెన్నమనేని శ్రీనివాస రావు అన్నారు. రాష్ట్ర సాధన కోసం కష్టపడ్డ గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు.

## భూవివాదంలో ప్రముఖ విద్యాసంస్థ ఛైర్మన్‌సహా

# 14 మందిపై కేసు నమోదు?

## పోలీసుల అదుపులో సంస్థ ఛైర్మన్‌సహా కొందరు నిందితులు

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** ఖమ్మం జిల్లా కేంద్రంగా కొనసాగుతున్న ప్రముఖ విద్యాసంస్థకు ఛైర్మన్‌గా వున్న బడా నేతతోపాటు ఆయన అనుచరులు పలువురిపై భూవివాదం కారణంగా హైదరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. శివార్లలోని బుద్వేలులో గల భూవివాదం నేపథ్యంలో వీరిపై కేసు నమోదైనట్లు తెలిసింది. ఈ కేసుకు సంబంధించి సదరు విద్యాసంస్థ ఛైర్మన్ సహా పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

కాగా ఈ విద్యా సంస్థ ఛైర్మన్ గతంలో చార్మినార్ బ్యాంకు గోల్‌మాల్ వ్యవహారంలో ఆరు నెలలకుపైగా జైలులో వున్నట్లు తెలిసింది. దీనిపైనా పోలీసులు కూపీ లాగుతున్నారు. ఈ విద్యా సంస్థ ఇంజినీరింగ్‌సహా ఉన్నతవిద్యకు సంబంధించి అనేక కోర్సులను నిర్వహిస్తూ తెలుగురాష్ట్రాల్లో పేరొందడం గమనార్హం.

# తెలంగాణలో రెవెన్యూ అధికారుల బదలీలు

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** తెలంగాణలో రెవెన్యూ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లను బదిలీ చేస్తూ జీవోను తెలంగాణ సర్కార్ శుక్రవారం విడుదల చేసింది. బి. రాజాగౌడ్ జగిత్యాల అదనపు కలెక్టర్ నుంచి నిజామాబాద్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బదిలీ చేసింది. ఎన్. ప్రసూనాంబ జగిత్యాల అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా నియమించింది. డి. వెంకట మాధవరావు నిర్మల్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా నియమించింది. పి. రామ్‌రెడ్డి వనపర్తి జిల్లా రెవెన్యూ అధికారిగా బదిలీ చేసింది. ఎ. యాదగిరి మహబూబ్‌నగర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చింది. మోహన్ సింగ్ రాజన్నసిరిసిల్ల జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించింది. పి. పద్మప్రియ హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్‌కు డిప్యుటేషన్‌పై బదిలీ చేసింది. సీహెచ్. కృష్ణయ్య మేడ్చల్ మల్కాజిగిరి ఎస్‌డిసి, యుఎల్‌సిగా నియమించింది. జి. కుమారస్వామి పెద్దపల్లి జిల్లా గోదావరిఖని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా తెలంగాణ ప్రభుత్వం బదిలీ చేసింది.



శుక్రవారం బంజారాహిల్స్‌లోని టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కాన్షీరాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

# కాన్షీరామ్ స్ఫూర్తితో సామాజిక న్యాయం సాధిస్తాం

## ఆ మహనీయునికి భారతరత్న ఇవ్వాలి:

## టిఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్,అక్టోబరు 9,ప్రభాతవార్త:** అణగారిన వర్గాలకు రాజకీయ అధికారం కావాలన్న అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో చూపిన మహనీయుడు కాన్షీరాం అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా శుక్రవారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాన్షీరాంకు భారతరత్న ఇవ్వాలని ఆయన స్ఫూర్తితో సామాజిక న్యాయ తెలంగాణ సాధిస్తామని చెప్పారు. అణగారిన వర్గాలకు నిజమైన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడమే ఆ మహనీయునికి మనమిచ్చే ఘనమైన నివాళి అని చెప్పారు. రాబోయే రోజుల్లో కచ్చితంగా అణగారిన వర్గాలను అసెంబ్లీకి తీసుకెళ్లి తీరు తామన్నారు. తెలంగాణ రక్షణ సేన సామాజిక న్యాయ సంకల్పానికి కాన్షీరామే స్ఫూర్తి అని చెప్పారు.

**ప్రతి ఇంటికి పాంచజన్యం తీసుకెళ్లండి..**

తెలంగాణ రక్షణ సేన ప్రధాన సిద్ధాంతమైన పాంచజన్యాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్ చార్జీలు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, అనుబంధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు సమావేశంలో పాల్గొన్నారు. కవిత మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో రైతులను దోపిడీ చేస్తున్న దళారులను పార్టీ నాయకత్వం ప్రశ్నిస్తే ఇప్పుడు అన్ని పార్టీలు రైతులకు అండగా నిలుస్తున్నాయని తెలిపారు.

# బిజెపితో లోపాయికారి ఒప్పందం వల్లే 'సర్'పై బిఆర్ఎస్ మౌనం

## తెలంగాణలో అధికారంలోకి రావడమే బిజెపి లక్ష్యం

## ప్రకాశ్‌రాజ్ మాటల్లో వాస్తవం లేదు :

## పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న పిసిసి చీఫ్ మహేశ్

**హైదరాబాద్, అక్టోబరు 9,ప్రభాతవార్త:** బిజెపి, కిషన్‌రెడ్డితో బలమైన లోపాయి కార ఒప్పందంతో బిఆర్ఎస్ 'సర్'పై మౌనంగా ప్రేక్షపాత్ర వహిస్తోందని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలపై ప్రశ్నించే ఏ పార్టీ కైనా మద్దతు ఇస్తామనీ పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీ భవన్‌లో మీడి యాతో మాట్లాడుతూ వివిధ కారణాలతో రాష్ట్రంలో 90 లక్షల ఓట్లు తొలగి స్తున్నారని తెలంగాణలో అధికారంలోకి రావడమే బిజెపి లక్ష్యంగా పెట్టుకొందని ఆవేదన చెందారు ప్రకాష్ రాజ్ మాట్లాడే మాటల్లో వాస్తవం లేదనీ దేశంలో అర్హత ఉన్న ప్రతి ఓటు కాపాడటమే కాంగ్రెస్ ధ్యేయమనీ 'సర్' పై యేడాది నుండి తీవ్రంగా కసరత్తు చేస్తున్నామనీ చెప్పారు. 'సర్' ప్రక్రియ మీద దేశ వ్యాప్తంగా బిజెపి మిత్ర పక్షాలు తప్ప అన్ని పార్టీలు రోడ్డు ఎక్కాయనీ మోడీ, అమిత్ షా రాజకీయ తీరుపై పోరాటం చేస్తుంటే తెలంగాణ బిఆర్ఎస్ పాత్ర ఎక్కడ అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ లో బిఆర్ఎస్ ఎందుకు మౌనంగా ఉందిది సిఇసి తప్పిదం చేస్తుంటే ఎందుకు హరీశ్‌రావు, కెటిఆర్ మాట్లాడట్లేదు అని అడిగారు. ఓటర్ల ప్రత్యేక సవరణతో ఓట్లు గల్లంతు అవుతుంటే కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు మాట్లాడిన పాపాన పోలేదనీ నిరసన కార్యక్రమం చేయలేదు అని అన్నారు. బిజెపి కి వ్యతిరేకంగా మాట్లాడితే ఈ పార్ములా కేసులో అరెస్ట్ చేస్తారని కాళేశ్వరం లో సిబిఐ అరెస్టు చేస్తదేమో అని భయం ఉందని ఎద్దేవా చేశారు. ముషీరాబాద్‌లో పెద్దఎత్తున ఓట్లు తొలిగించానికి కుట్రలు చేశారని సర్ లో దళితుల, మైనారిటీ, గిరిజనుల ఓట్లు తొలగిస్తున్నారనీ ఆవేదన చెందారు వెస్ట్ బెంగాల్‌లో రోహింగ్యాల పేరుతో మమత బెనర్జీ గెలవకుండా ఆపారనీ బీహార్‌లో ఆర్‌జెడి గెలవకుండా చేశారని గుర్తు చేశారు. వయసుతో నిమిత్తం లేకుండా ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పోరాటం చేస్తున్నారనీ ఉండటానికి ఇల్లు లేదన్న కెటిఆర్ కు ఫైవ్ స్టార్ హోటల్స్ ఉన్నాయనీ అన్నారు. ఇన్ని వేల కోట్ల ఆస్తులు ఏక్కడివి అని ప్రజలు అడుగుతున్నారనీ చెప్పారు. బండారం బయట పడుతుందని బిఆర్ఎస్ నాయకులు 'సర్'పై మాట్లాడట్లేదు జ్ఞానేశ్వర్‌కుమార్‌ను తొలగించే వరకు నిరసన ర్యాలీలు ఉంటాయి అని ఆయన స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ ప్రధాని కావాలనుకుంటే 2009లో అయ్యేవాడు అని చెప్పారు. శాశ్వ తంగా అధికారంలో ఉండాలని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ను తొలగించారు జ్ఞానేశ్వర్ కుమార్ లాంటి తొత్తులను సిఇసి గా పెట్టుకుంది బిజెపి అని ఆరోపించారు. 36వేల బిఎల్ఓ పామ్స్ ఇస్తేస్టేట్ సిఇసి తప్పిదం వలన తక్కువ చూపించారనీ ఆయన ఆరోపించారు. ఈ విషయంలో తప్పు జరిగిందని స్టేట్ సిఇసి ఒప్పుకున్నారనీ అన్నారు. టిఎన్ శేషన్, లింగ్డో, కృష్ణ మూర్తి హయాంలో న్యా యంగా సర్ జరిగిందని తెలిపారు.

# ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటే ఆట, పాటల సాంస్కృతిక వైభవం

## రాష్ట్ర ప్రజలకు బతుకమ్మ పండుగ కెసిఆర్ శుభాకాంక్షలు

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర పండుగ, బతుకమ్మ పండుగ ప్రారంభం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత, కె.చంద్రశేఖర్ రావు శుభాకాంక్షలు తెలిపారు. పువ్వులనే దేవతగా కొలుస్తూ, ప్రకృతిని ఆరాధించే తెలంగాణ ఆడబిడ్డల బతుకమ్మ పండుగ, దేశంలోని అన్నిసాంప్రదాయ పండుగల్లో ప్రత్యేకమైనదని కేసీఆర్ అన్నారు.

తెలంగాణ జీవన విధానానికి, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, సామాజిక సంస్కృతికి దర్పణంగా నిలిచే బతుకమ్మపండుగ, తెలంగాణ ప్రజల జీవితంలో భాగమైందని తెలిపారు. ఎంగిలిపూల బతుమ్మగా ప్రారంభమై, సద్దుల బతుకమ్మతో ముగిసే తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సందడి నెలకొంటుందని కేసీఆర్ తెలిపారు. పిల్లాపాపలతో వొకచోట కూడి, ఆటాపాటలతో, ఆడపడుచులు బతుకమ్మను కొలిసిమొక్కుతారని అన్నారు. తెలంగాణ తొలి ప్రభుత్వం బతుకమ్మ పండుగకు రాష్ట్ర పండుగ హోదానివ్వడమే కాకుండా, ఆడబిడ్డలకు కానుకగా బతుకమ్మ చీరలను పంపిణీ చేసే సాంప్రదాయాన్ని అమలు చేసిందని అన్నారు. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్నికాపాడుతూ వారి సంక్షేమానికి పలు రకాల పటిష్ట కార్యక్రమాలను నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిందని కేసీఆర్ గుర్తుచేశారు.

# సాహిత్య రంగంలో ముదిగొండ శివప్రసాద్ సేవలు చిరస్మరణీయం

## సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,అక్టోబరు9,ప్రభాతవార్త:** ప్రముఖ సాహితీవేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య ముదిగొండ శివప్రసాద్ మృతిపట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సాహిత్య రంగంలో నవలా రచయితగా, చరిత్ర పరిశోధకుడిగా, విమర్శకుడిగా, వ్యాసకర్తగా ఆచార్య ముదిగొండ శివప్రసాద్ అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలుగు పాఠకులకు మన చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందించడంలో వారు విశేష కృషి చేశారని గుర్తుచేశారు.

ముదిగొండ శివప్రసాద్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సాహితీ సహచరులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# తెలంగాణ మహిళ ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ

## పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్,అక్టోబరు9,ప్రభాతవార్త:** తెలంగాణ మహిళ ఆత్మగౌరవంకు ప్రతీక బతుకమ్మ పండుగ అని నీటివనరుల సంరక్షణ పూల సింగిడి ఆరాధన చేసే మహిళలకు, తెలంగాణ ప్రజలకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆడపడుచులకు ప్రకృతితో ఉన్న అనుబంధానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను రాష్ట్ర ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన చేస్తూబతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పూల పరిమళం, మహిళల ఐక్యతకు ప్రతీక అని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ నేలపై వికసించే వివిధ రకాల పూలను సేకరించి బతుకమ్మగా పేర్చి, ఆడపడుచులు సామూహికంగా ఆడుతూ పాడుతూ జరుపుకునే ఈ పండుగ మన ప్రత్యేక సాంస్కృతిక వారసత్వానికి ప్రతిబింబమన్నారు. బతుకమ్మ వేడుకలు ప్రతి ఇంటా సంతోషాన్ని, సౌభాగ్యాన్ని, ఆరోగ్యాన్ని నింపాలని, తెలంగాణ ప్రజలందరి జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాలు వెల్లివిరియాలని మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు. మహిళల సంక్షేమం, ఆత్మగౌరవం, సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ వాటి వైభవాన్ని ప్రపంచానికి చాటేలా ప్రతి ఒక్కరూ బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఆడపడుచులందరికీ, రాష్ట్ర ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు. బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని శుభాకాంక్షల సందేశంలో వివరించారు.

**గాంధీభవన్‌లో 14న బతుకమ్మ పండుగ సంబురాలు**

తెలంగాణ సంస్కృతి,ఆడపడుచుల ఆత్మగౌరవం తెలిపే పూలపండుగ బతుకమ్మను ఈనెల14న బుధవారం రోజు తెలంగాణ మహిళా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్నామని తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బతుకమ్మ సంబరాలలో మహిళా మంత్రులు, శాసన సభ్యులు, రాష్ట్ర చైర్మన్లు, టిపిసిసి ఎగ్జిక్యూటివ్ సభ్యులు, చైర్పర్సన్ లు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, కార్యకర్తలు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. మధ్యాహ్నం రెండు గంటలకు బతుకమ్మ సంబరాలు గాంధీభవన్‌లో మొదలు పెడుతామని వివరించారు.

# వాతావరణ మార్పులను తట్టుకునే వరి

## రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న సిసిఎంబి

**హైదరాబాద్, అక్టోబరు 9,ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రబీ సీజనును దృష్టిలో ఉంచుకుని తెలంగాణలో అధిక దిగుబడి, వాతావరణ మార్పులను తట్టుకునే పంట రకాలను ప్రోత్సహించాలని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) నిర్ణయించింది. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్‌తో (ఐఐఆర్ఆర్) కలసి సీసీఎంబీ రాష్ట్రంలోని రైతులకు ఈ విత్తనాలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేసిన వరి విత్తనాలను రాష్ట్రంలోని భువనగిరి జిల్లాలోని 150 మందికిపైగా రైతులకు సీసీఎంబీ, రైస్ రీసెర్చ్ సంయుక్తంగా పంపిణీ చేశారు. బొమ్మైపల్లిలోని సీసీఎంబీ అనెక్స్ క్యాంపస్‌లో ఈ విత్తనాలను పంపిణీ చేశారు. అక్కడ ఈ సంస్థ తన 50 ఎకరాల ప్రాంగణంలో సూపర్ రైస్ రకాలను సాగు చేస్తోంది. ఈ రకాలు వ్యాధులు, పరాన్న జీవులను, అధిక నేల లవణీయతను, తక్కువ భాస్వరం పరిస్థితులను తట్టుకునే సామర్థ్యం కోసం అధ్యయనం చేయబడుతున్నాయి.

సీసీఎంబీ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించిన వివరాలు ప్రకారం.. జిల్లా పరిపాలన, వ్యవసాయ శాఖ అధికారులతోపాటు 100 మందికిపైగా సీసీఎంబీ శాస్త్రవేత్తలు, నిర్వాహకులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని, రైతులకు కొత్త రకాల గురించి వివరించారు. సంస్థ శాస్త్రీయ, పరిశోధన కార్యకలాపాల విస్తరణకు తోడ్పడుతుందని, అలాగే భువనగిరి దాని పరిసర ప్రాంతాలలో అవకాశాలను సృష్టిస్తుందని సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ కె. నందికూరి అన్నారు. సుస్థిర వ్యవసాయాన్ని, మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకోగల పంట రకాలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.



అధిక దిగుబడి, వాతావరణ మార్పులను తట్టుకునే పంట రకాల విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన సిసిఎంబి డైరెక్టర్ డాక్టర్ వినయ్ కె.నందికూరి తదితరులు

శాస్త్రీయ పరిశోధనల ద్వారా అభివృద్ధి చేసిన అధిక దిగుబడినిచ్చే, మధుమేహానికి అనుకూలమైన వరి రకాల ప్రాముఖ్యతను కూడా ఆయన నొక్కి చెప్పారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ హితేంద్ర కె. పటేల్, సీసీఎంబీ, ఐఐఆర్ఆర్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన వరి రకాల లక్షణాలను, ముఖ్యంగా మధుమేహం వచ్చే ప్రమాదం ఉన్న జనాభాకు వాటి వల్ల కలిగే సంభావ్య ప్రయోజనాలను వివరించారు. అలాగే, శాస్త్రీయ పరిశోధనను రైతులకు ప్రయోజనం చేకూర్చే సాంకేతికతలు మరియు ఉత్పత్తులుగా మార్చాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. వ్యవసాయ అధికారి రమణారెడ్డి కొత్త రకాలపై రైతుల ప్రశ్నలకు సమాధానమిస్తూ, వారి పంట సేకరణకు జిల్లా యంత్రాంగం మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు.

# తెలంగాణ ఆడబిడ్డలందరికి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు

## రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు9,ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని శుక్రవారం పితృ అమావాస్యతో ప్రారంభమయ్యే ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా తెలంగాణ ఆడపడుచులందరికీ రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మను అందంగా అలంకరించి, కుటుంబ సభ్యులు, స్నేహితులు, మహిళలందరూ కలిసి ఆటపాటలతో, సంప్రదాయ బతుకమ్మ పాటలతో ఈ పండుగను జరుపుకోవడం తెలంగాణ ప్రత్యేకత అని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ, మహిళల ఐక్యతను, తెలంగాణ ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే బతుకమ్మ పండుగ మన సంస్కృతికి ప్రతిబింబమని తెలిపారు. తరతరాలుగా వస్తున్న ఈ అద్భుతమైన సంప్రదాయాన్ని భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణలోని ప్రతి ఇంటా సంతోషాలు, సౌభాగ్యం, సిరిసంపదలు నింపాలని, ప్రతి ఆడపడుచు ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

# తాత్కాలిక ఫైర్ ఎన్‌ఒసి జారీకి మారిన నిబంధనలు

**హైదరాబాద్, అక్టోబరు 9,ప్రభాతవార్త:** రాష్ట్ర అగ్నిమాపక, విపత్తుల ప్రతిస్పందన, అత్యవసర సేవలు, పౌర రక్షణ శాఖ (ఫైర్ సర్వీస్) తా త్కాలిక అగ్నిమాపక నిరభ్యంతర ధృవపత్రాల జారీకి సంబంధించి నిబంధనలను మార్చింది. దీనికి సంబంధించి ఫైర్ సర్వీస్ డిజి విక్రం సిం గ్ మాన్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. క్రెడాయ్, నరెడ్కో. తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ సహా ప్రముఖ నిర్మాణ రంగ సంఘాల ప్రతినిధు లతో చర్చలు జరిపిన తరువాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు విక్రం సింగ్ మాన్ తెలిపారు. కొత్త నిబంధనల ప్రకారం నివాస అపార్ట్‌మెంట్ భవ నాలకు గతంలో 18 మీటర్ల ఎత్తు నుంచి తప్పనిసరి ఫైర్ ఎన్ఓసి వుండాల్సి వుండేది. దీనిని ఇప్పుడు 24 మీటర్లకు పెంచారు. ఇతర వినియో గాలకు సంబంధించిన భవనాల విషయంలో ఎలాంటి మార్పులు లేవని మాన్ తెలిపారు. ఇక 24 మీటర్ల ఎత్తు దాటిన భవనాలు ఫైర్ టవర్ తో పాటు ఫైర్ కమాండ్ సెంటర్‌నూ ఏర్పాటు చేసుకోవాల్సి వుంటుంది. బేస్‌మెంట్లలో వున్న డీజి ల్ జనరేటర్ గదులకు తగినంత గాలి ప్రసరి ంచే విధంగా ఏర్పాట్లు వుండాలి. ఇక్కడ వున్న గోడలు మందంగా వుండడంతో పాటు అగ్ని ప్రమా దం సంభవిస్తే రెండు గంటల పాటు తట్టు కునే విధంగా వుండాలి. తాత్కాలిక ఫైర్ ఎన్ఓసిల దరఖాస్తుల పరిశీలన సమయంలో అన్ని అంశా లు పారదర్శకంగా వుండేందుకు ఈ నిర్ణయ ం తీసుకున్నట్లు ఫైర్ సర్వీస్ డిజి మాన్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నిచోట్ల భవనాలలో అవస రమైన అగ్ని, ప్రాణ, భద్రతా చర్యలను ప టిష్టంగా అమలు చేసేందుకు వీటిని అమలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నెల ఏడవ తేదీ నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయని ఆయన తెలిపారు.

## రైస్‌మిల్లర్లు, మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో

# నిజామాబాద్ కొత్వాల్ భేటీ

## రైతులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేబట్టాలని ఆదేశం

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా రైస్ మిల్లర్స్. మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో పోలీసు కమిషనర్ సాయి చై తన్య శుక్రవారం భేటీ అయ్యారు. జిల్లాలో త్వరలో జరగనున్న ధాన్యం కొనుగోళ్లు సవ్యంగా సాగాలని, ఎక్కడా రైతులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా వుండాలని అసోసియేషన్ ప్రతినిధులను ఆయన కోరారు. బియ్యం ధరలు ప్రజలకు అందుబాటులో వుండేలా చూడాలని, బ్లాక్ మార్కె టింగ్‌కు తావివ్వకూడదని ఆయన కోరారు. జిల్లా వ్యాప్తంగా ఎల్‌నినోత ప్రభావం కారణంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు వచ్చాయని, దీ ని కారణంగా ధాన్యం దిగుబడులు తగ్గే వీలుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోందని ఆయన అన్నారు. రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసే ధా న్యం ఇతర ప్రాంతాలకు తరలించి అక్కడ అధిక ధరలకు విక్రయించవద్దని, కృత్రిమ కొరత సృష్టించవద్దని ఆయన మిల్లర్స్ నిర్వాహకులను, అసోసియేషన్ ప్రతినిధులను కోరారు.

ఈ విషయంలో పోలీసు శాఖ కఠినంగా వుంటుందని ఆయన హెచ్చరించారు. నిబంధనల అనుసారం, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కొనుగోళ్లు జరగాలని, ప్రజలపై అనవసర భారం పడకుండా చూడాలని కమిషనర్ కోరారు. ఈ విషయ ంలో రైస్ మిల్లర్లతో పాటు అసోసియేషన్ ప్రతినిధులు సమన్వయంగా వుండాలని ఆయన కోరారు. బియ్యం సరఫరాలో అంతా నిబంధనల మేరకు జరగాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో అదనపు డిసిపి (పరిపాలన) శుభం ప్రకాష్, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, మేనేజర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి తెలంగాణలో బతుకమ్మ సంబురాలు

### తొమ్మిది రోజులపాటు

### ప్రతి ఇంటిలో పూల పండుగ

**హైదరాబాద్,అక్టోబరు9,ప్రభాతవార్త:** తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలు శనివారం(ఈనెల 10)నుంచి 18 వరకు వైభవంగా జరుగనున్నాయి. దసరాకు ముందు తొమ్మిది రోజుల పాటు మహిళలు పూలతో బతుకమ్మను అలంకరించి ఆడి పాడుతారు. తంగేడు, గునుగు, తామర, బంతి, చామంతి, కట్ల, సీతజడ వంటి సహజ పూలతో బతుకమ్మను పేర్చి ఆరాధించే ఈ సంప్రదాయం ప్రపంచంలోనే ప్రత్యేకం. ప్రకృతిని పూజించే విశేషమైన పండుగ బతుకమ్మ. శనివారం(ఈ నెల 10న) ఎంగిలిపూల బతుకమ్మను జరుపుకుంటారు. బియ్యం పిండి, నువ్వులు నైవేద్యంగా సమర్పిస్తారు. 11న అటుకుల బతుకమ్మను జరుపుకుంటారు. చప్పిడి పప్పు, బెల్లం, అటుకులు బతుకమ్మకు నైవేద్యంగా నివేదిస్తారు. 12న ముద్దపప్పు బతుకమ్మను మహిళలు జరుపుకుంటారు. ముద్దపప్పు, బెల్లం, పాలు బతుకమ్మకు నైవేద్యంగా సమర్పిస్తారు.13న నానబియ్యం బతుకమ్మను ఘనంగా జరుపుకుంటారు, నానబెట్టిన బియ్యం, బెల్లం, పాలు నైవేద్యం పెడతారు. 14న అట్ల బతుకమ్మ జరుపుకుంటారు. గోధుమ లేదా బియ్యం అట్లు అమ్మవారికి నైవేద్యంగా పెడతారు. 15న అలిగిన బతుకమ్మ. ఈరోజు ఎవరూ బతుకమ్మ ఆడరు. కనుక నైవేద్యం లేదు 16న వేపకాయల బతుకమ్మ జరుపుకుంటారు. బియ్యం పిండి వేపకాయలు చేసి అమ్మవారికి నైవేద్యంగా నివేదిస్తారు. 17న వెన్నముద్ద బతుకమ్మను నిర్వహిస్తారు. నువ్వులు, వెన్నముద్ద, బెల్లం అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. 18న సద్దుల బతుకమ్మ.సద్దుల బతుకమ్మ రోజున తల్లి, పిల్ల బతుకమ్మలు పేర్చి పెద్ద ఎత్తున వేడుకలు జరుపుకుంటారు. బతుకమ్మను నీటిలో నిమజ్జనం చేయటం సంప్రదాయం. తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అయిన ఈ పూల పండుగను ప్రకృతిని, గౌరీ దేవిని పూజిస్తూ మహిళలు జరుపుకుంటారు.

**సిఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు**

రాష్ట్రంలోని ఆడ బిడ్డలందరికీ ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలి పారు. ఎంగిలిపూల బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజుల పాటు ఆడబిడ్డలందరూ ఆటపాటలతో అత్యంత వైభవంగా ఈ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. బతుకమ్మ సంబురాలు ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో బతుకమ్మ వేడుకలు జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.



లోక్‌భవన్‌లో శుక్రవారం గవర్నర్ శివప్రతాప్‌శుక్లాకు మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు స్వీయచరిత్ర ఉనికి పుస్తకాన్ని అందజేస్తున్న దృశ్యం

## గవర్నర్ శివప్రతాప్‌శుక్లాతో మాజీ గవర్నర్ చెన్నమనేని భేటీ

**హైదరాబాద్,అక్టోబరు9,ప్రభాతవార్త:**తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లాను మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు, ఏకలవ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పి.వేణుగోపాల్‌రెడ్డి లోక్‌భవన్‌లో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు స్వీయ చరిత్ర ఉనికి పుస్తకాన్ని గవర్నర్‌కు అందజేశారు. ఎమ్మెల్సీ ఎస్.వాణీదేవి, పి.వి.ప్రభాకర్ రావు, కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి తదితరులు కూడా గవర్నర్‌ను వేర్వేరుగా కలిశారు.



## నవరాత్రి బ్రహ్మోత్సవాలకు వేళాయె!

### • రేపు అంకురార్పణ, 12న పెద్దశేషవాహనం

**తిరుమల, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలశ్రీ వేంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్స వాలకు సమయం ఆసన్నమైంది. ఈ యేడాది అధిక మాసం రావడంతో రెండవసారి దసరా నవరాత్రుల్లో నవరాత్రి బ్రహ్మో త్సవాలు 12నుండి మొదలుకానున్నాయి. ఆదివారం (రేపు) రాత్రి 7 నుండి 9 గంటల వరకు అంకురార్పణం నిర్వహిస్తారు. 12న సోమవారం ఉదయం 9 గంటలకు బంగారు తిరుచ్చి ఉత్సవం, రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనం, 13న ఉదయం 8 గంటలకు చిన్నశేష వాహనం, రాత్రి 7 గంటలకు హంస వాహనం, 14న ఉదయం 8 గంటలకు సింహ వాహనం, రాత్రి రాత్రి 7 గంటలకు ముత్యపుపందిరి వాహనం 15న ఉదయం 8 గంటలకు కల్పవృక్ష వాహనం, రాత్రి 7 గంటలకు సర్వభూపాల వాహనం, 16న ఉదయం 8 గంటలకు మోహినీ అవతారం, సాయంత్రం 6.30 గంటలకు గరుడ వాహనం, 17న ఉదయం 8 గంటలకు హనుమంత వాహనం, సాయంత్రం 4 గంటలకు పుష్పక విమానం, రాత్రి 7 గంటలకు గజ వాహనం, 18న అక్టోబరు 18 ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనం, రాత్రి 7గంటలకు చంద్రప్రభ వాహనం, 19న ఉదయం 7 గంటలకు స్వర్ణరథం, రాత్రి 7 గంటలకు అశ్వ వాహనం, అక్టోబరు 20వ తేదీ మంగళవారం ఉదయం 6 గంటలకు చక్రస్నానంతో ముగుస్తాయి.

## నేడు ఎన్నికల సంఘం ఆఫీసు ముందు బిఆర్ఎస్ ధర్నా

**హైదరాబాద్,అక్టోబరు9,ప్రభాతవార్త:**సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ కచ్చితంగా రాజీనామా చేయాల్సిందేనని బీఆర్ఎస్ కూడా డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలో శనివారం తెలంగాణ ఎన్నికల సంఘం ఆఫీస్ ముందు ఆందోళనలకు సైతం పిలుపునిచ్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గాల్లో సర్ ప్రక్రియలో భాగంగా పెద్ద ఎత్తున ఓట్లను తొలగించడం పట్ల గులాబీ దళం అనుమానాలు వ్యక్తం చేస్తోంది. సర్ ప్రక్రియలో అవకతవకలపై సుప్రీం కోర్టు జడ్జితో సమగ్రమైన, స్వతంత్ర విచారణ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. నైతిక బాధ్యత వహిస్తూ సీఈసీ రాజీనామా చేయాలని కూడా ఆ పార్టీ డిమాండ్ చేస్తోంది. హైదరాబాద్‌లో ఆందోళనలు చేపట్టిన అనంతరం.. ఢిల్లీలోనూ ప్రదర్శనలు చేపట్టాలని భావిస్తోంది.

## మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డితో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి భేటీ

**హైదరాబాద్,అక్టోబరు9,ప్రభాతవార్త:**ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి శుక్రవారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జూబ్లీహిల్స్‌లో గల గుత్తా సుఖేందర్ రెడ్డి నివాసంలో ఈ మర్యాదపూర్వక భేటీ జరిగింది. ఈ సందర్భంగా గుత్తా అమిత్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

# యేడాదిన్నరలో సమగ్ర భూసర్వే పూర్తి

### సర్వే పర్యవేక్షణకు 7 జోన్లకు 14 మంది అధికారుల నియామకం

### నాణ్యత, పారదర్శకత, వేగం, రీ-సర్వేలో అత్యంత కీలకం

### ఎర్రవల్లిలో అసైన్డ్ భూములను గుర్తించి చర్యలు తీసుకుంటాం

### అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష

**హైదరాబాద్,అక్టోబరు9,ప్రభాతవార్త:**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన లకు అనుగుణంగా భూ వివాదాలు లేని తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమగ్ర రీ-సర్వేను ఏడాదిన్నరలో పూర్తి చేసేలా పటిష్ట కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో సర్వే పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన అధికారులతో భూ సర్వే పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సర్వేలో వేగం, నాణ్యతతో పాటు ప్రతి దశలో నిరంతర పర్యవేక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సుమారు 125 ఏళ్ల తర్వాత సమగ్ర భూ సర్వేకు శ్రీకారం చుట్టామని, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు లభించిన ఈ అవకాశాన్ని అధికారులు అత్యంత బాధ్యతతో వినియోగించుకోవాలని మంత్రి సూచించారు.

రీ-సర్వేను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించేందుకు 7 జోన్లకు ఒక్కో జోన్‌కు రెవెన్యూ, సర్వే విభాగాల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 14 మంది అధికారులను నియమించినట్లు మంత్రి తెలిపారు. సర్వే జరుగుతున్న తీరును, నాణ్యతను, ప్రజల స్పందనను ఎప్పటికప్పుడు పరిశీలించి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

రాష్ట్రంలో తొలి దశలో 365 నక్షాలేని గ్రామాల్లో అలాగే జిల్లాకు 70 గ్రామాల చొప్పున 2,240 మొత్తం 2768 గ్రామాల్లో రీసర్వే ముమ్మరంగా సాగుతుందని ఇప్పటివరకు 245 గ్రామాల్లో సర్వే పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ సర్వేను పర్యవేక్షి ంచేందుకు 14 మంది అధికారులను పర్యవేక్షకులుగా నియమించడం జరిగిందని తెలిపారు. మొదటి దశ సర్వేను నవంబర్ చివరినాటికి పూర్తిచేయాలని లక్ష్ యంగా పెట్టుకున్నామన్నారు. ప్రతి మండలంలో కనీసం రెండు రెవెన్యూ గ్రామాల్లో సర్వే తప్పనిసరిగా చేపట్టేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను ఏర్పాటు చేశామని, ఒక్కో బృందంలో లైసెన్స్‌డ్ సర్వేయర్, జీపీవో, డిప్యూటీ తహసీల్దార్ లేదా ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ తదితర సిబ్బంది ఉంటారని వివరించారు.

సర్వే జరుగుతున్న ప్రాంతాల్లో ప్రతి రోజు తహసీల్దార్ పర్యటించి పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆదేశించారు. ఈ రోజు ఎక్కడ సర్వే జరిగింది? ఎన్ని ఎకరాలు/సర్వే నంబర్లు పూర్తయ్యాయి? ఎన్ని గ్రామాల్లో పని జరుగుతోంది? ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తోంది? సర్వేలో ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా? అనే అంశాలపై అధికారులు ప్రతిరోజూ స్పష్టమైన సమాచారాన్ని సేకరించాలని సూచించారు.చిన్న పొరపాటుకు కూడా తావులేకుండా, భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా రీ-సర్వే జరగాలని మంత్రిగారు స్పష్టం చేశారు.



శుక్రవారం సచివాలయంలో సర్వే పర్యవేక్షణ అధికారులతో భూసర్వే పురోగతిపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

రీ-సర్వేను రాష్ట్రస్థాయి నుంచి నిరంతరం పర్యవేక్షించేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే పురోగతి, రోజువారీ పనితీరు, గ్రామాల వారీగా పూర్తయిన సర్వే, పనిచేస్తున్న సర్వే బృందాలు, ఉపయోగిస్తున్న రోవర్లు, వాటి లొకేషన్ వంటి వివరాలన్నీ డాష్‌బోర్డులో రియల్‌టైమ్‌లో కనిపించేలా టెక్నాలజీని వినియోగించాలని సూచించారు.

సర్వేకు అవసరమైన సర్వేయర్లు, రోవర్లు, సర్వర్లు, ఇతర సాంకేతిక పరికరాలు, సామగ్రి కొనుగోలుకు నిధుల కొరత ఉండదని స్పష్టం చేశారు. అవసరమైన నిధులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేస్తుందని, అదనపు రోవర్లను కూడా కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు.

రీ-సర్వే ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమైనదని ప్రతివారం రాష్ట్రస్థాయిలో అధికారులు సమీక్ష నిర్వహిం చాలని, ప్రతి 15 రోజులకు తాను స్వయంగా సమీక్షి ంచి పురోగతిని పరిశీలిస్తానని తెలిపారు.ప్రభుత్వ భూముల సర్వే సమయంలో సరిహద్దులను గుర్తించే ప్రక్రియలో సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఎర్రవల్లిలో 385 ఎకరాలలో 45 ఎకరాలు తక్కువ ఉందని. సర్వే కోసం మరొక సారి నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఎర్రవల్లిలో అసైన్డ్ భూములు కొన్ని చేతులు మారాయి వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

# ప్రజల తీర్పును గౌరవించడం కాంగ్రెస్‌కు అలవాటు లేదు

### రాహుల్‌గాంధీకి అనుకూలంగా ఉంటే ప్రజాస్వామ్యం

### లేకపోతే రాజ్యాంగ సంస్థలపై

### దుష్ప్రచారమా?: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్,అక్టోబరు 9 ప్రభాతవార్త:** రాహుల్ గాంధీ వ్యవహారశైలిలో ఒక వింత, విచిత్రమైన, ప్రమాదకరమైన ధోరణి కనిపిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యాంగ సంస్థలు, ప్రభుత్వ వ్యవస్థలు తమకు అనుకూలంగా వ్యవహరించినప్పుడు అవి ప్రజాస్వామ్యబద్ధమైనవని ప్రశంసించడం.. తమ పార్టీకి ప్రజల్లో వ్యతిరేకత వచ్చినపుడు రాజ్యాంగబద్ధ సంస్థలు అవినీతిమయమయ్యాయని, వాటిని ప్రభుత్వం తన గుప్పిట్లో పెట్టుకుందని, వాటికి విశ్వసనీయత లేదని ఆరోపించడం రాహుల్ గాంధీకి అలవాటుగా మారిపోయిందన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల సంఘాన్ని, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌ను, న్యాయవ్యవస్థను, పార్లమెంటు తమ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించలేదనే కారణంతో ఆయా సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసేలా దుష్ప్రచారం చేయడం కాంగ్రెస్ పార్టీ దివాళాకోరు తనానికి అద్దం పడుతుందన్నారు. రాజకీయ లబ్ధికోసం కాంగ్రెస్ పార్టీ తప్పుడు ఆరోపణలు చేస్తూ రాజ్యాంగ వ్యతిరేక సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతుందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘంపై ప్రస్తుతం రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలు కూడా ఈ రాజకీయ కుట్రలో భాగమే అన్నారు. రాజ్యాంగబద్ధ సంస్థలు తనకు అనుకూలంగా వ్యవహరించని సందర్భాల్లో.. వాటిని నిర్వీర్యం చేసే విధంగా ఆరోపణలు చేయడం రాహుల్ గాంధీకి అలవాటుగా మారిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇటీవల పదే పదే అబద్ధాలను ప్రచారం చేయడం, రాజకీయ ఆందోళనలకు దిగడం, అమాయక యువతను రెచ్చగొట్టడం, ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం, ఆ చట్టబద్ధ సంస్థల పనితీరును అనుమానించేలా.. ప్రయత్నించడం రాహుల్ రాజకీయ కుట్రలాగా నిత్యకృత్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. రాహుల్ గాంధీపై విశ్వాసం లేక దేశ ప్రజలు మిమ్మల్ని పదేపదే అనేక ఎన్నికల్లో రాజ్యాంగబద్ధంగా తిరస్కరిస్తుంటే అది ఎన్నికల సంఘం తప్పు కాదు. ఎన్నికల్లో మిమ్మల్ని గెలిపించి మిమ్మల్ని ప్రధానమంత్రిని చేయడమో, లేక కాంగ్రెస్‌ను కానీ, బిజెపిని కానీ మరే ఇతర పార్టీనైనా గెలిపించడమో ఎన్నికల సంఘం బాధ్యత కాదు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడం వరకే ఎన్నికల సంఘం బాధ్యత. సుప్రీంకోర్టు తీర్పులు తమకు అనుకూలంగా లేనప్పుడు వాటిని తప్పుపట్టడం, అత్యున్నత న్యాయస్థానం విశ్వసనీయతను ప్రశ్నించడం మీకు అలవాటుగా మారిందన్నారు. 2013లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీయే ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌ను బహిరంగంగా చించివేయడం ద్వారా నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌ని అవమానించడం, పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ప్రధాని పివి నరసింహారావు గారిని అవమానించడం, చివరకు వారు చనిపోతే.. పార్టీ ఆఫీసుకు పార్థివ శరీరాన్ని తీసుకెళ్లకుండా పివిపై కక్ష సాధింపులకు పాల్పడ్డారన్నారు. దేశంలో జరుగుతున్న ఎన్నికల్లో వరుసగా తమ పార్టీ ఓటమిపాలవుతుండటంతో ఆక్రోషం, ఆవేదనలతో దేశంలోని రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసే ప్రమాదకరమైన రాజకీయ విధానాన్ని రాహుల్ గాంధీ ఏకైక ఎజెండాగా ఎంచుకున్నారు.

# అసెంబ్లీ స్పీకర్ బృందం యూరప్ స్టడీటూర్ విజయవంతం

### స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు నేతలు, అభిమానుల ఘనస్వాగతం

**హైదరాబాద్,అక్టోబరు9,ప్రభాతవార్త:** తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ యూరప్ పర్యటన విజయవంతంగా ముగించుకొని శుక్ర వారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) ఆధ్వర్యంలో చేపట్టిన స్టడీ టూర్‌ను విజయవంతంగా ముగించుకుని శుక్రవారం ఉదయం 9 గంటలకు శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌కు చేరుకున్న స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు వికారాబాద్ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఘన స్వాగతం పలికారు. యూరప్ పర్యటనలో భాగంగా జర్మనీ, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్ దేశాల్లో పలు అధ్యయన కార్యక్రమాల్లో స్పీకర్ బృందం పాల్గొంది. స్టడీ టూర్ లో భాగంగా ఆయా దేశాల పార్లమెంటరీ వ్యవస్థలు, శాసనసభల పనితీరు, ప్రజాస్వామ్య ప్రక్రియలు, చట్టాల రూపకల్పన విధానాలు, శాసనసభల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, చట్టాల రూపకల్పన విధానాలు, ప్రజాప్రతినిధుల బాధ్య తలు వంటి అనేక కీలక అంశాలపై స్పీకర్ బృందం అధ్యయనం చేసింది.



శుక్రవారం శంషాబాద్ విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

తెలంగాణ ప్రజా ప్రభు త్వం చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి స్పీకర్ బృందం యూరప్ పర్యటనలో విదేశీ ప్రతి నిధులకు, పెట్టు బడిదా రులకు వివరిం చింది. ముఖ్యంగా హైదరాబాద్ అభివృద్ధి, తెలంగాణలో ఉన్న పెట్టుబడి అవకా శాలు, రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అంది స్తున్న సహాయ, సహకారాలు, భద్రత, పారదర్శక విధానాల గురించి వివరించి, వారిలో భరోసా కల్పించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా చేపట్టిన యూరప్ పర్యటన విజయవంతమైందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. స్పీకర్‌తో పాటు తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసనసభ కార్యదర్శి రెండ్ల తిరుపతి, శాసనమండలి కార్యదర్శి నరసింహాచార్యులు కూడా విదేశీ పర్యటన పూర్తి చేసుకుని, హైదరాబాద్‌కు చేరుకున్నారు. వీరందరికీ ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం లభించింది.

# సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యానికి హృదయ స్పందన

### సమాచార హక్కు వారోత్సవాల్లో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా

**హైదరాబాద్ (రవీంద్రభారతి), అక్టోబరు 9, ప్రభాతవార్త :** ముందస్తు సమాచార వెల్లడి, సకాలంలో సమాధానాలు, పౌరకేంద్రిత పాలనతో ప్రజల్లో విశ్వాసం మరింత బలోపేతం చేస్తున్న సమాచార హక్కు చట్టం కేవలం ఒక చట్టం మాత్రమే కాదు, అది మన ప్రజాస్వామ్యానికి హృదయస్పందన వంటిదని,





'సమాచార దర్పణం'ను ఆవిష్కరిస్తున్న గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా, డిజిపి సి.వి.ఆనంద్, జస్టిస్ సుభాష్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సందీప్‌సుల్తానియా, ఆర్.వి.కర్ణన్ తదితరులు

పారదర్శకత, జవాబుదారీతనం, పాలనలో ప్రజల భాగస్వామ్యానికి బలమైన పునాదని తెలంగాణ రాష్ట్ర గవర్నరు శివ్‌ప్రతాప్ శుక్లా అన్నారు. అక్టోబరు 5 నుండి 12వ తేదీవరకు నిర్వహిస్తున్న సమాచార హక్కు వారోత్సవాలు 2026లో భాగంగా శుక్రవారం సాయంత్రం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో తెలంగాణ సమాచార కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి గవర్నరు ప్రసంగించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య తత్సంబంధాలు మరింత బలోపేతమవ్వాలంటే పాలన పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఉండాలని శివ్‌ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. 2005లో అమలులోకి వచ్చిన సమాచారహక్కు చట్టం ద్వారా సామాన్యపౌరులు పాలనా వ్యవస్థను ప్రశ్నించి, ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన సమాచా రాన్ని నేరుగా కోరే అధికారం పొందారని తెలిపారు. ఈ చట్టం విజయాన్ని దరఖాస్తులు, అప్పీళ్ల పరిష్కార సంఖ్య తోనే కాకుండా పరిపాల నా విధానాల్లో తీసుకు వచ్చే శాశ్వత, పారదర్శ కమైన మార్పు లతో అంచనా వేయాలని సూచించారు. గవర్నర్ శుక్లా సమాచారహక్కు చట్టంలోని సెక్షన్ 4(1)(బి) కింద ముందస్తు సమా చార వెల్లడి అత్యంత కీల కమని, ఈ చట్టానికి ఆత్మవంటిదని అభివర్ణిం చారు. తెలంగాణ వంటి వైవిధ్యభరిత రాష్ట్రంలో సమాచారాన్ని తెలుగుతో పాటు ప్రజలకు అర్థమయ్యే ఇతర భాషల్లోనూ అందుబాటులో ఉంచాలని సూచించారు. డిజిటల్‌యుగంలో కృత్రిమ మేథస్సు, డేటా విశ్లేషణ, డిజిటల్ రికార్డుల నిర్వహణ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సురక్షితంగా, సమ్మిళిత పద్ధతిలో వినియోగించడం ద్వారా సమాచార వ్యవస్థలను మరింత పారదర్శకం, వేగవంతంగా, అన్నింటికీ మించి సమర్థవంతంగా తీర్చిదిద్దవచ్చని గవర్నరు అభిప్రాయపడ్డారు. ప్రజా సమాచార అధికారులు, ప్రథమ అప్పీళ్ల అధికారులు ప్రతీ దరఖాస్తును బాధ్యతగా పరిగణించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా గవర్నరు తెలంగాణ సమాచార కమిషన్ రూపొందించిన సమాచార దర్పణం వార్తాపత్రికను ఆవిష్కరించారు. అనంతరం డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి.వి.ఆనంద్ సమాచార హక్కు ప్రతిజ్ఞ చేయించారు. సమాచార హక్కు చట్టం అమలులో విశేష కృషిచేసిన అధికారులు, విభాగాలకు గవర్నరు చేతులమీదుగా అవార్డులు ప్రదానంచేసి ఘనంగా సత్కరించారు.

రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డా. జి.చంద్ర శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కేవలం 15 నెలలలో 30వేల కేసులకుగాను 21వేల కేసులను కమిషన్ పరిష్కరించిందన్నారు. 24 శాఖల్లో పెండిన్సీని దాదాపు సున్నాస్థాయికి తీసుకువచ్చామని, 8ఏళ్లుగా పెండింగ్‌లోనున్న ఆడిట్ ప్రక్రియను పూర్తిచేశామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేతులమీదుగా కమిషన్ నూతన లోగో ఆవిష్కరణ, సమాచార దర్పణం వార్తాపత్రిక ప్రారంభం, హైబ్రిడ్ విధానంలో వర్చువల్ విచారణల నిర్వహణలాంటి చర్యలతో సంస్థాగత ఆధునీకరణకు ప్రాధాన్యత నిస్తున్నట్లు వివరిం చారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయ మూర్తి జస్టిస్ సుభాష్‌రెడ్డి, డీజీపి సి.వి. ఆనంద్, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ వినయ్‌కుమార్, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ సుల్తానియా, సాధారణ పరిపాలనశాఖ ప్రత్యేక ప్రధాన కార్య దర్శి బెన్‌హర్ మహేష్‌దత్ ఎక్కా, రాష్ట్ర సమా చార కమిషనర్లు, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, పలువురు ప్రభుత్వ ఉన్నతాధికా రులు, వివిధ శాఖల ప్రజా సమాచార అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో మహిళ హత్య

**హైదరాబాద్ (మలక్‌పేట), అక్టోబరు 9, ప్రభాతవార్త:** మహిళపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేయడంతో మృతి చెందిన సంఘటన చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి కథనం ప్రకారం చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అజంపురం లో మాన్వా హోల్ సేల్ క్లాత్ స్టోర్‌లో తహెరా బేగం (36) విధులు నిర్వహిస్తుంది. కాగా ఇబ్రహీం అనే వ్యక్తి శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో క్లాత్ స్టోర్ లో ప్రవేశించి కత్తితో తాహెరా బేగం పై దాడి చేసి పారిపోయాడు. సమాచారం తెలియడంతో ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి సిబ్బందితో కలిసి తీవ్ర గాయాలకు గురైన తాహెరా బేగం ను స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించాగా అప్పటికే ఆమె మరణించిందని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఈ మేరకు చాదర్ ఘాట్ ఇన్స్పెక్టర్ బ్రహ్మ మురారి ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర సంచలనాన్ని కలిగించింది.

## తెలంగాణలో 95 లక్షల ఓట్ల తొలగింపు ప్రచారం అవాస్తవం: ఎన్నికల ప్రధానాధికారి

**హైదరాబాద్,అక్టోబరు9,ప్రభాతవార్త:**తెలంగాణలో 95 లక్షల ఓట్లు తొలగింపు ప్రచారం అవాస్తవమని ఎస్ఈసీ తెలిపారు. 95 లక్షల ఓట్లను తొలగించారంటూ వచ్చిన ప్రచారంపై తెలంగాణ ఎన్నికల ప్రధానాధికారి వివరణ ఇచ్చారు. ఓటర్ల జాబితా సవరణపై తప్పుడు ప్రచారం జరుగుతోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 73,39,235 మంది ఓటర్లను మాత్రమే ఏఎస్‌డీడీ కేటగిరీలో గుర్తించినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 92,88,187 నోటీసులు జారీ చేశామని చెప్పారు. 92,23,486 మంది ఓటర్లకు నోటీసులు అందగా.. ఇంకా 64,701 నోటీసులను పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు నోటీసులు అందుకున్న వారిని 82,11,205 మంది విచారణలు పూర్తి అయినట్లు ఎస్ఈసీ తెలిపారు. తుది ఓటర్ల జాబితాలో చోటు కల్పించేందుకు 74,62,851 మందిని అర్హులుగా గుర్తించామని.. అనర్హులుగా గుర్తించిన ఓటర్లు 12,969 మంది మాత్రమే అని తెలిపారు. మరో 18,12,367 మంది ఓటర్లపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. 2026, నవంబర్ 5 లోపు మిగిలిన నోటీసులపై నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు.

## కరవు ప్రభావిత మండలాలపై ప్రాథమిక నివేదికలు సిద్ధం చేయండి

### ఎల్‌నినో ప్రభావంపై జిల్లా కలెక్టర్లతో సిఎస్ విడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్,అక్టోబరు9,ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న వర్షపాతం లోటు పరిస్థితులను సమీక్షి ంచేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేసి, కరువు ప్రభావిత మండలాలపై ప్రాథమిక నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మంత్రులతో సమావేశం అనంతరం సచివాలయం నుంచి రైతులు,



శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో వఇడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న సిఎస్ సంజయ్‌జాజు

శాస్త్రవేత్తలు, అధికారులతో వీడియో సమావేశం నిర్వహిస్తారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కలెక్టర్లకు తెలిపారు. ఈ సమావేశంలో రైతు వేదికల ద్వారా రైతులు పాల్గొంటారని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని కలెక్టర్లకు సూచించారు.వర్షపాతం లోటు కారణంగా పరిస్థితి, వచ్చే ఏడాది మధ్యకాలం వరకు కొనసాగే అవకాశం ఉందని సిఎస్ పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితుల ప్రతికూల ప్రభావాల నుంచి రైతులను కాపాడేందుకు పంటల వైవిధ్యీకరణ, ముందస్తు ప్రణాళికలు అత్యంత అవసరమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని తెలిపారు.కరువు మార్గదర్శకాలను అధ్యయనం చేసి, జిల్లాల్లో కరువు ప్రభావిత మండలాలను గుర్తిస్తూ ప్రాథమిక నివేదికలు సమర్పించాలని ప్రభుత్వ ఆయన కలెక్టర్లను ఆదేశించారు. గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పించడంతోపాటు ఉత్పాదకతను పెంచే, దీర్ఘకాలం ఉపయోగపడే ఆస్తుల నిర్మాణానికి విబి జీ రాంజీ నిధులను వినియోగించుకోవాలని సూచించారు. కరువు తరహా పరిస్థితులను ఎదుర్కొనేందుకు నిధుల కొరత ఉండబోదని ఆయన స్పష్టం చేశారు.కరువు ప్రకటనకు సంబంధించిన మార్గదర్శకాలను ఇప్పటికే జిల్లాలకు పంపించినట్లు ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ కలెక్టర్లకు తెలిపారు. ప్రాథమిక నివేదికలు సమర్పించే సమయంలో వర్షపాతం గణాంకాలు, పంటల సాగు విస్తీర్ణం, నేలలో తేమ పరిస్థితులు, జలవనరులకు సంబంధించిన గణాంకాలు, జలాశయాల్లో నీటి నిల్వల స్థాయులు, వాగులు, ప్రవాహాల పరిస్థితులను సమగ్రంగా అంచనా వేయాలని ఆయన సూచించారు.

# డెడ్ స్టోరేజీకి చేరువలో సింగూర్!

- అడుగంటుతున్న నీటి నిల్వలు.. జనవరి చివరి వరకే మిషన్ భగీరథకు నీళ్లు? - పూర్తి నిల్వ సామర్థ్యం 29.917 టిఎంసిలు, ప్రస్తుతం ప్రాజెక్టులో 3.980 టిఎంసిలు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజల విజ్ఞప్తి



సింగూర్ ప్రాజెక్టులో అడుగంటిన నీటిమట్టం

**పుల్కల్ అక్టోబర్ 9 ప్రభాతవార్త** :ఉమ్మడి మెదక్ జిల్లాకు తాగు, సాగునీటిని అందించడంలో కీలకమైన సింగూర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు క్రమంగా తగ్గుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వర్షాభావ పరిస్థితులు, నిరంతర నీటి వినియోగంతో ప్రాజెక్టు నిల్వలు అడుగంటుతున్నాయి. 29.917 టీఎంసీల పూర్తి సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులో ప్రస్తుతం 3.980 టీఎంసీల నీరు మాత్రమే ఉండటంతో రానున్న వేసవిలో తాగునీటి సరఫరాపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.నెలకు ఒక టీఎంసీ సరఫరా!సింగూర్ నుంచి మిషన్ భగీరథ అవసరాలకు ప్రతినెలా సుమారు ఒక టీఎంసీ నీటిని సరఫరా చేస్తున్నారు. ఇదే స్థాయిలో వినియోగం కొనసాగితే ప్రస్తుత నిల్వలు ఎక్కువ కాలం సరిపోవనే ఆందోళన నెలకొంది. జనవరి చివరి వరకు మాత్రమే నీటి సరఫరా కొనసాగించే అవకాశం ఉందనే అంచనాలు వినిపిస్తున్న నేపథ్యంలో ఆ తర్వాత పరిస్థితిపై చర్చ జరుగుతోంది.సాగుకు విరామం.. తాగునీటికి తప్పని సరఫరా!నీటి నిల్వలు తగ్గడంతో సాగునీటి విడుదలపై ఆంక్షలు విధించి, నిల్వలను కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రివిట్‌మెంట్ పనుల నేపథ్యంలో పంటల సాగుకు విరామం ప్రకటించే పరిస్థితి నెలకొన్నప్పటికీ, తాగునీటి అవసరాల కోసం మిషన్ భగీరథకు నీటిని అందించాల్సి ఉంది. దీంతో ప్రాజెక్టుపై ఒత్తిడి పెరుగుతోంది.ప్రత్యామ్నాయాలపై ఇప్పటి నుంచే దృష్టి!అక్టోబర్‌లోనే నీటి నిల్వలు 3.980 టీఎంసీలకు పడిపోవడం, వేసవిలో డిమాండ్ పెరిగే అవకాశాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సింగూర్‌పై ఆధారపడిన గ్రామాలు, పట్టణాలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు కార్యాచరణ రూపొందించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ నీటి వనరులను గుర్తించడం, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించడం, సరఫరా ప్రణాళికను సిద్ధం చేయడం ద్వారా రానున్న వేసవి కష్టాలను అధిగమించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.జనవరి చివరి వరకు మాత్రమే నీరు సరిపోతుందనే అంచనాను అధికారికంగా ధ్రువీకరించిన సమాచారం అందుబాటులో లేకపోవడంతో, ప్రచురణకు ముందు సంబంధిత అధికారుల నుంచి నిర్ధారించుకోవడం మంచిది.

# బిసిలకు 34 వేల ఉద్యోగాలు, 100 గురుకులాలు, 100 కాలేజీ హాస్టళ్లు మంజూరు చేయాలి

## చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజుతో ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో బిసి నేతల చర్చలు



సంజయ్ జాజును కలిసి వినతిపత్రం అందజేస్తున్న బిసి నాయకుల బృందం

**హైదరాబాద్, అక్టోబర్ 9, ప్రభాతవార్త** : రాష్ట్రంలో బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో జరుగుతున్న అన్యాయాలను సరిదిద్ది, వారికి న్యాయం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన నేతృత్వంలో బీసీ నాయకుల బృందం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును శుక్రవారం కలిసి పలు కీలక అంశాలపై చర్చించింది. బీసీలకు విద్యా, ఉద్యోగ అవకాశాలు పెంచడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీ విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్రంలో 100 బీసీ గురుకులాలను, 100 కాలేజీ హాస్టళ్లను మంజూరు చేయాలని ఆర్. కృష్ణయ్య కోరారు. ఉన్నత విద్యను అభ్యసించే బీసీ విద్యార్థులకు సరైన వసతి సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కాలేజీ హాస్టళ్ల మంజూరుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో అంగీకరించిన నేపథ్యంలో, వాటి ఏర్పాటుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రతి బీసీ కుటుంబానికి రూ.20 లక్షల వరకు సబ్సిడీ రుణాలు అందించే విధానాన్ని అమలు చేయాలని నేతలు కోరారు. స్వయం ఉపాధి పథకం కింద ప్రతి బీసీ కుటుంబానికి రూ.10 లక్షల సబ్సిడీ అందించి, చిన్న వ్యాపారాలు, ఇతర ఉపాధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన లబ్ధిదారులకు రుణాలు అందించడం ద్వారా బీసీ కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచాలని సూచించారు.

ప్రభుత్వంలోని ఉన్నత ఉద్యోగాలు, కీలక కార్యనిర్వాహక పదవుల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్1, గ్రూప్2, ఇంజినీరింగ్ తదితర విభాగాల్లో బీసీ ఉద్యోగులకు ఉన్నత పదవులు దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హతలు ఉన్నప్పటికీ బీసీ ఉద్యోగులకు ఉన్నత స్థాయి పోస్టుల్లో తగిన అవకాశాలు లభించడం లేదని పేర్కొంటూ, జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని ప్రధాన కార్యదర్శికి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో 14 వేల ఉపాధ్యాయ పోస్టులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలల్లో 10 వేల పోస్టులు, ఎయిడెడ్ పాఠశాలల్లో 6 వేల పోస్టులు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలల్లో 3 వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు విద్యా వ్యవస్థలో సిబ్బంది కొరతను అధిగమించేందుకు నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల ప్రకారం గ్రూప్1లో 1,500 పోస్టులు, గ్రూప్2లో 3,000 పోస్టులు, గ్రూప్3, గ్రూప్4 విభాగాల్లో 20 వేల పోస్టులను భర్తీ చేయాలని బీసీ నేతలు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు న్యాయం జరిగేలా పెండింగ్‌లో ఉన్న నియామక ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నిబంధనలకు అనుగుణంగా రెగ్యులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని నేతలు తెలిపారు. ప్రతి హాస్టల్‌కు ఐదుగురు వర్కర్లను మంజూరు చేసి, విద్యార్థులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హాస్టళ్లలో అవసరమైన సిబ్బందిని నియమించి, విద్యార్థుల వసతి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

రాష్ట్రంలోని సుమారు 14 లక్షల మంది కాలేజీ విద్యార్థులకు సంబంధించిన రూ.8,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆర్. కృష్ణయ్య నేతృత్వంలోని బృందం డిమాండ్ చేసింది. ఫీజుల బకాయిలు పేరుకుపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం తక్షణమే బకాయిలను విడుదల చేయాలని కోరారు.

ఈ చర్చల్లో బీసీ ఫ్రంట్ చైర్మన్ గోరిగె మల్లేష్, బీసీ సంఘం అధ్యక్షుడు సి. రాజేందర్, బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు అనంతయ్య, జాతీయ బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి అల్లం యాదయ్య, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామాంజనేయులు, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ మోదీ రాందేవ్, నిఖిల్‌తో పాటు బీసీ నాయకులు లింగయ్య యాదవ్, శివకృష్ణ ముదిరాజ్, అరవింద్, జోషి, బలరాం, వంశీ తదితరులు పాల్గొన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో సముచిత న్యాయం జరిగేలా ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించి, వాటి అమలుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# 14న ఇండియా-వెస్టిండీస్ టీ20మ్యాచ్

## - ఉప్పల్ స్టేడియంను ముస్తాబు చేస్తున్న హెచ్‌సిఎ - విద్యార్థులు, ఆర్మీ అధికారులకు ఉచిత టికెట్లు : హెచ్‌సిఎ కార్యదర్శి ఎం.జీవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌సిఏ కార్యదర్శి మన్నె జీవన్‌రెడ్డి, శేషనారాయణ్ తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 9,ప్రభాతవార్త:** భారత్-వెస్టిండీస్ జట్ల మధ్య ఈ నెల 14న ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నాలుగో టీ20 మ్యాచ్‌కు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్‌సిఏ కార్యదర్శి ఎం.జీవన్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శేషనారాయణ్, సీఈఓ ఇంతియాజ్ ఖాన్‌తో కలిసి మ్యాచ్ ఏర్పాట్ల వివరాలను వెల్లడించారు. మ్యాచ్ కోసం మొత్తం 34 వేల టికెట్లను అందుబాటులో ఉంచామని వాటిని మూడు ఫేజ్‌లుగా రిలీజ్ చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు 12 వేల టికెట్లు విక్రయించామని టికెట్ ధరలు రూ.750 నుంచి రూ.20 వేల వరకు ఉన్నాయని తెలిపారు. ఒక్కొక్కరు గరిష్ఠంగా నాలుగు టికెట్లు వరకు కొనుగోలు చేయవచ్చని తెలిపారు. మ్యాచ్ వీక్షణ కోసం మరో 5 వేల ఉచిత ప్రవేశ పాసులను కేటాయించామని ఇందులో భాగంగా 2,500 మంది పాఠశాల విద్యార్థులకు ఉచితంగా మ్యాచ్ చూసే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఆర్మీ అధికారుల కోసం 250 పాసులు కేటాయించినట్లు వెల్లడించారు.అలాగే మ్యాచ్ కోసం రెండు కొత్త పిచ్‌లను సిద్ధం చేస్తున్నామని స్టేడియం పరిసరాల్లో సుమారు 4,500 వాహనాలకు పార్కింగ్ సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫ్లడ్‌లైట్లు, అగ్నిమాపక భద్రత, ప్రేక్షకులకు అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అపోలో ఆసుపత్రులతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు వివరించారు.

పర్యావరణ పరిరక్షణకు చర్యలు

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వ్యర్థాలను వేరు చేసి పునర్వినియోగానికి చర్యలు తీసుకోవడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం సహకారంతో "క్లీన్ క్రికెట్ ఇనిషియేటివ్"లో భాగంగా పర్యావరణహిత చర్యలు అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రేక్షకులు మ్యాచ్ ప్రారంభానికి కనీసం రెండు గంటల ముందే స్టేడియానికి చేరుకోవాలని సూచించారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు మెట్రో రైలులో ప్రయాణించడాన్ని ప్రాధాన్యంగా తీసుకోవాలని కోరారు. మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్, మల్కాజిగిరి నగరపాలక సంస్థతో పాటు ఇతర శాఖల సమన్వయంతో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

# ప్రవాసి ప్రజావాణిని సందర్శించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



ప్రవాసీ ప్రజావాణిని సందర్శించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**బేగంపేట అక్టోబరు 9,ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో జరుగుతున్న సీఎం ప్రజావాణిని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణలు శుక్రవారం ప్రవాసీ ప్రజావాణీని సందర్శించారు. సీఎం ప్రజావాణి అమలు జరుగుతున్న తీరును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్ ఉక్రెయిన్ యుద్ధంలో 39 రోజుల క్రితం సెప్టెంబర్ 1న మృతి చెందగా. మృతదేహం తరలింపు కోసం, రూ. 6 లక్షలు చెల్లించాలని ఉక్రెయిన్ ఎంబసీ సూచించిన నేపథ్యంలో సహాయం కోసం మృతుని భార్య భార్గవి, తల్లి గంగు, గ్రామ సర్పంచ్ బత్తుల గంగాధర్ తో కలిసి శుక్రవారం ప్రవాసీ ప్రజావాణిని ఆశ్రయించారు. సీఎంఓ అధికారులతో మాట్లాడి ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ కె. విద్యాసాగర్, ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు చెన్నమనేని శ్రీనివాస రావు, స్వదేశ్ పరికిపండ్ల, తదితరులు పాల్గొన్నారు. సీఎం ప్రజావాణిలో 127 దరఖాస్తులు: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో శుక్రవారం నిర్వహించిన 260వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో 16 గ్రూపులు, 591 మంది ద్వారా 127 దరఖాస్తులు అందాయి.రెవెన్యూ శాఖకు 47, విద్యుత్ శాఖకు 15, హోం శాఖకు 14, ఇతర శాఖలకు 51 దరఖాస్తులు అందాయి. ఈ ప్రజావాణి కార్యక్రమంలో స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏసిపి ఉమేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మాదాపూర్‌లో భూ విక్రయం పేరిట రూ.25 లక్షల మోసం

## జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో ఎపి ఎమ్మెల్సీ రామచంద్రయ్య ఫిర్యాదు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** మాదాపూర్‌లో 5.5 ఎకరాల భూమిని విక్రయిస్తామంటూ నమ్మించి రూ.25 లక్షలు మోసం చేసినట్లు ఏపీ ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్య జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. మాదాపూర్ 100 ఫీట్ల రోడ్డులోని భూమి తమదేనంటూ పెరూరు తులసీ గోపాల్, ఆయన కుమారుడు గిరిధర్ పెరూరుతో పాటు మరికొందరు రామచంద్రయ్యతో పాటు ఆయన భార్యను నమ్మించారు. వారి మాటలు నమ్మి రామచంద్రయ్య ఆర్‌టీజీఎస్ ద్వారా రూ.25 లక్షలు ముందస్తుగా చెల్లించారు. భూమికి సంబంధించిన అసలు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరగా నిందితులు తప్పించుకుంటూ వచ్చారని, విచారణలో ఆ భూమి తులసీ గోపాల్‌కు చెందింది కాదని తెలిసిందని రామచంద్రయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ముందస్తు పథకం ప్రకారమే మోసానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ, భూమి యాజమాన్య హక్కులు, పత్రాలు, నగదు వినియోగం తదితర అంశాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు బీఎన్ఎస్ 316(2), 318(4) సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

## లేదంటే తిరిగి నిరవధిక సమ్మె చేస్తాం: వర్సిటీల అధ్యాపకుల సంఘం



సమావేశంలో డిమాండ్లపై నినాదాలు చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

**సైఫాబాద్, అక్టోబరు 9 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ముందుగా కాంట్రాక్ట్ అధ్యాపకులను విలీనం చేయాలని, లేకపోతే క్రమబద్ధీకరణ చేయాలని, క్రమబద్ధీకరణ చేసేంతవరకు ఉద్యోగ భద్రతతో కూడిన యుజిసి పే స్కేల్ అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాల అధ్యాపకుల సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్ర విద్యా కమిషనర్ సిఫారు ్సలను, సుప్రీంకోర్టు ఆదేశాలు, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో ప్రకారంగానైనా కాంట్రాక్ట్ అధ్యాపకులందరిని, విలీనం చేయాలని, లేకపోతే క్రమబద్ధీకరించాలని సంఘం నాయకులు కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎ.పరుశురాం, ఉపాధ్యక్షులు డా.డి.తిరుపతి, డా.ఒర్సు కృష్ణయ్య, ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, పరంధాములు మాట్లాడుతూ రాష్ట్రంలోని 12 వందల మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు తమ డిమాండ్ల సాధనకై గతంలో 11 రోజులు నిరవధికంగా సమ్మె చేసిన సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మానవీయ కోణంలో ఆలోచించి అధ్యాపకులందరికి ఉద్యోగ భద్రత కల్పిస్తామని, సరి సమానమైన ఖాళీలను మినహాయించి తరువాతే మిగతా ఖాళీలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సిఎం హామీ ఇచ్చి ఏడాదిన్నర గడిచిందని, కాని కొంత మంది అధికారులు అడ్డుపడటం వల్ల హామీ అమలు కాలేదన్నారు. ఈ విషయంలో రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని గతంలో ఇచ్చిన హామీకి జివో విడుదల చేసి న్యాయం చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా వేతనాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ తరువాతనే మిగిలిన ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తిరిగి నిరవధిక సమ్మె చేయడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. మహిళా అధ్యాపకులకు వేతనంతో కూడిన 6 నెలల ప్రసూతి సెలవులు అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ 30 లక్షలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 20 మంది అధ్యాపకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు.

# గ్రామీణ నిరుపేద విద్యార్థులకు ఉచిత భోజనం, వసతి

## పోలాప్రగడ చారిటబుల్ ట్రస్ట్‌లో 12న అడ్మిషన్లకు ఇంటర్వ్యూలు



శ్రీలక్ష్మీవెంకటేశ్వర పోలాప్రగడ చారిటబుల్ ట్రస్ట్ సమావేశంలో పాల్గొన్న పి.రామకృష్ణ, అరుణ్‌కుమార్‌సింగ్, రాంచంద్రన్, రమాదేవి, మహిపాల్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 9 ప్రభాతవార్త** గ్రామీణ నిరుపేద విద్యార్థులకు శ్రీలక్ష్మీ ్రవెంకటేశ్వర పోలాప్రగడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలో ఉచిత వసతి కల్పించనున్నట్లు సంస్థ మేనేజింగ్ ట్రస్టీ పి.రామకృష్ణ తెలిపారు. నల్లకుంటలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువుకోవాలనే పట్టుదల ఉన్న గ్రామీణ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వసతి గృహంలో నివాసం, భోజనం ఏర్పాటుతో పాటు బస్‌పాస్ తదితర సౌకర్యాలను సమకూరుస్తున్నామన్నారు. నగరం,శివారు ప్రాంతాలైన సుచిత్ర క్రాస్రోడ్స్, జీడిమెట్ల, లంగర్‌హౌజ్, లింగంపల్లి తదితర ప్రాంతాల్లో వసతి గృహాలు ఉన్నాయని తెలిపారు. తల్లి, తండ్రులు కోల్పోయిన నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రొఫెషనల్ కోర్సులు, గ్రాడ్యు యేషన్ కోర్సులు అభ్యసిస్తున్న కల్పిస్తున్నామన్నారు. వసతి గృహాల్లో ఉచిత అడ్మిషన్ల కోసం ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 12వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నల్లకుంట శంకరమఠం కూరగాయల మార్కెట్ సమీపంలోని ఎస్ఎల్ డయాగ్నస్టిక్ సెంటర్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. ఆసక్తి గల విద్యార్థులు ఇతర వివరాల కోసం 9550472190 ఫోన్ నెంబర్లో సంప్రదించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ట్రస్టీ సభ్యులు అరుణ్‌కుమార్‌సింగ్, కె.రాంచంద్రన్, ఎన్.రమాదేవి, చిరంజీవరావు, వీ.వీ.కే.ప్రసాద్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

# తెలంగాణలో ఫైర్ ఎన్‌ఒసి నిబంధనల్లో కీలక మార్పులు

**హైదరాబాద్,అక్టోబరు9,ప్రభాతవార్త:**తెలంగాణలో ఫైర్ ఎన్‌వోసీ నిబంధనల్లో కీలక మార్పులు చేసింది. నివాస అపార్ట్‌మెంట్ల ఎత్తు పరిమితి 18 నుంచి 24 మీటర్లకు పెంచుతూ ఫైర్ శాఖ డీజీ విక్రమ్‌సింగ్ మాన్ ఉత్తర్వులు ఇచ్చారు. 24 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న భవనాలకు ఫైర్ టవర్ తప్పనిసరిని పేర్కొన్నారు. 2026 అక్టోబర్ 7 నుంచి కొత్త నిబంధనలు అమలులోకి వస్తాయన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలకు 12 రోజులు సెలవులు

**హైదరాబాద్,అక్టోబరు9,ప్రభాతవార్త:**బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు 10 నుంచి 21 వరకు 12 రోజుల పాటు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ఈ మేరకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసింది. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు చేసిన విజ్ఞప్తిని పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు.సెలవుల కాలంలో లబ్ధిదారులకు సాధారణంగా అందించే వేడి భోజనానికి బదులుగా టేక్‌హోమ్ రేషన్ పంపిణీ చేయడానికి అనుమతి ఇచ్చారు. అక్టోబర్ 22 నుంచి రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయి.

# ఉద్యాన సాగుకు ప్రోత్సాహం ఆయిల్ పామ్‌లో అంతరపంటగా కోకో: వ్యవసాయ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త** రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగుకు మరింత ప్రోత్సాహం అందించాలని ఆలోచన చేస్తున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఒక సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరుగుతోందన్నారు. గతంతో పోలిస్తే మసాలా దినుసులు 65 శాతం, ఎర్రమిరప 83 శాతం, ఇతర సుగంధ ద్రవ్యాలు 192 శాతం, పూలు 198 శాతం మేర సాగు పెరిగినట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలో కూరగాయల సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచాలని సూచించారు. కూరగాయల సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఉత్పత్తి పెంపు, మార్కెటింగ్ సదుపాయాలను మెరుగు పరచాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో పండించిన కూరగాయలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి రాష్ట్రం ఎదగాలని, ఆ దిశగా ఉద్యాన శాఖ అధికారులు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. ఇక రాష్ట్రంలో 20 లక్షల ఎకరాలకు గాను కనీసం 10 లక్షల ఎకరాల్లోనైనా సాగు జరిగేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. జిల్లాలో కనీసం ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ.

# ప్రజలు కోరితే ఎన్నికల్లో పోటీ చేస్తా : ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసి



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్దిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసి

**చాంద్రాయణగుట్ట, అక్టోబర్ 9, ప్రభాతవార్త** : ప్రజలు కోరితే ఎన్నికల్లో పోటీ చేయటానికి తాను సిద్ధంగా ఉన్నానని, అయితే రాజకీయాలలోకి తన కుటుంబాన్ని లాగ వద్దని చాంద్రాయణగుట్ట శాసనసభ్యులు అక్బరుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏ పార్టీ గెలిచినా మజ్లిస్‌ను దగ్గరకు తీసుకుంటారని, వారితో మాకు కావాల్సిన అభివృద్ధి పనులు చేయించుకుంటామని తెలిపారు. తాను రాజకీయాల కోసం ఎన్నికల్లో గెలవటం లేదని, ప్రజల దీవెనలు, వారు వేసిన ఓట్లతో గెలుస్తున్నానన్నారు. శుక్రవారం బండ్లగూడలోని బారిస్టర్ ఫాతిమా ఒవైసీ కేజీ టూ పీజీ ఎడ్యుకేషనల్ క్యాంపస్‌లో జరిగిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. చాంద్రాయణగుట్ట నియోజక వర్గం బండ్లగూడ మండల పరిధిలోని షాదీముబారక్ లబ్ధిదారులకు 445, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు 124 చెక్కులను అందజేశారు.

మొత్తం ఐదు కోట్ల 69 లక్షల 66వేల నాలుగు రూపాయల విలువ చేసే 569 చెక్కులను అందించారు. దీంతో నియోజక వర్గ పరిధిలో ఇంత వరకు 356 కోట్ల 36లక్షల 33వేల 155 రూపాయల విలువ చేసే 41,620 చెక్కులను పంపిణీ చేసినట్లయ్యింది. అనంతరం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసి రాష్ట్రంలో మజ్లిస్ పుంజుకున్నతీరు,

ప్రభుత్వాల వైఖరిని వివరించారు. 2006లో జరిగిన అసెంబ్లీ సమావేశాలలో మైనార్టీలకు ఉపకార వేతనాల గురించి నిలదీస్తే అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి వెంటనే స్పందించి మైనార్టీలకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తూ ప్రకటన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా మజ్లిస్ పార్టీ శాసనసభలో లేవనెత్తే ప్రశ్నలను మంత్రులను, ప్రభుత్వాని ఆలోచింప చేస్తాయన్నారు.

# ఆధునిక సాంకేతికతతో నిరంతర విద్యుత్

## ఉత్తర తెలంగాణ పంపిణీ సంస్థ సిఎండి వరుణ్

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త** ఆధునిక సాంకేతికతతో వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందిస్తున్నట్లు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి కె వరుణ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో తమ సంస్థ పరిధిలో రియల్‌టైమ్ ఫీడర్ మానిటరింగ్‌సిస్టం (ఆర్టీఎఫ్ఎంఎస్)లో పూర్తి చేసిన తొలి సర్కిల్ గా కరీంనగర్ నిలిచిందన్నారు. ఈ సిస్టంను విస్తృత స్థాయిలో అమలు చేస్తూ, కరీంనగర్ సర్కిల్ పరిధిలోని 100 శాతం సబ్‌స్టేషన్లను స్కాడాతో అనుసంధానం పూర్తి అయ్యిందని వెల్లడించారు. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా విద్యుత్ సరఫరా నాణ్యతను మరింత మెరుగుపరచడం, అంతరాయాలను తగ్గించడం, సమస్యలను వేగంగా గుర్తించి పరిష్కరించడం, ఫీడర్ల పనితీరును సమర్థవంతంగా పర్యవేక్షి ంచడం ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష ్యమని పేర్కొన్నారు. వినియోగదారులకు మరింత నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఆధునిక సాంకేతిక వ్యవస్థను మరింత విస్తృతం చేస్తున్నట్లు చెప్పారు. తమ సంస్థ పరిధిలో ఇప్పటి వరకు 1,005 సబ్ స్టేషన్లు పూర్తి అయ్యాయని త్వరలో హన్మకొండ, ఖమ్మం, ఆసిఫాబాద్ లో 100 శాతం సబ్‌స్టేషన్లను స్కాడాతో అనుసంధానం పూర్తి అవుతుందని చెప్పారు. రాబోయే రెండు నెలల్లో మిగతా 419 సబ్ స్టేషన్లు పూర్తి చేస్తామన్నారు. స్కాడా కంట్రోల్ రూమ్ నుంచే విద్యుత్ సరఫరా పరిస్థితిని రియల్‌టైమ్‌లో పర్యవేక్షి ంచే అవకాశం ఉంటుందని తెలిపారు. ఫీడర్‌లో విద్యుత్ అంతరాయం ఏర్పడితే వెంటనే రియల్‌టైమ్ అలర్ట్‌లు అందుబాటులోకి వస్తాయని, ఫీడర్లపై ఓవర్‌లోడ్ ఏర్పడినప్పుడు తక్షణ హెచ్చరికలు సైతం ఉంటాయని వివరించారు.

# దుర్గామండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా, విద్యుత్ భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిందే

## - ఎపిసిపిడిసిఎల్ సిఎండి పి. పుల్లారెడ్డి

**విజయవాడ,అక్టోబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:**విజయదశమి పండుగ సందర్భంగా దుర్గాదేవి మండపాలకు ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 కిలోవాట్లు, పట్టణ ప్రాంతాల్లో 5 కిలోవాట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు వెల్లడించారు.

ఈ మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.అనుమతి పొందిన దుర్గా మండపాల నిర్వాహకులు నిర్ణీత నమూనాలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృత ప్రచారం కల్పించాలి: కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ కమిషనర్ భాను ప్రకాష్

**విజయవాడ,అక్టోబరు 9, ప్రభాత వార్తప్రతినిధి:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్లను సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ భాను ప్రకాష్ ఆదేశించారు. ఉమ్మడి కృష్ణాగుంటూరు మరియు తూర్పు గోదావరి పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి సన్నాహక ఏర్పాటచలపై శుక్రవారం ఢిల్లీ నుండి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ వర్చువల్ గా పాల్గొనగా అదనపు ప్రధాన ఎన్నికల అధికారులు దిల్లీ రావు,వెంకటేశ్వర రావుతో పాటు ఉమ్మడి కృష్ణా గుంటూరు,తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమీషనర్ భాను ప్రకాష్ మాట్లాడారు.

# ఎంగిలి పూల వసంతం

**భూస్వామ్య దౌర్జన్యాలు, గడీల పెత్తందారీ అణచివేతకు బలైపోయిన ఒక అమాయక పల్లెపడుచు ఆత్మగౌరవాన్ని, అమరత్వాన్ని పూల రూపంలో ఆవాహన చేసుకుని నివాళులర్పించే చారిత్రక ప్రతిఘటనా సంకేతం బతుకమ్మ.**

ఈ నేల ప్రకృతి పులకింతలతో తడిసిముద్దయి, రుతుపవనాల నిష్క్రమణతో శరదృతువు వినీలాకాశం వెన్నెల తోరణాలు కట్టే వేళ, పల్లెపల్లెనా పూల వసంతం పరవళ్లు తొక్కుతుంది. భాద్రపద అమావాస్య నాటి ఎంగిలిపూల సంరంభం మొదలుకొని ఆశ్వయుజ శుద్ధ అష్టమి నాటి సద్దుల బతుకమ్మ సంబురం వరకు తొమ్మిది రోజుల పాటు సాగే ఈ అపురూప వేడుక. ప్రకృతిని దైవంగా భావించి పూజించే మహోన్నత జీవన తత్త్వం. పచ్చని చేల గట్లపైన, చెరువుల పుంతల్లో, బీడు భూముల అంచుల్లో, గుట్టల సందుల్లో పైసా ఖర్చు లేకుండా సహజసిద్ధంగా వికసించే



నేటి నుంచి బతుకమ్మ వేడుకలు

గునుగు, తంగేడు, కట్ల, గడ్డిపూలు, గుమ్మడి, చామంతి, మందార, దోస, కట్లె, రుద్రాక్ష పూలను కొంగున మూటగట్టి తెచ్చి, తామరాకులు లేదా గుమ్మడి ఆకులపై శంఖాకారంలో వరుసలు వరుసలుగా గోపుర ప్రతీకగా పేర్చి, శిఖరాన పసుపు ముద్దతో గౌరమ్మను ప్రతిష్ఠించి, దీపమెలిగించి ముంగిట్లో నిలిపే అపురూప సాంస్కృతిక వైభవం ఇది. రాగి, ఇత్తడి తాంబాలాలు పూల పల్లకీలుగా మారి మహిళా లోకపు ముంగిళ్లలోకి చేరినప్పుడు ఊరంతా ఒకే కుటుంబమై వెల్లివిరుస్తుంది. గునుగు పూల లేత గులాబీ, తంగేడు పూల దేదీప్యమాన పసుపు, కట్ల పూల నీలికాంతులు కలగలిసి నేలపై ఒక అద్భుత ఇంద్ర ధనుసును ఆవిష్కరిస్తాయి. బతుకమ్మ పుట్టుక, పూర్వాపరాల వెనుక అటు పౌరాణిక ప్రశస్తి, ఇటు చారిత్రక సామాజిక సమర గాథలు పెనవేసుకుని ఉన్నాయి. వేములవాడ చాళుక్యుల కాలం నాటి చారిత్రక ఆధారాలను పరిశీలిస్తే, రాజరాజేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో మహిళలు ప్రకృతి పూలతో గౌరీదేవిని ఆరాధించిన దాఖలాలు కనిపిస్తాయి. మరొక పౌరాణిక గాథ ప్రకారం చోళ వంశానికి చెందిన ధర్మాంగదుడు అనే రాజుకు నూరుగురు కుమారులు యుద్ధంలో నేలకొరిగిన తర్వాత, తీవ్ర తపస్సు ఫలితంగా లక్ష్మీదేవి వరప్రసాదంతో జన్మించిన ఆడబిడ్డను మునులందరూ కలిసి 'బతుకమ్మా... చిరంజీవివై బతుకు' అని దీవించిన ఉదంతం ప్రచారంలో ఉంది. దక్షిణ భారతదేశాన్ని పాలించిన కాకతీయుల వైభవ కాలంలోనూ చెరువుల నిర్మాణం, వ్యవసాయ సమృద్ధికి కృతజ్ఞతగా ఈ పండుగ మహోత్సవంగా విస్తరించింది. జానపద కథనం ప్రకారం, తమ కష్టసుఖాలు, ఆశానిరాశలు, అంతరంగ ఘోషను పంచుకునే సొంత ఆడపడుచు, కన్నతల్లి, ఆత్మబంధువు. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ నవరాత్రి ఉత్సవాల్లో ప్రతి రోజూ ఒక్కో విశిష్ట రూపంతో, ఒక్కో ప్రత్యేక నైవేద్యంతో బతుకమ్మను కొలుస్తూ గ్రామీణ జీవన లయను ప్రతిబింబిస్తారు. మొదటి రోజు



'ఎంగిలిపూల బతుకమ్మ'గా మొదలై నువ్వులు, బియ్యప్పిండి నైవేద్యంతో ఆరంభమవుతుంది. రెండో రోజు 'అటుకుల బతుకమ్మ'కు సప్పిడి పప్పు, బెల్లం, అటుకులు నివేదిస్తారు. మూడో రోజు 'ముద్దపప్పు బతుకమ్మ' కు పెసరపప్పు, బెల్లం సమర్పిస్తారు. నాలుగో రోజు 'నానే బియ్యం బతుకమ్మ'కు నానబోసిన బియ్యం, బెల్లం ముద్దలు పెడతారు. ఐదో రోజు 'అట్ల బతుకమ్మ'కు దోశలు లేదా అట్లు నైవేద్యంగా ఉంచుతారు. ఆరో రోజు 'అలిగిన బతుకమ్మ' నాడు ఎలాంటి నైవేద్యం సమర్పించకుండా అమ్మవారిని ప్రార్థిస్తారు. ఏడో రోజు 'వేపకాయల బతుకమ్మ'కు బియ్య ప్పిండిని వేపకాయల ఆకారంలో చేసి వేయించి పెడతారు. ఎనిమిదో రోజు 'వెన్నముద్దల బతుకమ్మ'కు వెన్న, నువ్వులు, బెల్లం కలిపిన ముద్దలను సమర్పిస్తారు. ఇక ఆఖరి రోజున అత్యంత వైభవంగా జరిగే 'సద్దుల బతుకమ్మ' నాటి సంబురం పరాకాష్ఠకు చేరుకుంటుంది. ఈ రోజున పెరుగన్నం సద్ది, చింతపండు పులిహోర సద్ది, నువ్వుల సద్ది, కొబ్బరి సద్ది, పల్లీల సద్ది వంటి ఐదు రకాల సద్దులను నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ నైవేద్యాలన్నీ కేవలం ఆచారాలు మాత్రమే కాక, ఆయుర్వేద పరంగా శరదృతువు ప్రారంభంలో శరీరంలో తలెత్తే వాత, పిత్త, కఫ దోషాలను సమతుల్యం చేసి రోగనిరోధక శక్తిని పెంపొందించే అద్భుత పోషకాహార విజ్ఞానానికి నిదర్శనం. బతుకమ్మ పండుగలో అంతర్లీనంగా దాగి ఉన్న పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య స్పృహ ప్రపంచ మానవాళికే ఆదర్శ ప్రాయమైనది. స్త్రీల అంతరంగ భావోద్వేగాలకు నిలువుటద్దాలుగా నిలుస్తాయి. సంధ్యా సమయం దాటి రాత్రి వెన్నెల కాంతుల్లో విశాలమైన రచ్చబండల వద్ద, దేవాలయ ప్రాంగణాల్లో రంగురంగుల పట్టుచీరలు ధరించిన మహిళలు వలయాకారంగా తిరుగుతూ, లయ బద్ధంగా చప్పట్లు కొడుతూ, అడుగులో అడుగు వేస్తూ పాడే జానపద గీతాలు మానసిక ఉల్లాసాన్ని, కవితాత్మక భావనలను రగిలిస్తాయి. ఆ పాటల్లో పురాణ గాథలు, రాజుల చరిత్రలు మాత్రమే కాక అత్తవారింటి వేధింపులు, పుట్టింటి మీది తీపి జ్ఞాపకాలు, వ్యవసాయ కష్టాలు, కన్నీటి వ్యథలు, సామాజిక సమరసత స్పష్టంగా ధ్వనిస్తాయి. "శ్రీలక్ష్మి ... ౖ నీ మహిమ గౌరమ్మ... చెప్పనలవిగాదు గౌరమ్మ ఉయ్యాలో నా వదినె ఉయ్యాలో... తీరైన పూలన్నీ ఉయ్యాలోకల వారి కోడలు ఉయ్యాలో... కనకమహాలక్ష్మి ఉయ్యాలోపుట్టింటి గౌరవము ఉయ్యాలో... మెట్టినింట నిలిపె ఉయ్యాలో" అని ఒక మహిళ గొంతు విప్పి రాగం తీస్తే, మిగిలిన వారంతా కోరస్ అందుకుని వంతపాడే సమష్టి తత్త్వమిది. మరొక ప్రసిద్ధ జానపద గీతంలో చారిత్రక వీరగాథలు, త్యాగాలు ధ్వనిస్తూ రాత్రి అంతా మార్మోగుతాయి: పేద, ధనిక అంతరాలు లేకుండా అందరి చేతుల్లోనూ తాంబాలాల్లో అమర్చిన ప్రకృతి పూల బతుకమ్మలే కొలువుదీరుతాయి. చెరువు గట్టున బతుకమ్మలను గంగమ్మ ఒడికి చేర్చిన తర్వాత, మహిళలు ఒకరికొకరు వాయనాలు ఇచ్చుకుంటూ, చెంపలకు పసుపు రాసుకుంటూ, "పోయిరా గౌరమ్మ... మళ్లీ ఏటికి రారమ్మ" అంటూ వీడ్కోలు పలుకుతారు. అనంతరం తెచ్చుకున్న సద్దులను పరస్పరం పంచుకుని తినే దృశ్యం సమష్టి జీవనానికి, ఆత్మీయతకు నిదర్శనం. తెలంగాణ భాష, యాస, జీవన శైలిని స్వపరిపాలన కాంక్షతో అనుసంధానించడంలో బతుకమ్మ కీలక పాత్ర పోషించింది.క జీవనాడిగా అజరామరంగా వెలుగొందుతోంది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల,**

# విమర్శల్ని వింటేనే!



'పని బాగా చేశారు' అన్నది వినడానికి చాలామంది ఇష్టపడతారు. విమర్శను మాత్రం తట్టుకోలేరు. ముఖ్యంగా ఎంత కష్టపడి పనిచేసినా... అమ్మాయిల విషయంలో మాత్రం ఆఫీసుల్లో ప్రత్యేక లెన్స్‌లు పని చేస్తాయి. అంటే వారి, ప్రవర్తన దుస్తులు... ఇలా ఎన్నో అంశాల ఆధారంగా జడ్జ్ చేస్తారు. అలాంటప్పుడు కోపం, బాధ, అసహనం వంటివి కలగడం సహజమే. అలాగని వాటిని వినడానికి అయిష్టత ప్రదర్శించలేదు కదా? ఎవరైనా ఏదైనా అన్నారను కోండి వెంటనే సమాధానం ఇవ్వొద్దు. విమర్శ, ఫీడ్‌బ్యాక్... ఏదైతేనేం పూర్తిగా వినండి మనం వింటేనే అవతలివాళ్లూ తరవాత మనం చెప్పేది వింటారు. ముఖ్యంగా పూర్తిగా వింటేనే దానికి దీటైన సమాధానాన్నీ ఇవ్వగలం. పోనీ అవతలివాళ్ల ఆలోచన లైనా తెలుస్తాయి. ఇదీ మంచిదే. దీన్నో బలహీనతగానూ భావించొద్దు. ఈ ఓపిగ్గా వినడం, భావోద్వేగాల నియంత్రణ, సహానుభూతి వంటి ఎన్నో నైపుణ్యాలను మీకు తెలియకుండానే చేజిక్కించుకుంటారు. ఇవి మిమ్మల్ని మరింత శక్తిమంతంగా మలుస్తాయి. అయినా అన్నిసార్లూ ప్రశంసలు మేలే చేయవు. వాస్తవానికి దూరంగానూ తీసుకెళ్ల గలవు. అప్పుడప్పుడు విమర్శ లనీ తీసుకోవాలి. అప్పుడే మనల్ని మనం తీర్చిదిద్దుకోగలం. మార్చుకుంటూ ముందుకు సాగాలం. కాబట్టి... ఈసారి ఎవరైనా మీ వ్యక్తిత్వం, పనితీరులోపాల గురించి చెబుతుంటే వినండి. అలాగని అవి వాస్తవమని భావించి, మిమ్మల్ని మీరు మార్చుకోమని కాదు. కేవలం వినండి. అవసరమైతే ఉదాహరణలతో చెప్పమనండి. వాస్తవమే అనిపించిందా... 'థాంక్స్' చెప్పి పాటించండి. లేదంటారా వదిలేయండి. ఎంతచెప్పినా ఒకరు 'నువ్విది... ఇలా చేశావ్ లేదా చేస్తావ్' అంటే తెలిసీ తెలియక చేసినా అది బాధగానే అనిపిస్తుంది. వ్యక్తిగత దాడిగానూ తోస్తుంది. అయితే వాళ్లముందు బయటపడాల్సిన పనిలేదు కదా! ఇదీ నేర్చుకోవడమే అనుకుని వినండి. కానీ దానికీ ఓ హద్దు ఉంటుంది. మాట తూలినా, అగౌరవంగా మాట్లాడినా ఊరుకోవద్దు. అయితే ఇది ఎదుగుదలలో ఓ భాగం కాబట్టి, భయపడొద్దు.. ప్రశాంతంగా ఎదుర్కోండి,

### చిట్కా

- వాష్ బేసిన్ రంధ్రాల్లో వాసనరాకుండా ఉండటానికి బేకింగ్ సోడావేసి వేడినీరు పోయండి.
- ఎండు కొబ్బరి ని సులభంగా తురమా లంటే దానిపై కొద్దిగా నీళ్ల చల్లి ఫ్రిజ్‌లో ఉంచాలి.
- ఉల్లి పాయలు తరిగేందుకు అరగంట ముందు వాటిని పాలథిన్ కవర్లోవేసి ఫ్రిజ్‌లో పెడితే తరిగే టప్పుడు కళ్లమండవు.చపాతీలు చేసేటప్పుడు గోధుమపిండిలో నీళ్లకు బదులుగా పాలు కలిపి చపాతీలు చేసి చూడండి చాలా రుచిగా ఉంటాయి.

# చదువు



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

తలపై కొమ్ములుండడం పశుధర్మం తలంతా సుజ్ఞానంతో నింపడం విద్యాదర్శం' కాని నేటి విద్యావ్యవస్థ నానాటికీ దిగజారిపోతుంది. విద్యార్థుల్లో వెర్రి వెయ్యితలలు వేస్తుంది. స్కూల్ చదువులు మొదలు పెట్టినప్పటి నుంచీ కాలేజీ చదువులు ముగిసే వరకూ తల్లిదండ్రుల నుంచీ, టీచర్స్ నుంచీ, బైటి నుంచీ ఒకటే మాట. 'ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకోవాలి. విద్యార్థుల జీవితధ్యేయం అదే. అని ఫస్ట్ ర్యాంక్ వస్తేనే చదువు భవిష్యత్ ఉన్నట్టు లేకుంటే వాళ్ళ భవిష్యత్ మొత్తం పాడైపోతున్నట్టు ఒకటే తిట్టడం, కొట్టడం, బెదిరించడం, ఎత్తి పొడవడం అంటూ ఎన్ని రకాలుగా కావాలంటే అన్ని రకాలుగా పిల్లల్లో టెన్షన్ని పెంచడం జరుగుతుంది. దీంతో పిల్లలు దిగులు పడుతూ తమకు తెలియకనే అర్థం కాని చదువుల మీద నిరాసక్తిని, తల్లిదండ్రులపై ద్వేషాన్ని వెళ్ళగ్రక్కు తున్నారు. అక్షరం అంటే నశించనిది. శాశ్వతమైనవి నేర్చుకోవడమే 'అక్షరాభ్యాసం,



దీని వల్ల స్వతంగా ఆలోచించే విధానం నబ్బుతుంది. కాని పిల్లలకి ఇలా చదవాలి, ఇట్లే మాట్లాడాలి. ఇలాగే తినాలి. అల్లరి చేయకూడదు. ఎప్పుడు గుడ్ అనిపించుకుంటూ ఉండాలనే ఆంక్షలతో పిల్లల మనస్సులు అయోమయంలో పడిపోతున్నాయి. పిల్లల్ని నిర్బంధం చేయకపోతే స్వంత ఆలోచనలతో స్వేచ్ఛగా, స్వాభావికంగా వానిలా ఓ సహజమైన క్రమశిక్షణ పిల్లల్లో ఏర్పడుతుంది. విద్య అంటే దేని వల్లనైతే జ్ఞానం తెలుసుకుంటామ్ దాన్ని విద్య అంటారు. ఇది ఒకే గదికి పరిమితం కాదు. దాన్ని నిజ జీవిత అనుభవాల ద్వారా కూడా పొంద వచ్చు.

నేటి విద్య రెడు విధాలుగా ఉంటుంది.

**అధికారిక విద్య:** పాఠశాలల్లో ఉండే ఒక క్రమబద్ధమైన అభ్యాస వాతావరణంలో జరిగే ఒక రకమైన విద్య ఈ విద్యా ప్రక్రియలో ఉపాధ్యాయుడు, విద్యార్థి ఇద్దరూ పాల్గొంటారు.

అనధికారిక విద్య : ఇది సరళమైనది. విద్యార్థులు లోతైన అవగాహ నను పొందుతారు. వీటిలో అనేక బోధనా రూపాలు ఉంటాయి. ఈ విద్యలో తల్లిదండ్రులు ట్యూటర్లు పిల్లలకు బోధిస్తారు. ప్రజలు పుస్తకాలు వర్చువల్ లెర్నింగ్ ఫ్లాట్‌ఫారమ్‌ల సహాయంతో కూడా అనధికారిక విద్యని పొందవచ్చు. ఒ వ్యక్తి నిరంతర సాధన ద్వారా ఇతరుల్ని గమనించడం ద్వారా ఈ అనుభవాన్ని పొందుతారు. ఇది విద్యార్థుల్లో వ్యక్తిత్వ లక్షణాల్ని తార్కిక ఆలోచనా నైపుణ్యాల్ని పెంపొందించడానికి వీలు కల్పిస్తుంది. కాబట్టి పిల్లల్ని చదువు పట్ల సరైన అవగాహన కల్పించాలే తప్ప నిర్బంధించరాదు. వారు చదువు లో వెనకబడిన లేదా ఫెయిల్ అఉతున్నా వారిని ఇతరులతో పోల్చ కుండా, ఉపాధ్యాయుల్ని నిందించకుండా, సరైన విధంగా ప్రోత్సహిస్తూ ముందుకు నడిపించేలా ఇంటి, పరిసరాల వాతావరణం స్వచ్ఛంద విద్యకు సహజంగా పునాది వేసినప్పుడే చదువుకు సార్థకత చేకూరుతుందనే చెప్పవచ్చు.

# తెర

## 'క్రేజీ కల్యాణం' దసరాకు విడుదల



'క్రేజీ నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉద్దెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'క్రేజీ కల్యాణం'. . దసరా పండుగ సందర్భంగా ఈ నెల 16న "క్రేజీ కల్యాణం" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ కథతో "క్రేజీ కల్యాణం" సినిమాను నిర్మించాం. మా సినిమాను ఈ నెల 30న రిలీజ్ చేయాలని అనుకున్నాం. అయితే వెంకటేష్ గారి ఆదర్శ కుటుంబం సినిమా రిలీజ్ పోస్ట్ పోన్ కావడంతో మా టీమ్ అందరూ పండుగకు రిలీజ్ చేయండి అని సూచించారు. మా మూవీ కంటెంట్ మీద మాకు పూర్తి నమ్మకం ఉంది. ఈ స్క్రిప్ట్ ఎవరు విన్నా ఇష్టపడ్డారు. అనుపమ, నరేష్ గారు, తరుణ్ భాస్కర్, అఖిల్ ..ఇలా అందరూ కథ చాలా బాగుందని చెప్పారు. మాకు స్క్రిప్ట్ మీద ఉన్న నమ్మకం, వాళ్లు ఇచ్చిన రెస్పాన్స్ తో మరింత కాన్ఫిడెన్స్ పెరిగింది. నేను యాడ్ బిజినెస్ లో ఉన్నాను. ప్రభుత్వ యాడ్స్, డాక్యుమెంటరీస్, ఇతర కంపెనీల యాడ్స్ చేస్తుంటాను. డైరెక్టర్ బద్రప్ప నాతో చాలా ఏళ్లుగా ట్రావెల్ చేస్తున్నారు. నాకు సినిమా ఇండస్ట్రీ అంటే ఇష్టం, దర్శకుడిగా బద్రప్ప గాజులకు ఇది మొదటి సినిమా కావొచ్చు కానీ ఆయన యాడ్ ఫిలింస్ కు వర్క్ చేశాడు. ఆయన ప్రతిభ గురించి నాకు తెలుసు. పైగా కథ చాలా బాగుంది కాబట్టి ఏమాత్రం సందేహం లేకుండా మూవీ ప్రొడ్యూస్ చేశాను. మూడేళ్లు ఈ మూవీ కోసం వర్క్ చేశాం. ప్రాణం పెట్టి పనిచేశాం. మా సినిమాకు శాటిలైట్, ఓటీటీ, మ్యూజిక్.. రైట్స్ అమ్మకం జరిగిపోయింది. దసరా పండుగ తెలంగాణలో చాలా పెద్ద పండుగ. ఈ పండుగకు ఎన్ని సినిమాలు వచ్చినా ప్రేక్షకులు చూస్తారు. మొదట్లో మాకు తక్కువ థియేటర్స్ లభించినా, మౌత్ టాక్ తో , పాజిటివ్ టాక్ తో ఎక్కువ స్క్రీన్స్ పెరుగుతాయనే నమ్మకం ఉంది. మా మూవీలో అనుపమ తన పర్ ఫార్మెన్స్ తో ఆకట్టుకుంటారు. ఆమె తెలంగాణ యాస నేర్చుకున్నారు. వర్క్ షాప్స్ లో పాల్గొన్నారు. నరేష్ గారు కూడా యాస నేర్చుకుని బాగా నటించారు. ఈ కథ విన్న వెంటనే అనుపమ తప్ప మరో నాయికను అనుకోలేదు. నరేష్ గారి క్యారెక్టర్ కూడా ఆయన తప్ప మరొకరు చేయరు అనిపించింది. సినిమా చూశాక మీకు కూడా ఇదే ఫీల్ కలుగుతుంది.

## 'రణబాలి' నా కెరీర్ లో పెద్ద హైలైట్: విజయ్ దేవరకొండ



విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ "రణబాలి". ఈ సినిమాకు రాహుల్ సం కృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఈ నెల 16న విజయ దశమి పర్వదినం సందర్భంగా "రణబాలి" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ప్రొడ్యూసర్ నవీన్ యెర్నేని మాట్లాడుతూ మా "రణబాలి" సినిమా ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నాము. ఇలాంటి గొప్ప కథ మా దగ్గరకు వచ్చినందుకు సంతోషిస్తున్నాం. విజయ్ రశ్మిక పెళ్లయ్యాక జంటగా మా సినిమాలో నటిం చడం అదృష్టంగా భావిస్తున్నాం. ప్రొడ్యూసర్ రవిశంకర్ మాట్లాడుతూ మా డైరెక్టర్ రాహుల్ ఎంతో రీసెర్చ్ చేసి డీటెయిల్స్ సేకరించి ఈ సినిమాను రూపొందించాడు. ఈ సినిమా కోసం ఆయన ఎంతో కష్టపడ్డారు. డైరె క్టర్ రాహుల్ సంకృత్యాన్ మాట్లా డుతూ నేను సినిమా చేసి చాలా ఏళ్లవుతోంది. ఒక గొప్ప సినిమా మీ ముందుకు తీసుకురావడానికి ఇంత టైమ్ తీసుకున్నాను. రణబాలి అనే సినిమాను నేను గర్వంగా మీ ముందుకు తీసుకొస్తున్నాను. హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ మరో 8 రోజుల్లో దసరా పండక్కి రణబాలి సినిమా మీ ముందుకు వస్తోంది. మనకు ఏ చరిత్ర తెలియకుండా దాచారో, ఏ వీరుల చరిత్ర తెలియకూడదు అనుకున్నారో, ఏ కథలు జానప థాల్లో, బుర్రకథల్లో చెబుతూ మనం మర్చిపోకుండా చేశారో, ఆ చరిత్రను సరిదిద్దే ప్రయత్నం అక్టోబర్ 16న రణబాలి చేయబోతున్నాడు. ఆ వీరులను సెలబ్రేట్ చేసే ప్రయత్నమే మా సినిమా. ఆ బుర్రకథల్ని, చరిత్రను ప్రపంచమంతా చూసేలా బిగ్ స్క్రీన్ మీద ఎక్స్‌పీరియన్స్ చేసేలా ఆ ప్రపంచంలోకి మీ అందరినీ తీసుకెళ్లేలా రణబాలి ఉంటుందని గట్టిగా నమ్ముతున్నాను.

## 'అలియాస్ రుక్మిణి' డిసెంబర్ 4న రిలీజ్



బ్లాక్‌బస్టర్ సక్సెస్ 'కోర్ట్ - స్టేట్ వర్సెస్ ఎ నోబడీ' తర్వాత న్యాచురల్ స్టార్ నాని యునాని మస్ ప్రొడక్షన్స్ మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో రాబోతోంది. 'అలియాస్ రుక్మిణి' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నితిన్ హీరోగా నటిస్తుండగా, 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. దీప్తి గంటా నిర్మిస్తున్న 'అలియాస్ రుక్మిణి' ఒక విలక్షణమైన కథనంతో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకుంటోంది. ఈ చిత్రాన్ని పూర్తి చేయడానికి కేవలం ఒక షెడ్యూల్ మాత్రమే మిగిలి ఉంది. శరవేగంగా షూటింగ్ జరుగుతుండటంతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మేకర్స్ సినిమా ప్రపంచవ్యాప్త థియేట్రికల్ రిలీజ్‌కు డిసెంబర్ 4వ తేదీని ఖరారు చేశారు. రిలీజ్ డేట్ పోస్టర్‌లో నితిన్ ఒక సాధారణ మధ్యతరగతి వ్యక్తిగా కనిపిస్తున్నారు. చెక్స్ షర్ట్, ఫార్మల్ ట్రౌజర్స్, కళ్లద్దాలు ధరించి, భుజానికి బ్యాగ్ తగిలించుకుని కోర్టు ప్రాంగణంలో జనాల మధ్య నిలబడి ఉన్నారు. వెనుకవైపు న్యాయవాదులు, పోలీసులు కనిపిస్తున్నారు. ఆయన ముఖంలోని ప్రశాంతతతో పాటు ఏదో కొత్త పరిస్థితిని ఎదుర్కొంటున్న వ్యక్తిలా కనిపించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. మరోవైపు హీరోయిన్ సిల్హౌట్ కథలోని మిస్టరీని మరింత పెంచుతోంది.కృష్ణ అనే కథానాయకుడు సాధారణమైన, ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతుంటాడు. అయితే కొన్ని నిజాలను బయటపెట్టకుండా ఉండటమే మంచిదనే పరిస్థితులు ఎదురవుతుంటాయి. అలాంటి సమయంలో అతడి జీవితంలోకి ప్రేమ ప్రవేశిస్తుంది. అనుకోకుండా బయటపడిన ఓ రహస్యం అతను నమ్మిన ప్రతిదాన్నీ తలకిందులు చేసే పరిస్థితి ఏర్పడుతుంది.

## 'ఇట్లు అర్జున' చాలా కొత్త లవ్ స్టోరీ



అనీష్, అనస్వర రాజన్, ఎస్. తమన్ 'ఇట్లు అర్జున' నుంచి 'యెల్లో చున్ని' సాంగ్ లాంచ్.. ఫీల్‌గుడ్ వైబ్స్‌తో అదరగొడుతున్న సాంగ్ స్టార్ డైరెక్టర్ వెంకీ కుడుముల నిర్మాతగా వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్న చిత్రం 'ఇట్లు అర్జున'. ఈ సినిమాతో అనీష్ హీరోగా పరిచయం అవుతుండగా, డెబ్యూ దర్శకుడు మహేష్ ఉప్పల దర్శకత్వం వహిస్తున్నారు. అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్నారు. తమన్ ఎస్ మ్యూజిక్ అందిస్తున్నారు. టైటిల్ గ్లింప్స్, ఇప్పటికే విడుదలైన రెండు పాటలు, ఇతర ఆసక్తికరమైన ప్రమోషనల్ కంటెంట్‌తో సినిమా ఇప్పటికే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచింది. ఈ సినిమా అక్టోబర్ 30న థియేటర్లలో విడుదల కానుంది. తమన్ ఎస్ బ్యూటిఫుల్ మెలోడీని కంపోజ్ చేశారు. ఈ పాటను తమన్, విశాల్ మిశ్రా కలిసి ఆలపించగా, శ్రీజో లిరిక్స్ ఆకట్టుకున్నాయి. అనీష్, అనస్వర రాజన్ తమ స్క్రీన్ ప్రెజెన్స్‌తో పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. సాంగ్ లోంచి ఈవెంట్లో మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మాట్లాడుతూ.. 'ఇట్లు అర్జున' లవ్లీ జర్నీ. లవ్ స్టోరీ అంటే చాలా ఇష్టం. సాధారణంగా థియేటర్లు, పగిలి పోవాలి, స్పీకర్లు కాలిపోవాలి అని నాకు మెసేజ్‌లు పెడుతుంటారు. కానీ మహేష్ వచ్చి 'గుండె పగిలిపోవాలి'అని చెప్పాడు. అలాంటి కథలు వచ్చినప్పుడు చాలా ఇంట్రెస్ట్ వస్తుంది. మహేష్‌కి థాంక్యూ. హీరో అనీష్ మాట్లాడుతూ... మీ అందరి ఎనర్జీ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. మీ అందరికీ ఎల్లో చున్ని పాట నచ్చడం ఇంకా ఆనందంగా ఉంది. మూవీలో నాకు ఫేవరెట్ సాంగ్ ఇది. ఒక అమ్మాయి నవ్వితే ఎంత బ్యూటిఫుల్‌గా ఉంటుందో చెప్పే సాంగ్ ఇది. మా కొరియోగ్రాఫర్స్ చాలా బ్యూటిఫుల్‌గా చేశారు. హీరోయిన్ అనస్వర రాజన్ మాట్లాడుతూ.. అమ్మాయిలు, అబ్బాయిలు అందరికీ ఈ పాట డెడికేట్ చేస్తున్నాను. వెరీ బ్యూటిఫుల్ సాంగ్. అక్టోబర్ 30న మీరందరూ థియేటర్‌లోకి వెళ్లి సినిమా చూడండి. డైరెక్టర్ మహేష్ మాట్లాడుతూ..ఇట్లు అర్జునకి ఆల్రెడీ సక్సెస్ వైబ్స్ వచ్చాయని అంటున్నారు. దానికి కారణం తమన్. ఆయన అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. మా టీమ్ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు.

## 'సీన్'లో 'అమ్మో ఇది ఎవర్రా' సాంగ్ రిలీజ్



హీరో సూర్య, మలయాళ బ్లాక్‌బస్టర్ 'ఆవేశం' ఫేమ్ దర్శకుడు జిత్తు మాధవన్‌తో కలిసి యాక్షన్‌కామెడీ ఎంటర్‌టైనర్ 'సీన్' చేస్తున్నారు. నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఆనంద్ రాజ్, లాల్, రాజ్ ప్రియన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జ్యోతిక, సూర్య జాగరం స్టూడియోస్, 2డీ ఎంటర్‌టైన్ మెంట్ బ్యానర్లపై ఈ చిత్రాన్ని నిర్మిస్తు న్నారు. ఇప్పుడు మ్యూజి కల్ జర్నీని ఫస్ట్ సింగిల్ 'అమ్మో ఇది ఎవర్రా'తో ప్రారంభించారు. సుశిన్ శ్యామ్ కంపోజ్ చేసిన ఈ పాట ఫుట ట్యాపింగ్ బీట్స్, వెంటనే ఆకట్టుకునే రిథమ్‌తో అదిరిపోయే ఎనర్జీని అందిస్తోంది. పాటలోని వైబ్రెంట్ మూడ్‌కు తగ్గట్టుగా ఈ అప్‌బీట్ కంపోజిషన్ ఆకట్టుకుంది. వీడియో గేమ్ కాన్సెప్ట్ చుట్టూ ఈ పాటను క్రియేటివ్‌గా డిజైన్ చేశారు. కొరియోగ్రాఫర్ రాజ్ ప్రియన్ ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఈ యూనిక్ ఐడియా పాటకు ప్లేఫుల్ టచ్‌ను తీసు కొచ్చింది. ఫన్, క్విర్కీ ఎలిమెంట్స్‌తో పాటను ఆసక్తికరంగా ప్రెజెంట్ చేశారు. ముఖ్యంగా నజ్రియా నజీమ్ పాటంతా ఫుల్ ఎనర్జీ, ఉత్సాహంతో కనిపించారు. 'సీన్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2026 నవంబర్ 6న దీపావళి కానుకగా థియేటర్లలో విడుదల కానుంది.

## యు/ఎ సర్టిఫికెట్ పొందిన 'చంద్రయాన్'



సెన్సార్ నుంచి యు/ఎ సర్టిఫికెట్ పొందిన 'చంద్రయాన్'
ఈ నెల 30న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతున్న సినిమా రాజు వెడ్స్ రాంబాయి సూపర్ హిట్ తర్వాత నిర్మాత వేణు ఊడుగుల తన సమర్పణలో 'చంద్రయాన్' టైటిల్ తో మరో ఇంట్రెస్టింగ్ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ చిత్రంలో శివకుమార్ ధీకొండ, స్వప్న ప్రియ దర్శిని, రవి శివతేజ, వంశీధర్, లోకేష్, బలగం సత్యనారాయణ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సింబ స్క్రీన్ స్టోరీస్ బ్యానర్ పై ప్రవీణ్ మొలక నిర్మిస్తున్నారు. శ్రీనాథ్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. హిలేరియస్ అడ్వెంచర్ స్టోరీతో తెరకెక్కిన "చంద్రయాన్" సినిమా ఈ నెల 30న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. తాజాగా ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బృందం యు/ఎ సర్టిఫికెట్ ఇచ్చింది. రూరల్ బ్యాక్ డ్రాప్ లో సరికొత్త కథా కథనాలతో మంచి ఎంటర్ టైనింగ్ సినిమా చేశారంటూ సెన్సార్ టీమ్ ప్రశంసించారు. ఇటీవలే రిలీజ్ చేసిన "చంద్రయాన్" చిత్ర గ్లింప్స్ హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. ఈ నెల 30న థియేటర్స్ లో స్ట్రాంగ్ కంటెంట్ ఉన్న అడ్వెంచర్ ఫన్ మూవీ చూడబోతున్నామనే ఇంప్రెషన్ ఈ చిత్ర ప్రమోషనల్ కంటెంట్ తో ప్రేక్షకుల్లో కలుగుతోంది.

# ఐపిఎల్ 2027 ముందు.. పంజాబ్ కింగ్స్‌కు షాక్

## ఇద్దరు కోచ్‌లు ఔట్



**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 2027 సీజన్‌కు ముందు కీలక సమయంలో పంజాబ్ కింగ్స్‌కు ఎదురుదెబ్బ తగిలింది. హెడ్ కోచ్ రికీ పాంటింగ్ సహాయక బృందంలోని ఇద్దరు కీలక సభ్యులు తమ పదవుల నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది. ఆటగాళ్ల రిటెన్షన్ ప్రక్రియ, వేలం సన్నాహాలు సమీపిస్తున్న నేపథ్యంలో కోచింగ్ బృందాన్ని పటిష్ఠం చేసుకోవడం పాంటింగ్‌కు పెద్ద సమస్యగా మారింది. ఫాస్ట్ బౌలింగ్ కోచ్ జేమ్స్ హోప్స్, ఫీల్డింగ్ కోచ్ బ్రాడ్ హాడిన్ పంజాబ్ ఫ్రాంచైజీని వీడాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఆస్ట్రేలియాకు చెందిన హోప్స్, హాడిన్ తమ నిర్ణయాలను ఇటీవలే పంజాబ్ కింగ్స్ యాజమాన్యానికి తెలియజేసినట్లు తెలుస్తోంది. వీరిద్దరికీ బిగ్ బాష్ లీగ్ (బిబిఎల్)లో అవకాశం వచ్చినట్లు సమాచారం. జేమ్స్ పంజాబ్ కింగ్స్‌కు ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా సేవలందించారు. అంతకుముందు రికీ పాంటింగ్‌తో కలిసి ఢిల్లీ క్యాపిటల్స్‌లోనూ పనిచేశాడు. పాంటింగ్‌తో ఉన్న అనుబంధం కారణంగా పంజాబ్ జట్టులో చేరాడు. ఇప్పుడు హోప్స్ నిష్క్రమణతో బౌలింగ్ విభాగానికి కొత్త కోచ్‌ను ఎంపిక చేయాల్సి ఉంటుంది. మరోవైపు బ్రాడ్ హాడిన్ ఫీల్డింగ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. పాంటింగ్ పంజాబ్ కింగ్స్‌లో చేరకముందే హాడిన్ జట్టు సహాయక సిబ్బందిలో భాగంగా ఉన్నాడు. గతంలో ట్రెవర్ బేలిస్ కోచ్ ఉన్న సమయంలో ఆయనను నియమించారు. హోప్స్, హాడిన్ స్థానాలకు సరైన ప్రత్యామ్నాయాలను ఎంపిక చేసే బాధ్యత పాంటింగ్స్ పైనే ఉండనుంది. కోచింగ్ సిబ్బందిలో మార్పులపై పాంటింగ్, ఫ్రాంచైజీ యాజమాన్యం చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. డిసెంబర్లో జరగనున్న ఐపిఎల్ 2027 వేలానికి ముందే కొత్త కోచ్ల నియామక ప్రక్రియను పూర్తి చేయాలని పంజాబ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక పంజాబ్ కింగ్స్‌లో మరో కోచ్ స్థానం కూడా ఖాళీగా ఉంది. స్పిన్ బౌలింగ్ కోచ్‌గా పనిచేసిన సాయిరాజ్ బహుతులే ఐపీఎల్ 2026 తర్వాత ఆ జట్టును వీడి భారత జట్టు సహాయక సిబ్బందిలో చేరారు. అంతకుముందు పంజాబ్ కింగ్స్‌లో ఈ బాధ్యతలు నిర్వహించిన సునీల్ జోషి బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో స్పిన్ బౌలింగ్ విభాగానికి మారడంతో ఆయన స్థానంలో బహుతులేను నియమించారు.

దీంతో ఐపిఎల్ 2027 సీజన్‌కు ముందు పంజాబ్ కనీసం ముగ్గురు కోచ్‌లను కొత్తగా నియమించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ 14 మ్యాచ్లో ఏడు విజయాలు, ఆరు ఓటములతో 15 పాయింట్లు సాధించింది. +0.309 నెట్ రన్రేట్తో పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో నిలిచింది.



## సిరియాపై 2-0 తేడాతో
# భారత్ విజయం

**సెలయాంగ్:** సిరియాపై 2-0 తేడాతో ఆధిపత్య విజయం సాధించడం ద్వారా, భారత అండర్17 మహిళల జట్టు తమ ఏఎఫ్‌సి అండర్17 మహిళల ఆసియా కప్ చైనా 2027 క్వాలిఫయర్స్ ప్రచారంలో మరో కీలక ముందడుగు వేసింది. తొలి మ్యాచ్‌లో ఇరాక్‌పై భారత్ సాధించిన 140 రికార్డు విజయంలో ఐదు గోల్స్ చేసిన అనుష్క కుమారి, విరామానికి ముందు, తర్వాత చెరో గోల్ చేసి, తన క్వాలిఫయర్స్ గోల్స్ సంఖ్యను ఏడుకు చేర్చింది. భారత జట్టు కేవలం ఆరు నిమిషాల్లోనే ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అనుష్క చివరకు స్కోరును 2-0కి చేర్చింది. ఉరుములతో కూడిన వర్షం కారణంగా 58వ నిమిషంలో ఆటను నిలిపివేశారు. దాదాపు అరగంట ఆలస్యం తర్వాత ఆట తిరిగి ప్రారంభం కాగా, సెలయాంగ్ ఫ్లడ్‌లైట్ల వెలుగులో ఆట చివరి దశల్లో కూడా వర్షంకొనసాగింది. భారత్ చివరి వరకు ఒత్తిడి కొనసాగించినప్పటికీ, సిరియా సంఖ్యాబలంతో రక్షణాత్మకంగా ఆడి స్కోరును తక్కువగా ఉంచగలిగింది. తండమోని కుడివైపున ప్రత్యామ్నాయ క్రీడాకారిణి ప్రీతికబర్మన్‌కు బంతిని అందించినప్పుడు, అనుష్క తన హ్యాట్రిక్‌ను పూర్తి చేయడానికి ఒక సువర్ణావకాశం లభించింది. దీంతో భారత్ జట్టు ఈ క్వాలిఫైయింగ్ ప్రచారంలో తమ వరుసగా రెండవ విజయాన్ని, క్లీన్ షీట్‌ను నమోదు చేశాయి.

## హాకీ టోర్నీ నుంచి..
# పాకిస్థాన్ ఔట్.. బంగ్లాదేశ్ ఇన్..
### తటస్థ వేదిక అభ్యర్థనను తోసిపుచ్చిన హాకీ ఇండియా



**న్యూఢిల్లీ:** భారత్ ఆతిథ్యమివ్వనున్న 2026 ఆసియన్ హాకీ ఛాంపియన్స్ ట్రోఫీలో అనూహ్య మార్పు చోటుచేసుకుంది. ఇరు దేశాల మధ్య నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతలు, భద్రతా కారణాలను చూపుతూ ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ నుంచి పాకిస్థాన్ హాకీ జట్టు వైదొలగింది. దీంతో, రిజర్వ్ జట్టుగా ఉన్న బంగ్లాదేశ్‌కు ఆసియన్ హాకీ ఫెడరేషన్ (ఏహెచ్‌ఎఫ్) టోర్నీలో పాల్గొనేందుకు అవకాశం కల్పించింది. ఈ టోర్నమెంట్‌ను అక్టోబర్ 27 నుంచి నవంబర్ 5 వరకు పంజాబ్‌లోని జలంధర్, మొహాలీ నగరాల్లో నిర్వహించనున్నారు. అయితే, తమ ఆటగాళ్ల భద్రతపై ఆందోళన వ్యక్తం చేసిన పాకిస్థాన్ హాకీ ఫెడరేషన్ (పీహెచ్‌ఎఫ్), తమ మ్యాచ్‌లను ఏదైనా తటస్థ వేదికకు మార్చాలని ఏహెచ్‌ఎఫ్‌ను కోరింది. ఈ అభ్యర్థనను హాకీ ఇండియా నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. షెడ్యూల్ ప్రకారమే టోర్నీ జరుగుతుందని స్పష్టం చేయడంతో పాక్ ఈ పోటీల నుంచి తప్పుకుంటున్నట్లు అధికారికంగా ప్రకటించింది. పాకిస్థాన్ వైదొలగడంతో ఏహెచ్‌ఎఫ్ ఆహ్వానం మేరకు బంగ్లాదేశ్ ఈ టోర్నీలో పాల్గొనేందుకు అంగీకరించింది. దీంతో ఆతిథ్య భారత్‌తో పాటు జపాన్, చైనా, మలేషియా, దక్షిణ కొరియా, బంగ్లాదేశ్ జట్లు టైటిల్ కోసం పోటీపడనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత్ ఇప్పటివరకు నాలుగుసార్లు ఈ టైటిల్‌ను గెలుచుకుంది. 2018లో భారత్, పాకిస్థాన్ జాయింట్ విన్నర్స్‌గా నిలవడం గమనార్హం. ఇటీవలి కాలంలో భారత్‌లో జరిగే ఆసియా కప్, జూనియర్ వరల్డ్ కప్ వంటి టోర్నీలకు కూడా పాక్ జట్టు దూరంగా ఉంది.

## మహిళల ఫుట్‌బాల్..
# యువ భారత్ చిత్తు
### రష్యా చేతిలో 0-4 తేడాతో ఓటమి



**కోల్‌కతా:** రెండు అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్‌లలో మొదటిదానిలో, యువ భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు రష్యా చేతిలో 0-4 తేడాతో ఓటమి పాలైంది. ఆతిథ్య జట్టుపై నిరంతర ఒత్తిడి తెచ్చిన తర్వాత, సందర్శక జట్టు నాలుగు గోల్స్‌ను సాధించింది. ప్రపంచ ర్యాంకింగ్‌లో 69వ స్థానంలో ఉన్న భారత్, 27వ ర్యాంకులో ఉన్న రష్యాను తొలి అర్ధభాగంలో చాలాసేపు కట్టడి చేసింది. అయితే 40వ నిమిషంలో ఇయానా షెయినా తొలి గోల్ చేసి ఆధిక్యాన్ని అందించింది. ప్రత్యామ్నాయ క్రీడాకారిణి కిరా పెటుఖోవా 60, 65వ నిమిషాల్లో చెరో గోల్ చేయగా, 81వ నిమిషంలో ఇయానా స్విస్తునోవా నాలుగో గోల్‌ను జోడించింది. ఈ మ్యాచ్ కోల్‌కతాలో జరిగిన మొట్టమొదటి మహిళల అంతర్జాతీయ ఫుట్‌బాల్ మ్యాచ్ కావడం విశేషం. రష్యా వ్యూహానికి తొలి అర్ధభాగంలో భారత్ పటిష్టమైన రక్షణ వ్యూహాన్ని కొనసాగించింది. అతిథి జట్టును నిలువరించడానికి మోనాలిషా అనేక కీలకమైన సేవ్స్ చేసింది. భారత్ కూడా తమ వంతు అవకాశాలను సృష్టించుకుంది. ఆట మొదలైన అరగంట తర్వాత మాలవిక గోల్ చేసే యత్నం చేసినా, రష్యన్ గోల్ కీపర్ నటాలియా సిలినా దాన్ని అడ్డుకుంది. లిండా కోమ్ సెర్టోకు కూడా అవకాశం లభించినా గోల్ చేయలేకపోయింది. చివరకు షీనా రష్యాకు ఆధిక్యం అందించింది. 60వ నిమిషంలో నదేజ్దా స్మిర్నోవా కొట్టిన షాట్‌ను మోనాలిషా అడ్డుకున్న తర్వాత, పెటుఖోవా మళ్ళీ గోల్ చేసింది. 66వ నిమిషంలో చెత్రి జట్టు శుభాంగి సింగ్, ప్రియదర్శిని సెల్లాదురై, రేణులను బరిలోకి దించుతూ మార్పు చేసినా 81వ నిమిషంలో స్విస్తునోవా స్కోరింగ్‌ను పూర్తి చేయడంతో రష్యా గెలుపుసాధించింది.

# షాంఘై మాస్టర్స్.. షెల్టన్ ముందంజ



**చైనా:** బెన్ షెల్టన్ శుక్రవారం డేనియల్ ఆల్ట్‌మాయర్‌పై స్ట్రెయిట్ సెట్స్‌లో విజయం సాధించి, షాంఘై మాస్టర్స్‌లో మూడవ రౌండ్‌లోకి ప్రవేశించి తన 24వ పుట్టినరోజును జరుపుకున్నాడు. డేవిస్ కప్‌లో యుఎస్ఎ తరపున తన రెండు మ్యాచ్‌లలోనూ ఓడిపోయి, ఆ తర్వాత లేవర్ కప్ నుండి వైదొలిగిన షెల్టన్, 6-3, 7-6 (6) తేడాతో గెలిచాడు. అంతకు ముందు, అలెక్స్ మోల్కాన్ అనే ప్రత్యర్థి పేరు వెల్లడించని అనారోగ్యంతో వైదొలగడంతో అలెక్స్ డి మినార్ మూడవ రౌండ్‌లోకి ప్రవేశించాడు. క్వాలిఫయర్ రే సకామోటో 23వ సీడ్ ఆండ్రీ రుబ్లెవ్‌ను 6-4, 6-4 తేడాతో ఓడించాడు. ఆ తర్వాత యూఎస్ ఓపెన్ ఫైనల్‌లో షెల్టన్‌ను ఓడించిన టాప్ సీడెడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్, చైనా వైల్డ్ కార్డ్ ఎంట్రీ వు యిబింగ్‌ను 6-4, 7-6 (4) తేడాతో ఓడించగా, నోవాక్ జొకోవిచ్ హుబెర్ట్ హుర్కాజ్‌తో తలపడనున్నాడు.

# భారీ లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు
### ఐటి షేర్లలో కొనుగోళ్ల జోరు




**ముంబయి, అక్టోబరు 9:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిశాయి. వరుసగా రెండు సెషన్ల నష్టాలకు బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకే తాలు, ముడి చమురు ధరల తగ్గుదల ఇన్వెస్టర్ల కొనుగోళ్లకు ఊతమిచ్చాయి. అమెరికా మధ్యంతర ఎన్నికలకు ముందు ఇరాన్‌పై సైనిక దాడి చేపట్టబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం పశ్చిమాసియాలో ఉద్రిక్త తలు మరింత పెరుగుతాయన్న ఆందోళనలను కొంత తగ్గించింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాల నేపథ్యంలో ఐటీ షేర్లలో కొనుగోళ్లు పెరగడం కూడా మార్కె ట్లకు మద్దతునిచ్చింది. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 879.09 పాయింట్లు లాభపడి 72,472.33 వద్ద స్థిరప డింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 288.65 పాయింట్లు పెరిగి 22,520.45 వద్ద ముగి సింది. ఎన్ఎస్ఈలో నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ మినహా మిగతా అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ లాభాల్లో ఐటీసీ, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు కీలక పాత్ర పోషించాయి. ఐటీసీ షేరు 4.31 శాతం, ఇన్ఫోసిస్ 2.65 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.17 శాతం చొప్పు న పెరిగాయి. టీసీఎస్ షేరు 3.85 శాతం లాభపడింది. హెక్సావేర్ టెక్నాల జీస్ షేరు 5.98 శాతం ఎగసింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలోనూ కొనుగోళ్లు కనిపించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 సూచీ 1.37 శాతం పెరగగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 సూచీ 0.49 శాతం లాభపడింది. మార్కెట్‌లో కొనుగోళ్ల ఆధిపత్యంఎన్ఎస్ఈలో మొత్తం 2,182 షేర్లు లాభాల్లో ముగియగా, 1,391 షేర్లు నష్టపో యాయి. మరో 111 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ డిసెంబర్ 2026 కాంట్రాక్టు ధర బ్యారెల్‌కు 1.34 డాలర్లు తగ్గి 102.94 డాలర్లకు చేరింది. అమెరికా పదేళ్ల ప్రభుత్వ బాండ్ల రాబడి 0.40 శాతం పెరిగి 5.250 స్థాయికి చేరింది. భారత్ పదేళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ రాబడి గత సెషన్‌లోని 7.289 శాతం నుంచి 7.302 శాతానికి పెరిగింది. విదేశీ మారక మార్కెట్లో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలపడింది. గత ట్రేడింగ్ సెషన్‌లో 96.8800 వద్ద ముగిసినరూపాయి, శుక్రవారం 96.7200 స్థాయిలో కదలాడింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ లో డిసెంబర్ 4, 2026 డెలివరీ గోల్డ్ ఫ్యూ చర్స్ ధర 1.01 శాతం పెరిగి రూ.1,51,115కు చేరింది. పీ ఎన్ గాడ్గిల్ జ్యువెలర్స్ రెండో త్రైమాసికంలో ఆదాయం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 22.4 శాతం పెరిగినట్లు కం పెనీ వెల్లడించడంతో షేరు 2.01 శాతం లాభ పడింది. పేస్ డిజిటెక్: బీఎస్ఈఎస్ రాజధాని పవర్ (బీఆర్పీఎల్) నుంచి లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ) అందుకోవడంతో షేరు 2.87 శాతం పెరిగింది. ఎస్ఎంఎల్ మహీంద్రా: షేరు 0.52 శాతం తగ్గింది.

# రూ.10.3 లక్షల కోట్ల వరకు కంపెనీ విలువ
### 21న జియో ఐపిఓ బిడ్డింగ్ ప్రారంభం

**ముంబై, అక్టోబరు 9:** రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీకి చెందిన జియో ప్లాట్‌ఫామ్స్ తన తొలి ఐపీఓలో ఒక్కో షేరు ధరను రూ.1,065 నుంచి రూ.1,119 మధ్య నిర్ణయించవచ్చన్న అంచనాలు పెరిగాయి. ఈ ఐపీఓ ద్వారా జియో ప్లాట్‌ఫామ్స్ మార్కెట్ విలువను గరిష్ఠంగా రూ.10.3 లక్షల కోట్లకు (సుమారు 107 బిలియన్ డాలర్లు) చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ప్రతిపాదిత ధరల శ్రేణిలో గరిష్ఠ ధర వద్ద షేర్లను విక్రయిస్తే సుమారు రూ.30,200 కోట్ల నిధులు సమీకరించే అవకాశం ఉందని బిజినెస్ నిపుణుల లెక్కలు సూచిస్తున్నాయి. ఇదే జరిగితే భారతదేశంలో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద ఐపీఓగా జియో నిలవనుంది. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు ఈనెల 21న దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించి, 23న ముగించాలని యోచిస్తున్నట్లు సమాచారం. యాంకర్ ఇన్వెస్టర్ల కోసం అక్టోబర్ 19న బుక్ ప్రారంభం కావచ్చని, అక్టోబర్ 28న షేర్లు స్టాక్ మార్కెట్లలో లిస్ట్ అయ్యే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. హ్యుందాయ్ ఐపీఓ రికార్డు అధిగమించే అవకాశం

ప్రస్తుతం భారతదేశంలో అతిపెద్ద ఐపీఓగా హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ షేర్ల విక్రయం ఉంది. 2024 అక్టోబర్‌లో ఆ కంపెనీ సుమారు రూ.27,800 కోట్ల నిధులను సమీకరించింది. జియో ప్రతిపాదిత ఐపీఓ ఈ రికార్డును అధిగమించే అవకాశం ఉంది. జియో ప్లాట్‌ఫామ్స్ జూన్‌లో సమర్పించిన ప్రాథమిక ప్రాస్పెక్టస్‌లో గరిష్ఠంగా 27 కోట్ల కొత్త షేర్లను జారీ చేసే ప్రతిపాదన ఉంది. ఇవి ఐపీఓ అనంతరం కంపెనీ మొత్తం ఈక్విటీ మూలధనంలో సుమారు 2.93 శాతానికి సమానం. గతంలో కంపెనీ విలువను సుమారు రూ.11 లక్షల కోట్లుగా నిర్ణయించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అంతకుముందు కొన్ని అంచనాల్లో కంపెనీ విలువ 130 బిలియన్ డాలర్ల నుంచి 170 బిలియన్ డాలర్ల వరకు ఉంటుందని భావించారు. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ జియో ప్లాట్‌ఫామ్స్ విలువను 115 బిలియన్ డాలర్ల నుంచి 118 బిలియన్ డాలర్ల మధ్య అంచనా వేసింది. దోలత్ క్యాపిటల్ మాత్రం కంపెనీ విలువను సుమారు 110 బిలియన్ డాలర్లుగా పేర్కొంది. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ ప్రక్రియలో భాగంగా మొత్తం 19 బ్యాంకులను నియమించింది. వీటిలో కోటక్ మహీంద్రా క్యాపిటల్, మోర్గాన్ స్టాన్లీ, బ్యాంక్ ఆఫ్ అమెరికా, యాక్సిస్ క్యాపిటల్, బీఎన్‌పీ పారిబాస్, సిటీగ్రూప్ తదితర ప్రముఖ ఆర్థిక సంస్థలు ఉన్నాయి.




# జీతాలు,బోనస్‌లే కాదు..డిస్కౌంట్‌కే ఉద్యోగులకు షేర్లు
### ఎన్విడియా సక్సెస్ స్టోరీ చెప్పిన హెచ్ఆర్‌డి అధినేత




**న్యూఢిల్లీ,అక్టోబరు 9:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న సంస్థల్లో ఎన్విడియా ఒకటి. మార్కెట్ విలువ పరంగా కూడా ప్రపంచంలో ఇదే అతిపెద్ద సంస్థ. ప్రస్తుత మార్కెట్ విలువ 5.70 ట్రిలియన్ డాలర్లకుపైనే ఉండగా భారత కరెన్సీలో చూస్తే ఇది రూ. 550 లక్షల కోట్లకుపైనే ఉంటుంది. ఈ కంపెనీ షేరు ధర భారీగా పెరగడంతో ఉద్యోగులకు కూడా మంచి ప్రయోజనాలు దక్కుతున్నాయి. అయితే ఇక్కడ ఉద్యోగులను తమ సంస్థలో ఎక్కువ కాలం కొనసాగించడానికి కేవలం జీతాలు, బోనస్‌పైనే ఆధారపడటం లేదని ఎన్విడియా చెబుతోంది. కంపెనీ హెచ్ఆర్ డైరెక్టర్ ఫిబే పున్సలాన్ ఫార్చ్యూన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఉద్యోగులకు తాము అందించే కొన్ని రకాల ప్రయోజనాలను వివరించారు. ఎన్విడియాలో పని చేసే ఉద్యోగులు తమ జీతం నుంచి డబ్బును ఉపయోగించి కంపెనీ షేర్లను మార్కెట్ ధర కంటే ఏకంగా 15 శాతం డిస్కౌంట్‌తో కొనుగోలు చేయొచ్చు. దీంతో ఈ స్కీమ్ ద్వారా షేర్లు కొనుగోలు చేసిన ఉద్యోగులకు మంచి ప్రయోజనం కలిగే అవకాశం ఉంది.

కొంత మంది ఉద్యోగులు ఈ షేర్ల విలువ పెరగడంతో లక్షాధికారులు, కోటీశ్వరులుగా మారినట్లు నివేదిక పేర్కొంది. అయితే ఉద్యోగులకు లభించే ప్రయోజనాలకు తగ్గట్లుగానే పని ఒత్తిడి కూడా ఎక్కువగానే ఉంటుందని హెచ్ఆర్ డైరెక్టర్ ఈ సందర్భంగా అంగీక రించారు. ఇక ఉద్యోగులకు ఎన్విడియా అందించే మరో ప్రయోజనం ఫ్రీ డేస్. ప్రతి 3 నెలలకు 2 రోజులు కంపెనీ తన కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేస్తుంది. అంటే ఏటా 8 అదనపు సెలవులు లభిస్తాయి. కోవిడ్19 సమయంలో ఉద్యోగుల నుంచి నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ రోజుల్లో ఉద్యోగులు తమ పని నుంచి పూర్తిగా రెస్ట్ తీసుకోవచ్చు. తిరిగి విధుల్లో చేరినప్పుడు పెండింగ్ వర్క్ అలానే ఉండిపోకుండా కంపెనీ ఈ విధానాన్ని అమలు చేస్తోంది.

ఇంకా ఎన్విడియాలో వ్యవస్థ కూడా ఇతర పెద్ద కంపెనీలతో పోలిస్తే కొంత సరళంగా ఉంటుందని హెచ్ఆర్ డైరెక్టర్ స్పష్టం చేశారు. కంపెనీలో ఉద్యోగుల కొనసాగింపు రేటు కూడా మంచి స్థాయిలో ఉందని చెబుతున్నారు. ఇక ఫార్చ్యూన్ రిపోర్ట్ ప్రకారం ఎన్విడియా ఉద్యోగుల వార్షిక టర్నోవర్ రేటు 3.7 శాతం మాత్రమే. టెక్నాలజీ ఇండస్ట్రీ సగటు 21.9 శాతంగా ఉంది.

## గోల్డ్ ఇటిఎఫ్ ఆస్తుల విలువ రూ.1.91 లక్షల కోట్లు



**ముంబయి, అక్టోబరు 9:** భారత్‌లో బంగారం పెట్టుబడులకు భారీగా ఆదరణ పెరుగుతోంది. గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)లో పెట్టుబడులు ఏడాది వ్యవధిలో ఏకంగా 164 శాతం పెరిగాయి. 2026 ఆగస్టు నాటికి ఈ ఫండ్లలోని ఆస్తుల విలువ రూ.1.91 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే సమయంలో ఈ మొత్తం సుమారు రూ.72,500 కోట్లుగా ఉందని ఎంకే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రకటించింది. ఇన్వెస్టర్లు ఇపుడు బంగారాన్ని పెట్టుబడుల డైవర్సి కేషన్‌లో భాగంగా కూడా ఉపయోగిస్తున్నారు. వెండిఈటీఎఫ్‌లలోనూ ఆగస్టు నాటికి రూ.85 వేల కోట్ల నుంచి రూ.86 వేల కోట్ల వరకు పెట్టుబడులు ఉన్నాయి. బంగారం, వెండి వంటి విలువైన లోహాలపై పెట్టుబడులు పెరుగుతుండటంతో పాటు, పారిశ్రామిక లోహాల మార్కెట్ కూడా విస్తరిస్తోంది. రాగి, అల్యూమినియం, జింక్ వంటి లోహాలకు నిర్మాణ రంగం, తయారీ పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి నుంచి డిమాండ్‌ఉంటుంది. విద్యుత్ వినియోగం పెరగడం, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, విద్యుత్ ప్రసార నెట్‌వర్క్‌లు, సాంకేతిక మౌలిక సదుపాయాల విస్తరణతో వీటికి మరింత డిమాండ్ ఏర్పడుతోంది. మరోవైపు భారత్‌లో మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్లలో పెట్టుబడులు కూడా పెరుగుతున్నాయి. 2026 ఆగస్టు నాటికి వీటి ఆస్తుల విలువ రూ.2.07 లక్షల కోట్లను దాటింది. గత ఏడాదితో పోలిస్తే దాదాపు 57 శాతం వృద్ధి నమోదైంది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ప్రతినిధి షీలా కులకర్ణి మాట్లాడుతూ, బంగారం డిమాండ్ స్వరూపం మారుతోందని, ఈఏడాది తొలి రెండు నెలల్లోనే బంగారం ధరలు 11 సార్లు కొత్త గరిష్ఠాలను నమోదు చేయడం కూడా మార్కెట్‌లో దాని ప్రాధాన్యాన్ని చూపుతోందని అన్నారు.

## రుణాలపై మరింత పెరిగే వడ్డీభారం: గోల్డ్‌మాన్‌శాక్స్ అంచనా




**ముంబయి, అక్టోబరు 9:** రుణాలపై వడ్డీ భారం మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ 2027 జూన్ నాటికి మరో మూడు విడతల్లో వడ్డీ రేట్లు పెంచవచ్చని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. మొత్తం 0.75 శాతం మేర పెంపు ఉండొచ్చని సంస్థ భారత విభాగం ముఖ్య ఆర్థికవేత్త శంతను సేన్‌గుప్తా వెల్లడించారు. డిసెంబరు, ఫిబ్రవరి, ఏప్రిల్ లేదా జూన్‌లో ఈ పెంపులు ఉండవచ్చని పేర్కొన్నారు. వడ్డీ రేట్లు పెరిగే అవకాశాలున్నప్పటికీ, భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి మాత్రం దాదాపు 7శాతంగా కొనసాగవచ్చని సేన్‌గుప్తా అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్నప్పటికీ ఈ స్థాయి వృద్ధిని సాధించడం విశేషమని పేర్కొన్నారు. 2027లో ఎల్‌నినో ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థకు సవాలుగా మారవచ్చని ఆయన హెచ్చరించారు. దీనివల్ల ఆర్థిక వృద్ధికి విఘాతం కలగడంతో పాటు ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుత నిల్వలు సమీప భవిష్యత్తులో ధరల పెరుగుదలను కొంతవరకు అదుపులో ఉంచగల వని వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గితే రబీ పంటల దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడవచ్చని సేన్‌గుప్తా తెలిపారు. 2027నాటికి ఆహార నిల్వలు తగ్గితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ముడిచమురు ధరలు కూడా కీలకంగా మారనున్నాయని ఆయన పేర్కొన్నారు.

## యుఎస్ ఆంక్షలున్నా జోరుతగ్గని ఐటీ షేర్లు

**ముంబయి, అక్టోబరు 9:** అమెరికా గ్రీన్‌కార్డ్ ప్రోగ్రామ్‌పై ఆంక్షలు విధించినా భారత ఐటీ కంపెనీల షేర్లు మాత్రం లాభాల్లో పయనిస్తున్నాయి. నేటి ట్రేడింగ్ ప్రారంభంలో టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో సహా పలు ఐటీ కంపెనీల షేర్లు భారీగా పెరిగాయి. గత సెషన్‌లో మార్కెట్లు తీవ్రంగా పడిపో వడంతో తక్కువ ధరలకు షేర్లు కొనుగోలు చేసేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడం, టీసీఎస్ ఆర్థిక ఫలితాలు, ఏఐ వ్యాపారంలో వృద్ధి ఇందుకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. ట్రేడింగ్‌లో నిఫ్టీ ఐటీ సూచీ 3.31 శాతం పెరిగి 28,654.70 పాయింట్లకు చేరింది. టీసీఎస్ షేరు 4.62 శాతం, ఇన్ఫోసిస్ 3.12 శాతం, విప్రో 3.31 శాతం, టెక్ మహీంద్రా 2.19 శాతం చొప్పున పెరిగాయి. ఎల్‌టీఎం, పర్సిస్టెంట్ సిస్టమ్స్, ఎంఫాసిస్ షేర్లలోనూ కొనుగోళ్లు కనిపించాయి. అమెరికా ప్రభుత్వం టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్‌టెక్ సహా పలు సంస్థలను పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ (పెర్మ్) స్కీంనుంచి తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ ఆంక్షల వల్ల తమ అమెరికా ఉద్యోగుల నియామక వ్యూహం, కస్టమర్లకు అందించే సేవలపై ప్రభావం ఉండబోదని టీసీఎస్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది.

గత రెండేళ్లలో తమ పెర్మ్ దరఖాస్తులు సింగిల్ డిజిట్‌లోనే ఉన్నాయని వెల్లడించింది. వచ్చే ఐదేళ్లలో అమెరికాలో మరో 15 వేల మందిని నియమించుకోవాలన్న ప్రణాళిక కూడా కొనసాగుతుందని పేర్కొంది. ఈ వివరణలు ఇన్వెస్టర్ల ఆందోళనలను కొంత తగ్గించాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.